# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

సోమవారం, డిసెంబరు 10, 2012

పద్ధెనిమిదవ సమావేశము, సంపుటము I, నంబరు. 2

నందననామ సం. కార్తీక బ. 12

**FRIDAY, THE 30TH NOVEMBER, 2012**

**EIGHTEENTH SESSION, VOLUME I, NO.2**

**19TH AGRAHAYAN, 1933 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

# LEGISLATURE SECRETARIAT,
# PUBLIC GARDENS,
# HYDERABAD - 500 004.

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **చైర్మన్** | ః | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ చైర్మన్** | ః | శ్రీ నేతి విద్యాసాగర్ |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | ః | శ్రీ మహమ్మద్ జానీ |
| | | శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి |
| | | శ్రీ బి. చెంగల్‌రాయుడు |
| | | శ్రీ బి. వెంకటేశ్వర్లు |
| **కార్యదర్శి** | ః | డా. ఎస్. రాజ సదారామ్ |
| **ఉప కార్యదర్శులు** | ః | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ జి. వెంకటక్రిష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| **సహాయ కార్యదర్శులు** | ః | శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| | | శ్రీ వి. నరసింహాచార్యులు |
| | | శ్రీమతి టి. సుశీల |
| | | శ్రీ జె. రామలింగేశ్వర్ రావు |
| | | శ్రీ ఎల్. తిరుమల రావు |
| | | శ్రీ హెచ్.ఎ. షఫీ |
| | | శ్రీ ఎమ్. విజయరాజు |
| | | శ్రీ వి. రమేష్ కుమార్ |
| | | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సూరజ్ బహదూర్ |
| | | శ్రీ కె. రాజ్‌కుమార్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |

| | | |
|---|---|---|
| | | శ్రీ ఎస్. రామనరసింహం |
| | | శ్రీ టి. సత్యవేదకుమారి |
| | | శ్రీ ఎ. చంద్రభాగ |
| **మార్షల్** | ః | శ్రీ సి.హెచ్.వి. శెట్టి |
| **చీఫ్ రిపోర్టర్** | ః | శ్రీమతి పి. శివదీక్ష |

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు**

**సోమవారం, డిసెంబరు 10, 2012**

**అధికార నివేదిక**

**విషయ సూచిక**

1. సభా కార్యక్రమం ః
    1. సంతాప ప్రతిపాదన
    2. వాయిదా తీర్మాన తిరస్కరణ
    3. సభాసమక్షంలో ఉంచిన పత్రాలు.
    4. ప్రకటన
    5. రాష్ట్రంలో సంభవించిన నీలం తుఫానుపై లఘు చర్చ.

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## 2012, డిసెంబర్ 10వ తేది, సోమవారం
### పద్దెనిమిదవ సమావేశపు రెండవ రోజు
**(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

– – –

మిస్టర్ ఛైర్మన్ ః సభ అనుమతితో భారతదేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారి మృతికి సంతాప తీర్మానం.

## 1. సంతాప ప్రతిపాదన

''భారతదేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది''.

శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారు 1919వ సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన జీలంలో జన్మించారు.

శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారు క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియాశీలకపాత్ర నిర్వహించారు. ఆయనకు ఉర్దూ భాష అంటే అమితమైన ప్రేమ. శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారు గొప్ప ఉర్దూ కవి. ఆంగ్లంలో పలు గ్రంథాలు రచించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఛాన్స్‌లర్‌గా పనిచేశారు.

శ్రీ ఐ.కె.గుజ్రాల్ గారు 1975లో కేంద్ర సమాచార శాఖమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత శ్రీ వి.పి.సింగ్, శ్రీ దేవేగౌడ నాయకత్వంలోని కేంద్రమంత్రి వర్గంలో విదేశాంగ శాఖమంత్రిగా పనిచేశారు.

విదేశాంగ మంత్రిగా ఇరుగుపొరుగు దేశాలతో భారత దేశ స్నేహ సంబంధాలను మెరుగు పరచటానికి గట్టి కృషి చేశారు. ఈ విషయంలో ఆయన రూపొందించిన మార్గదర్శక సూత్రాలు గుజ్రాల్ సిద్ధాంతంగా ప్రసిద్ధి కెక్కాయి.

ఇరాక్ – కువైట్ యుద్ధ సమయంలో ఆ దేశాలలో ఉన్న భారతీయులను సురక్షితంగా భారతదేశానికి తరలించారు.

1997-98 కాలంలో భారత ప్రధాన మంత్రిగా పనిచేశారు. వీరు మంచి జాతి అభిమాని. దేశ అభిమాని, మేధావి, దారిద్ర్య నిర్మూలనకు కృషి జరగాలని, దేశం ముందుకు పోవాలని ఎప్పుడూ కాంక్షించే వారు. అటువంటి మేధావి మరణించడం మనకెంతో విచారకరం .

వీరు 2012 సంవత్సరం, నవంబర్ 30వ తేదీన మరణించారు. అప్పుడు వీరి వయస్సు 92 సంవత్సరములు.

**వీరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కొద్ది సేపు మనమందరం మౌనం పాటిద్దాం.**

(మాజీ ప్రధాని శ్రీ ఐ.కె గుజ్రాల్‌గారి మృతికి సంతాపం తెలియజేస్తూ, సభ కొద్ది సేపు మౌనం పాటించింది).

MR. CHAIRMAN: Now, we will have a break of fifteen minutes.

(Then the House adjourned at 10.07 a.m., for fifteen minutes)

(THE HOUSE RE-ASSEMBLED AT 10.33 AM)
(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

MR. CHAIRMAN: Today, I have received only one adjournment motion notice.

## 2. వాయిదా తీర్మాన తిరస్కరణ

The adjournment motion notice given by Sri Dadi Veerabhadra Rao Garu and others regarding need to discuss about the hunger strike of aided school staff at Hyderabad, demanding Implementation of Act 37 with prospective effect by honouring the assurances made by the Government several times in the Council is disallowed.

శ్రీ దాడి వీరభద్రరావు ( స్థానిక సంస్థలు ) ః సార్, ఈ అంశం గతంలో చాలా పర్యాయాలు ఇక్కడ చర్చకు రావడం జరిగింది. యాక్ట్-37 ను prospective effect తో అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. ఈ ఎయిడెడ్ స్కూల్ టీచర్స్ అంతా కలిపి ఒక రెండు వేల మంది వుంటారు. వీళ్లలో కొంతమంది రిటైర్ అవుతున్నారు, మరి కొంత మంది సర్వీసులో ఉన్నారు. వీళ్లకు మొత్తం రిటైర్ మెంటు బెనిఫిట్స్ పోతున్నాయి. ఒక్కొక్క టీచర్‌కు రూ.7 లక్షలు కట్ అవుతోంది. తర్వాత పెన్షన్‌లో కూడా కోత కోస్తున్నారు. ఇప్పుడు జీతంలో కోత కోస్తున్నారు. చాలా ఇబ్బందికరమైన పరిస్థితి వుంది.

పిల్లల పెళ్లిళ్లు చేద్దామనో, ఇళ్లు కట్టుకుందామనే ఉద్దేశ్యంతో వాళ్లు కూడబెట్టుకున్న డబ్బంతా పోయే పరిస్థితి ఏర్పడుతోంది. సుమారు 25రోజులుగా వాళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. నిరాహార దీక్షలు కూడా చేస్తున్నారు. ఇదిలా ఇవ్వడానికి అవకాశం వీలు లేదని డిపార్టుమెంటులో చెబుతున్నట్లుగా మాకు తెలిసింది. గతంలో ఈ రకంగానే మెమో నెం .9968/పియస్-1/2001 తేదీ 6.8.2001 ఇచ్చారు, అప్పుడు ఏమి చెప్పారంటే Some of the teacher's organization have submitted representation to the Government that in view of the said Act., the employees who were already enjoying the benefit have to pay huge amounts. Hence, the Government is requested not to recover any amounts from aided teachers అని చెప్పారు. తర్వాత యాక్ట్ 9/2000 తీసుకొచ్చారు. దానికి అనుగుణంగా గవర్నమెంటు ఆర్డర్ కూడా వచ్చింది. Government therefore decides to implement the Act 9 of 2000 with prospective effect from 25.04.2000 instead of 10.01.1980. 20 ఏళ్ల తర్వాత retrospective effect ను తొలగిస్తూ prospective effect తో ఇవ్వడం జరిగింది. గతంలో చేసిన precedent వుంది కాబట్టి దీన్ని కూడా ఇప్పుడు చేయాలి. గతంలో కూడా ఈ సభలో ప్రస్తావించినపుడు, 23.2.2010 నాడు మంత్రి మాణిక్యవరప్రసాదరావు గారు ఇక్కడ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఫైలు ఫైనాన్స్ డిపార్టుమెంటులో ప్రాసెస్‌లో వుంది కాబట్టి ఆ ఫైలు రాగానే ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి, కేబినెట్ ముందు పెట్టి prospective గా దీన్ని ఇంప్లిమెంటు చేయడం జరుగుతుంది, ఈలోగా ఏమైనా వాళ్లకు అపోహలుంటే నేను ఒక మీటింగ్ కండక్ట్ చేస్తామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందని సభ్యులకు తెలియజేస్తున్నాను అని వారు చెప్పడం జరిగింది. తర్వాత పార్థసారథి గారు మంత్రిగా వున్నపుడు మార్చి 27, 2012 నాడు దీని మీద చర్చ జరిగిన సందర్భంగా ఆయన కూడా చెప్పడం జరిగింది. ముందు రికవరీ ఆపుజేయమని ఆయన ఆనాడు చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. 'అధ్యక్షా, యాక్ట్ పాస్ అయిపోయిన తర్వాత ఆ యాక్ట్‌కు వ్యతిరేకంగా రికవరీ చేయమని చెప్పడం వల్ల ఆ యాక్ట్ యొక్క ఉపయోగం ఏముంది, మళ్లీ మేము కేబినెట్‌లో చర్చించి ఆ యాక్ట్‌ను క్యాన్సిల్ చేయడమో, లేక మార్పులు చేయడమో చేయాలి, ఆ యాక్ట్‌ను మళ్లీ అసెంబ్లీలో పెట్టడానికి ప్రయత్నం చేస్తాం' అని వారు చెప్పడం జరిగింది. 30, 40 రోజుల లోపల ముఖ్యమంత్రి గారితో మాట్లాడి, ఇంతకు ముందు సభలో చర్చ జరిగిన అంశానికి సంబంధించి ఒక తుది నిర్ణయం తీసుకుంటాం, అప్పటి వరకు ఎటువంటి రికవరీలు లేకుండా తగు ఆదేశాలు ఇస్తామని ఆయన స్పష్టంగా అన్నారు. అధ్యక్షా, తమరు కూడా కమిట్ అయ్యారు. You take it from me, that is alright, it will be done, I have taken that responsibility also అని తమరితో కూడా చెప్పించారు.

మిస్టర్ ఛైర్మన్: మీరు చెప్పినవన్నీ సభకు తెలుసు. Finance Minister Garu, do you want to say something? I called the Member who gave the adjournment motion.

శ్రీ బి. మోహన్ రెడ్డి ( మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) ః మేము చెప్పిన తర్వాత ఆర్థిక శాఖామంత్రిగారిని చెప్పమనండి సార్. మాకు ఒక అవకాశం ఇవ్వండి.

మిస్టర్ ఛైర్మన్ః చాలాసార్లు మీరు మాట్లాడారు. ఈ సబ్జెక్ట్ టేకప్ చేసింది మీరే. ఆ విషయం అందరికీ తెలుసు . ఇది అస్యూరెన్స్ కమిటీ ముందుకు కూడా వచ్చింది. ఆ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి గారు కూడా నాకు చెప్పారు. ప్రస్తుతం సియం గారు కూడా సభలోనే వున్నారు.

శ్రీ బి. మోహన్ రెడ్డిః టీచర్స్ ప్రతినిధులుగా వుండి మేము ఈ అంశంపై మాట్లాడకపోతే ఎలా? ఈవిధంగానైతే ఇక హౌస్‌కు రావడమే అనవసరం! ఛైర్మన్‌గారూ, మీరు కూడా హామీ ఇచ్చారు . ఈ విష యంపై టీచర్స్‌కు మేము ఏమి చెప్పాలి?

మిస్టర్ ఛైర్మన్ః మీరు హౌస్‌కు రావడం కాదు, సమస్య పరిష్కారం అవసరం .

శ్రీ బి. మోహన్ రెడ్డిః ముఖ్యమంత్రిగారి ముందు మా ఆవేదన చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వ కపోతే ఎలా? మూడేళ్ల నుంచి మీకు సహకరిస్తూనే వున్నాం కదా !

మిస్టర్ ఛైర్మన్ః మోహన్‌రెడ్డి గారూ, ముందు ఫైనాన్స్ మినష్టర్‌గారు మాట్లాడతారు, తర్వాత మీరు చెప్పండి. ముందు వారు చెప్పేది వినండి.

శ్రీ బి. మోహన్ రెడ్డిః సార్, మీరు చెబితే నమ్మాం, మంత్రిగారు చెబితే విన్నాం. ప్రస్తుతం ముఖ్య మంత్రి గారు ఇక్కడే వున్నారు. వారికి మా ఆవేదన చెప్పనీయండి సార్.

MR. CHAIRMAN: If you are not allowing the Hon'ble Minister then I will take up next item. Let the Minister respond. మీకు మాట్లాడడానికి ఇంట్రెస్ట్ వుంది గానీ గవర్నమెంటు నుంచి ఏమి సమాధానం వస్తుందో వినడానికి సిద్ధంగా లేరు, ముందు వారు ఏమి చెబుతారో వినండి, తర్వాత మాట్లాడండి. ఇదేమి దబాయింపు? Government came forward to give reply. ముందు వినండి. అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్ గారు కూడా నా దగ్గరకు వచ్చారు, అస్యూరెన్స్ ఇచ్చారు, how to implement it అని అడిగారు. ఫైనాన్స్ మినిష్టర్‌గారు వాలంటరీగా ముందుకు వచ్చారు, వారు చెప్పేది ముందు వినండి. ముఖ్యమంత్రిగారు కూడా హౌస్‌లోనే వున్నారు కాబట్టి ఏదో ఒకటి తేలుతుందని నేను ఆశిస్తున్నాను.

03.101212/ఉ.1040

పివిఆర్/కెఎమ్

శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి ( ఆత్మకూరు ) ః అధ్యక్షా, గౌరవ ప్రతిపక్షనాయకులు ఈ రోజు ఒక వాయిదా తీర్మానాన్ని ఇవ్వడం, దానిని మీరు మీ రిఫరెన్స్‌లో డిజ్-అలౌ చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రొసీజర్ ప్రకారం అయితే, వాయిదా తీర్మానాన్ని ఇచ్చినటువంటి మెంబర్‌కు ఒక నిమిషం దాని గురించి ప్రస్తావన చేసే అవకాశం ఇవ్వడం జరుగుతుంది. మీరు ఆ సమయాన్ని ప్రతిపక్షపార్టీ నాయకునికి ఇచ్చారు. వారికి గత శాసన పరిషత్తు సభలో జరిగినటువంటి ప్రొసీడింగ్స్ అన్నింటిని చదివి వినిపించే అవకాశం ఇచ్చారు. ప్రొసీజర్ ప్రకారం, రిఫరెన్స్ చెప్పడం వరకే అవకాశం ఉంటుంది. కాని తమరు అనుమతి ఇచ్చారు కాబట్టి వారు చెప్పారు.

మిస్టర్ ఛైర్మన్ ః నేను ఎందుకు అనుమతించానంటే.. ఈ సమస్య చాలా సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉంది కాబట్టి ఏదో ఒక పద్దతిన తేలిపోతుందనీ, ముఖ్యమంత్రి గారు సభలో ఉన్నారు కాబట్టి సమస్య పరిష్కారమవుతుందని అనుమతించాను. టెక్నికాలిటీస్‌కు పోతే I would not allow anybody. మోహన్‌రెడ్డి గారు కాని, ఇతర ఉపాధ్యాయ ప్రతినిధులందరూ ఇంట్రస్టెడ్. వాళ్లందరు వస్తే I would not allow them to speak. Let us not go into the technicalities. Dr. Nageshwar, please hear me.

(సభ్యులు డా. కె. నాగేశ్వర్ నుండి అంతరాయం)

నాగేశ్వర్ గారూ దయచేసి వినండి. ఇది చిన్న విషయం కాదు. చాలా పెద్ద విషయం కాబట్టి ప్రతిపక్షపార్టీ నాయకులు మాట్లాడారు. పార్ధసారధి గారు దీని మీద శ్రద్ద తీసుకున్నారు. దీనిపై చర్చ అవసరం లేదు. ఈ సమస్యకు మీరేమైనా పరిష్కారం చూపండి.

శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి ః అధ్యక్షా, సంబంధిత మంత్రి గారు కూడా ఇంకా సభకు రాలేదు. సంబంధిత మంత్రి గారు వచ్చిన తరువాత గౌరవ సభ్యులతో మాట్లాడించే కార్యక్రమం చేస్తాను.

డా. కె. నాగేశ్వర్ ః అధ్యక్షా, ఇది చాలా క్యాజువల్‌గా ఇచ్చే సమాధానం.

శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి ః అధ్యక్షా, ఇది ఒక క్షణంలో తేలేది కాదు. ఈ సమస్య గడచిన అనేక సంవత్సరాలుగా ఉంది కాబట్టి ఈ విషయం ప్రభుత్వ దృష్టిలో ఉంది. గౌరవ సభ్యులతో కూడా మాట్లాడడం జరుగుతుంది. అన్ని వివరాలు వచ్చిన తరువాత వారు అడిగిన దానికి పూర్తి వివరణ ఇచ్చే పరిస్థితి ఉంటుంది.

శ్రీ బి. మోహన్ రెడ్డి ః అధ్యక్షా ఒకసారి అవకాశం ఇవ్వండి. 1/2005 మరియు 37/2005 రెండు యాక్టుల గురించి సభలో చర్చ జరిగింది. అప్పుడు మేము వెళ్లి వెల్ దగ్గర క్రింద కూర్చొంటే అప్పటి సంబంధిత మంత్రులు మాణిక్య వర ప్రసాద్ గారు, పార్ధసారధి గారు హామీ ఇచ్చారు. మీ ఛాంబర్‌లో మీటింగు కూడా పెట్టించారు. అధికారులను, మమ్ములను కూడా పిలిచారు. అప్పుడు నాది బాధ్యత, వర్రీ కావద్దు. రికవరీ అపిస్తానని మీరు కూడా అన్నారు. మీ మాట నమ్మకుండా ఎలా ఉంటాము. మీ మాటను నమ్మాలి కదా. మీరు ఈ సభకు పెద్ద. ఈరోజు ముఖ్యమంత్రి గారు సభలో ఉన్నారు కాబట్టి మా ఆవేదన విని రికవరీ ఆపిస్తామంటే మా మాట దక్కుతుంది. దీనిలో ప్రభుత్వం క్రొత్తగా ఇచ్చేది ఏమీ లేదు కదా. రికవరీని ఆపమని అడుగుతున్నాం. ముఖ్యమంత్రి గారు రికవరీ ఆపేస్తామని చెపితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది కాబట్టి మీ ద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాము. ఐదు లక్షలు, ఏడు లక్షలు రికవరీ పెట్టడం వల్ల టీచర్లు చాలా బాధలు పడుతున్నారు. రెండు యాక్టుల గురించి చెప్పవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి ః ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసిన తరువాత ఐదారు లక్షల రూపాయలు రికవరీ పెడుతున్నారు.

శ్రీ ఎం. గేయానంద్ ః అధ్యక్షా...

మిస్టర్ ఛైర్మన్ ః మీరందరూ ఒకేసారి మాట్లాడుతుంటే ఎలా?

(డా. కె. నాగేశ్వర్. సర్వశ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి, కె.ఎస్. లక్ష్మణరావు, ఎం. గేయానంద్ తదితరుల నుండి అంతరాయం)

డా. కె. నాగేశ్వర్ ః ముఖ్యమంత్రి గారిని హామీ ఇవ్వమని చెప్పండి. సభ గౌరవాన్ని కాపాడాలి. మీ గౌరవాన్ని కాపాడాలి.

మిస్టర్ ఛైర్మన్ ః నాగేశ్వర్ గారూ.. మీరందరూ చాలా సార్లు దీని మీద మాట్లాడారు. దీని మీద చర్చ అవసరం లేదు. సభా గౌరవం అంటే అందరూ లేచి ఒకేసారి మాట్లాడం కాదు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలి. సభ గౌరవం కాపాడడం కోసమే మీ అందరిని కూర్చొమంటున్నాను. I request the Hon'ble Chief Minister to speak.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ( పీలేరు ) ః అధ్యక్షా, సబ్జెక్ట్ తెలుసుకొని నేను మాట్లాడతాను. ఒకసారి వెరిఫై చేసిన తరువాత, మీరు చెప్పిన దానిని పరిశీలించిన తరువాత, I will come back to you Sir.

డా. కె. నాగేశ్వర్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ) ః అధ్యక్షా, మంత్రి గారు హామీ ఇచ్చిన తరువాత దానిని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లరా? ముఖ్యమంత్రి గారు సబ్జక్ట్ గురించి తెలియదంటున్నారు.

(సర్వశ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి, కె.ఎస్. లక్ష్మణరావు, ఎం. గేయానంద్, కె. నాగేశ్వర్ తదితరుల నుండి **"ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లకుండా సంబంధిత మంత్రి గారు ఏమి చేస్తున్నా"**రని అంతరాయం కలిగించసాగారు)

మిస్టర్ ఛైర్మన్ ః అందరూ దయచేసి కూర్చోండి.

శ్రీ వై. శీనివాసులు రెడ్డి (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ) ః ఇంత ముఖ్యమైన విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లకపోవడం ఏమిటి? దీనిపై సంబంధిత మంత్రి వెంటనే రాజీనామా చేయాలి.

డా. కె. నాగేశ్వర్ ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు..

మిస్టర్ ఛైర్మన్ ః నాగేశ్వర్ గారూ.. రికార్డు చూసి సమస్యను పరిష్కారం చేస్తామన్నారు.

డా. కె. నాగేశ్వర్ ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారంటే మాకు మంచి గౌరవం ఉంది. సంబంధిత మంత్రి గారు సభలో హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి గారికి చెబుతున్నాం.

(అంతరాయం)

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ః అధ్యక్షా, ప్రతిపక్ష సభ్యులకున్నంత ఇంటలిజెన్స్ నాకు లేదు. ఇది వాయిదా తీర్మానంలో వచ్చింది కాబట్టి నేను ఒకసారి స్టడీ చేసిన తరువాత I will get back to the House అని చెప్పాను. అన్ని సబ్జెక్టులు అన్ని వేళల్లో గుర్తు ఉండాలంటే నాగేశ్వర్ గారంత మేధావినో, మోహన్ రెడ్డి గారంత మేధావినో కాదు. ఒక సారి స్టడీ చేసిన తరువాత, I will get back to the House.

మిస్టర్ ఛైర్మన్ ః ముఖ్యమంత్రి గారు సభలో ఉన్నారు కాబట్టి సమస్యకు పరిష్కారమవుతుందని వారందరూ భావిస్తున్నారు.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ః ఒక సారి స్టడీ చేసిన తరువాత, I will get back to the House.

శ్రీ దాడి వీరభద్రరావు ః అధ్యక్షా, ఇది చాలా చిన్న విషయం. ప్రభుత్వం అనేక మందికి అనేక రకాల సహాయం చేస్తుంది. దీనిని పరిష్కరిస్తే ప్రభుత్వానికి అదనంగా ఆర్థిక భారం ఏమీ పడదు కాబట్టి మానవతా దృక్పథంతో పరిష్కరించమని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః ( ముఖ్యమంత్రిని ఉద్దేశించి) చాలా మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ అని పెట్టారు. మానవతా దృక్పథంతో దీనిని పరిష్కరించమని అడుగుతున్నారు. మోహన్ రెడ్డి గారు దయచేసి కూర్చొండి. Now, I am going to take up Item Nos. 2 & 3 of the Agenda.

## 3. PAPERS LAID ON THE TABLE :

1) A copy of the 35th Annual Report of the Andhra Pradesh State Seeds Development Corporation Limited for the year 2011-2012, as required under Section 619-A(2) of the Companies Act, 1956.

2) A copy of the 36th Annual Report of the Andhra Pradesh Forest Development Corporation Limited for the year 2010-2011, as required under Section 619-A of the Companies Act, 1956.

3) A copy of the 25th Annual Report of the Andhra Pradesh Beverages Corporation Limited for the year 2011-2012, as required under Section 619-(3) of the Companies Act, 1956.

4) A copy in each of the 1st, 2nd, 3rd and 4th Annual Reports of the Overseas Manpower Company of Andhra Pradesh Limited for the year 2006-07, 2007-08, 2008-09 and 2009-10, as required under Section 619-A of the Companies Act, 1956.

A copy of the report on the decision of the Business Advisory Committee taken at its meeting held on 9th December, 2012.

## 4. ANNOUNCEMENT:

MR. CHAIRMAN: -

I am to announce to the House that I have received the following Message from the Hon'ble Speaker, Andhra Pradesh Legislative Assembly:

" In accordance with Rule 123 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly, I transmit a copy of the Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) Bill, 2012 (L.A. Bill No.15 of 2012) as passed by the Legislative Assembly with Official Amendments on 2nd December, 2012 and signed by me."

The above Bill will be taken up tomorrow i.e. on 11th December, 2012 and the Amendments to the above Bills will be received upto 5.00 p.m. today.

Now, I request the Hon'ble Chief Minister to lay on the table a copy of the Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) Bill, 2012.

ఉ.10.50

SRI N. KIRAN KUMAR REDDY: Chairman Sir, I beg to move:

"that the Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) Bill, 2012 ( L.A. Bill No.15 of 2012) be taken into consideration."

MR.CHAIRMAN: Tomorrow, we are going to take up the Bill.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి : ఈ బిల్లు గురించి కొద్దిగా అవుట్‌లైన్ చెపుతాను. Tomorrow, we can discuss on it. డిసెంబర్ రెండవ తేదీన ఈ బిల్లును అసెంబ్లీలో పాస్ చేయడం జరిగింది. ముఖ్యంగా, నిధులను ఏ విధంగా ఖర్చు చేయాలనే దాని మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్లానింగ్ కమీషన్ సూచనలు చేస్తుంది. 1974-75 ఆర్థిక సంవత్సరంలో ఎస్టీలకు సబ్-ప్లాన్ పెట్టాలని, అదే విధంగా, 1979-80 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు ఒక సబ్-ప్లాన్ పెట్టాలని, ఇతర వర్గాలకు ఎస్సీ. ఎస్టీలకు ఉన్న వ్యత్యాసం తగ్గే విధంగా వారికి నిధులు కేటాయించి, సక్రమంగా ఖర్చు పెట్టాలని కూడా ప్లానింగ్ కమీషన్ సూచనలు చేయడం జరిగింది. దురదృష్టవశాత్తు, ఈ సూచనలు ఏ రాష్ట్రంలో కాని, కేంద్రంలో కాని ఏ ప్రభుత్వాలున్నా పూర్తిగా అమలు కాలేదు. వారి జనాభా ప్రాతిపదిక మేరకు ఖర్చు కాలేదు. ఫోకస్ లేదు. ఇన్ని సంవత్సరాల తరువాత కూడా ఆశించిన ఫలితాలు రాలేదు కాబట్టి దీనిని మార్చాలనే ఉద్దేశ్యంతో యూపిఏ చైర్ పర్సన్‌గా ఉన్న శ్రీమతి సోనియా గాంధీ గారు ప్రధాన మంత్రి గారికి ఒక జాబు వ్రాయడం జరిగింది. దానిపై ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదిక మేరకు ఖచ్చితంగా వారికి మేలు జరిగే విధంగా ఖర్చు పెట్టాలని, దృష్టి సారించి ఫోకస్‌గా ఖర్చు పెట్టాలని ప్రధాన మంత్రి గారు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచనలు కూడా చేయడం జరిగింది. దానిని స్ఫూర్తిగా తీసుకొని ..

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించడమే కాకుండా, కేటాయించిన నిధులను సక్రమంగా వారి మేలు కోసం, చదువు కోసం, ఉద్యోగ అవకాశాల కోసం, ఆరోగ్యం, ప్రాంతాల పరిశుభ్రత కోసం ఖర్చు పెట్టాలనే ఉద్దేశ్యంతో దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా దీనికి ఒక చట్ట భద్రత కల్పించాలని ఈ బిల్లును తీసుకొని రావడం జరిగింది. 2006 వ సంవత్సరం వరకు బడ్జెట్‌లో 14 శాతం

నిధులు ఎస్సీలకు, 5 శాతం ఎస్టీలకు ఖర్చు పెట్టేవారు. ఇప్పుడు 16.23 శాతం ఎస్సీలకు, 6.6. శాతం నిధులను ఎస్టీలకు ఖర్చు పెడుతున్నారు. ఈ రెండింటిని కూడా మౌలిక సదుపాయాల కోసం, ఇతరత్రా ఖర్చు పెడుతున్నట్లు కేవలం స్టాటిస్టిక్స్ చూపించడం జరుగుతోంది. దానిని తొలగించి, వారికి కేటాయించిన నిధులు వారికే ఖర్చు పెట్టేటట్లు, సక్రమంగా అమలు చేసే దానికి, ఫోకస్‌గా ఖర్చు పెట్టాలనే ఉద్దేశ్యంతో చట్ట ప్రకారం కచ్చితంగా ఖర్చు పెట్టాలని, ఇంకా ఏ విధంగా చేయాలనే విషయాలపై మరియు ఇతర అంశాలను బిల్లులో పొందుపరచడం జరిగింది. దీనిపై అసెంబ్లీలో కూడా రెండు రోజులు పెద్ద ఎత్తున చర్చ జరిగింది. చాలా సూచనలు వచ్చాయి. వచ్చిన సూచనలలో ఏవైతే చేయగలమో వాటన్నింటిని ఎక్స్‌ప్లైన్ చేయడం జరిగింది. ఇక్కడ కూడా గౌరవ సభ్యుల సూచనలు, సలహాలను తీసుకొని దేశంలోనే మొట్టమొదటిసారి చట్టబద్ధత కల్పించి, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కూడా ఒక హక్కుగా ఎస్సీ, ఎస్టీలకు ప్రతి సంవత్సరం పారదర్శకంగా, ఫోకస్‌గా ఖర్చు పెట్టే విధంగా ఉండాలని ఈ బిల్లును తీసుకురావడం జరిగింది.

(హర్షధ్వానాలు)

దీనిపై మీరు ఎప్పుడు సమయాన్ని కేటాయిస్తే అప్పుడు చర్చకు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : (ముఖ్యమంత్రిని ఉద్దేశించి) సబ్-ప్లాన్ గురించి మార్చి 27, 28 వ తేదీలలో ఈ సభలో చర్చించాము. The representations received by me.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి : ఇటువంటి మంచి సూచనలు వస్తాయనే ఉద్దేశ్యంతోనే కౌన్సిల్‌ను పెట్టడం జరిగింది.

(సభలో నవ్వులు)

MR. CHAIRMAN : Amendment will be received today upto 5-00 p.m. Now, I am going to take up Short discussion on Relief and Rehabilitation measures taken on account of recent Neelam Cyclone.

## 5. రాష్ట్రంలో సంభవించిన నీలం తుఫానుపై లఘు చర్చ.

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి : అధ్యక్షా, షార్ట్ డిస్కషన్‌కు సంబంధించి ముందుగా సభ్యుల కోసం కొద్దిగా వివరణ ఇస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః మీ పాద యాత్ర బాగా జరిగింది. ఆరోగ్యంగా తిరిగి వచ్చారు. సభ తరపున అభినందిస్తున్నాము.

(హర్షద్వానాలు)

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి (కల్యాణదుర్గం) ః కృతజ్ఞతలు. ఇప్పుడు అక్టోబరు 29 నుండి నవంబర్, 2 వ తేదీ వరకు నీలం తుపాన్ వల్ల రాష్ట్రంలో దెబ్బతిన్న పరిస్థితుల మీద పోయిన నెల ననంబర్ 30 వ తేదీన తమరు లఘుచర్చకు ఇక్కడ అవకాశం ఇచ్చి ఉన్నారు. అప్పుడు ఒక స్టేట్‌మెంట్‌ను టేబుల్ చేయడం జరిగింది. తాజా ఫిగర్స్‌ను టేబుల్ చేయడానికి అవకాశం దొరకలేదు. రాత్రి 7 గంటలకు శాసన సభ వ్యవహారాల మంత్రి గారు ఫోన్ చేసి రేపు అంటే ఈ రోజు షార్ట్ డిస్కషన్ వస్తుందని చెప్పడం జరిగింది. నిన్న ఆదివారం అయినందున రాత్రి 7 గంటల సమయంలో అధికారులు కూడా అందుబాటులో లేరు. అందువల్ల తాజా స్టేట్‌మెంట్‌ను ఉంచడం జరగలేదు. పాత స్టేట్‌మెంటే టేబుల్ మీద ఉంది . కొన్ని అంకెలు నేను చెపుతాను. వాటిని సరిచేసుకోవాల్సిందిగా గౌరవ సభ్యులను మీ ద్వారా కోరుతున్నాను.

మొదటి పేజీలో, మరణించిన వారి సంఖ్య 45కు బదులు 61మందిగాను, తప్పిపోయిన వారి సంఖ్య 5 కు బదులు 8గాను, అదే విధంగా దెబ్బతిన్న గృహాల సంఖ్య 19,440కు బదులుగా 30,973 గానూ, సహాయ కేంద్రాల సంఖ్య 276కు బదులు 410 గానూ, అలాగే, సహాయ కేంద్రాలకు వచ్చిన వారి సంఖ్య 1,61,456కు బదులు 3,51,321మందిగా సరి చేసుకోవాలని కోరుతున్నాను.

తరువాత రెండవ పేజీలోనే భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన 19 జిల్లాలలో 5 జిల్లాలలో, తక్కువ పంట నష్టం జరిగిందని చెప్పడం జరిగింది. అది ఇప్పుడు అప్రస్తుతం కాబట్టి దానిని డిలీట్ చేయమని కోరుతున్నాను.

తరువాత, హార్టికల్చర్‌కు వచ్చేటప్పటికి నష్టపోయిన పంట 26,198.73 హెక్టార్లకు బదులు 27,272 హెక్టార్లుగానూ, పశు సంవర్ధక రంగానికి రూ.7.35కోట్ల సహాయానికి బదులు రూ. 5.95కోట్లుగా సరి చేసుకోవాలి. అదే విధంగా, చేనేత రంగానికి సహాయం క్రింద రూ.1.14కోట్లకు బదులు రూ.85లక్షలుగానూ, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదించిన రూ. 66.78కోట్లకు బదులు రూ.52.56కోట్లుగా సరిచేసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

11.00am

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి 66.78కోట్లు ఉండగా ఇప్పుడు 52.56 కోట్లు అని మార్చుకోవాలని కోరుతున్నాను. రూరల్ వాటర్ సప్లై విషయానికి వస్తే 9.37 కోట్లు ఉండగా, దానిని

9.71కోట్లు మార్చుకోవలసిందిగా కోరుతున్నాను. చివరి పేరా మెమురాండం గురించి ముఖ్యమంత్రిగారు స్పష్టంగా చెబుతారు. అయితే అది రూ.3.566 కోట్ల రూపాయలు. దానిని కేంద్రప్రభుత్వానికి పంపడం జరిగింది. ఇన్‌పుట్ సబ్సిడీ గురించి ఎంత పెంచితే బాగుంటుందనే దానిపై ముఖ్యమంత్రిగారు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అందుకు సంబంధించిన రికమండేషన్లను కూడా ముఖ్యమంత్రిగారికి సబ్మిట్ చేయడం జరిగింది. తదుపరి ముఖ్యమంత్రిగారు మాట్లాడేటప్పుడు ఎంత ఎన్‌హాన్స్ చేయబోతున్నారనే వివరాలు వారు చెప్పడం జరుగుతుంది. These are the few corrections.

మిస్టర్ ఛైర్మన్ః కరక్ట్ చేసిన కాపీని సభకు సబ్మిట్ చేస్తే బాగుంటుంది.

శ్రీ దాడి వీరభద్రరావుః అధ్యక్షా, ఈ విషయమ్మై కిందటి సమావేశంలోనే చర్చ మొదలయితే బాగుండేది. మాట్లాడడానికి మరికొంత సమయం వచ్చేది. ఏదేమ్మైనా, మంత్రిగారు క్రిందటి రోజు రాత్రి సమాచారం వచ్చిందని అన్నారు. ఈ విషయమ్మై 29నవంబరు నాడు బి.ఎ.సిలో తీసుకున్న నిర్ణయం ప్రకారం నీలం తుఫాను, తరువాత ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గురించి చర్చిద్దామని అనుకోవడం జరిగింది. అప్పుడు జరగలేదు కాబట్టి అది Left over business కింద ఆటోమాటిక్‌గా అది carry forward అవుతుంది. Left over business గురించి కొత్తగా మంత్రిగారికి సమాచారం ఇవ్వవలసిన అవసరం లేద ని నేను భావిస్తున్నాను.

MR. CHAIRMAN: (Addressing the Minister) He is telling that no reminder is necessary since it was only agenda being carried forward. That is the logical point he raised.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి ః దాడి వీరభద్రరావు గారు చాలా సీనియర్ సభ్యులు. ఈ విషయం assumptions, presumptions తో పోయేది కాదు. ఛైర్‌నుండి వచ్చే డైరక్షన్స్ వచ్చిన తరువాతనే మేమ మాట్లాడడం జరుగుతుంది కానీ, ఊహించుకుని చేయడానికి ఆస్కారముండదు.

MR. CHAIRMAN: Left over will be carried to the next day. That is the convention and assumption.

శ్రీ దాడి వీరభద్రరావుః ఈ స్టేట్‌మెంట్‌ను రివైజ్ చేయడమనేది మంత్రులు చేసే పని కాదు. ప్రభుత్వాధికారులు ఆటోమాటిక్‌గా రివైజ్ చేసి పంపించాలి. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు ఛైర్మన్ గారిని పాయింటవుట్ చేయడం జరిగింది. అందుకు నేను బాధపడుతున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య ః( నామినేటెడ్ ) దాడి వీరభద్రరావు గారు ఎటువైపునుండైనా దాడి చేయగలరు.

శ్రీ దాడి వీరభద్రరావుః ఈ రోజు నీలం తుఫానుపై చర్చించడానికి అనుమతిచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అధ్యక్షా. రైతులు నీలం తుఫాను వల్ల ఎంతో నష్టపోయారు. ఒకదాని తరువాత ఒకటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చేసరికి చాలా దారుణమైన పరిస్థితిని ఎదుర్కోవడం జరిగింది. దాదాపు 19 జిల్లాల్లో పూర్తిగా వరదల కారణంగా అపారమైన ధన నష్టం, ప్రాణనష్టం కలిగింది. 2004 వ సంవత్సరం నుండి 17 ప్రకృతి వైపరీత్యాలు వచ్చాయి. అందులో 11 భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు సంభవించాయి. దురదృష్టవశాత్తు మిగతా 6 సందర్భాలలో రాష్ట్రంలోని కరవు పరిస్థితులవల్ల రైతులు నష్టపోయారు. 2006లో వచ్చినటువంటి ఓగ్ని వరదలవల్ల, మే, 2010లో వచ్చిన లైలా తుఫానుకంటే, 2010 అక్టోబర్‌లో వచ్చినటువంటి జల్ తుఫాను కంటే, నవంబర్ 2012లో వచ్చిన నీలం తుఫాను చాలా ఎక్కువ నష్టం కలిగించింది. అకస్మాత్తుగా, ఊహించనటువంటి పరిస్థితులలో ఇది రావడం జరిగింది. ఒకరకంగా, వాతావరణ శాఖవారి తాలూకు నిర్లక్ష్య వైఖరికూడా ఇందుకు దోహదపడింది. వారు సకాలంలో సరియైన సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయడంలో విఫలమయ్యారు. అలాగే ప్రభుత్వం వారితో కోఆర్డినేట్‌చేసుకొనే విషయంలో విఫలమయ్యింది. నవంబరు 2వ తేదీనుండి ఒక్కసారిగా వరదలు రావడం, రిజర్వాయర్లు నిండిపోయి, కట్టలు తెంచుకొని నీరు ఊళ్లల్లోకి వచ్చేయడం జరిగింది. సమారు 6, 7 జిల్లాలలో చాలా తీవ్రమైన నష్టం జరిగింది. మేము కూడా జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి విశాఖపట్నం జిల్లా పర్యటించడం జరిగింది. పీకల్లోతువరకు నీళ్లు వెళ్లేపరిస్థితి రావడం జరిగింది. రైతుల తాలూకూ పొలాలు పూర్తిగా పోయాయి. ఇళ్లు పోయాయి. ఇళ్లల్లోని సామాన్లు పూర్తిగా కొట్టుకుపోవడం జరిగింది. అన్ని పంటలూ పూర్తిస్థాయిలో కొట్టుకుపోయాయి. 20 నుండి 25 శాతం కూడా మిగలలేదు. కనీసం గడ్డికి కూడా పనికిరాకుండా అయిపోయింది. ప్రభుత్వం ఇన్ని స్కీములు చేపట్టినా ఇంకా ప్రజలు గుడిసెలలో నివసించే పరిస్థితిని గమనించడం జరిగింది. ఆ గుడిసెలన్నీ జలదిగ్బంధంలో ఉండడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. ఎద్దులు, ఆవులు, గేదెలు కొట్టుకుపోవడాన్ని మేము చూడడం జరిగింది. చాలాకాలం తరువాత ఇంత భయంకరమైన తుఫానును, వరదలను చూడడం జరిగింది. మత్స్యకారులు మరియు ఇతర వృత్తులవారి విషయానికి వస్తే, వారి బోట్లు, వలలు మరియు వృత్తి పరికరాలు కొట్టుకుపోవడం జరిగింది. ఈ విధంగా 48 గంటలలో రాష్ట్రం మొత్తాన్ని అతలాకుతలం చేసిన సంఘటన ఇది. సుమారు మూడు రాత్రులు జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలను మేము చూడడం జరిగింది. గేదెలను తీసుకురావడానికి పొలానికి వెళ్లి అందులో చిక్కుకున్నవారున్నారు. పాకలు కొట్టుకుపోవడం వల్ల, వారి పై నుండి వర్షం పడుతూ కింద ఇళ్లు కొట్టుకుపోయిన పరిస్థితిని మేము కేవలం చెట్లు పట్టుకుని ఉన్నటువంటి పరిస్థితిని మేము ఆనందపురం అనే గ్రామంలో గమనించడం జరిగింది.

ఉ. 11.10

ఎవరైనా వచ్చి హెలికాప్టర్ ద్వారా వారిని రక్షిస్తారేమోనని, కనీసం ఆహారపు పొట్లాలైనా వారికి అందిస్తారామోనని ఆనందపురం పొలాల్లో చిక్కుకుపోయి ఉన్న 14 మంది రైతులు ఆశించారు. గతంలో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో వైమానిక లేదా నావికాదళాలు వచ్చి వరదలలో చిక్కుకుపోయిన ప్రజలను రక్షించేవి. ఈ తుఫాను సంభవించిన సమయంలో అవి ఎందుకు రాలేదు? తుఫాను సంభవించి రెండు రోజుల సమయం గడిచిన తరువాత విశాఖపట్నం జిల్లాకు రెండు హెలికాప్టర్లు రావడం జరిగింది. కేవలం ఒకే ఒక బోటు మాత్రమే తుఫాను బాధితులను రక్షించడం కోసం రావడం జరిగింది. అక్కడ చాలా విచిత్రమైన వాతావరణం నెలకొంది. కనీసం ఆహారపు పొట్లాలను కూడా సరఫరా చేయలేని విచిత్రమైన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆ మాత్రం కూడా జిల్లా కలెక్టర్లు చేయలేని పరిస్థితిలో ఎందుకున్నారనేది చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ తుఫాను ప్రాంతానికి చేరుకోలేని పరిస్థితి ఉన్నప్పటికీ కొన్ని స్థానిక మరియు యితర స్వచ్ఛంద సంస్థలు ఏటికి ఎదురీది ఆ ప్రాంతానికి చిన్న చిన్న బోట్ల ద్వారా వె ళ్లడం జరిగింది. ఈ విధమైనటువంటి వైఫల్యం ఎందుకు వచ్చిందో పరిశీలన చేయవలసిందిగా నేను కోరుతున్నాను. తుఫాను సంభవించిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా సెల్‌ఫోన్లు చార్జింగ్ అయిపోవడం వల్ల త్రాగునీరు, ఆహారపొట్లాలు, చిన్న పిల్లలకు పాలకోసం తుఫాను బాధితులు ప్రభుత్వానికి సమాచారం అందించలేకపోయారు. కనీసం చిన్నపిల్లలకు పాల ప్యాకెట్లు కూడా హెలికాప్టర్ల ద్వారా సరఫరా చేయలేకపోయారు. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన.

ఈ తుఫాను కారణంగా గతంలో ప్రకటించిన మృతుల సంఖ్య 45 నుంచి 61 కి పెరిగిందని సంబంధిత మంత్రిగారు చెప్పారు. జాతీయరహదారిపై హఠాత్తుగా వరదనీరు రావడంవల్ల ఆ రహదారిలో వెళుతున్న 15 మంది యువకులు కొట్టుకుపోవడం జరిగింది. రోడ్డుపై నీరు ప్రవహించే పరిస్థితిలో పోలీసు శాఖ లేదా రెవెన్యూశాఖాధికారులు గానీ ఆ వరదనీరు ప్రవహించే మార్గం ద్వారా ప్రజలు వెళ్లకుండా వారిని ఎందుకు అప్రమత్తం చేయలేదు? ఆ విధంగా ప్రభుత్వ యంత్రాగం విఫలమైంది.

ధర్మవరం సమీపంలోని వరదనీటిలో ఉన్న బస్సులో నుంచి తన ప్రాణాలను కాపాడుకుందామని బయటకు రావడానికి ప్రయత్నించి పెళ్లికొడుకు ప్రాణాలను కోల్పోవడం జరిగింది. ఈ తుఫాను సంభవించిన సందర్భంలో ప్రభుత్వయంత్రాంగం యొక్క నిర్లక్ష్యం వల్ల కూడా కొన్ని మరణాలు సంభవించాయి. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమవడం జరిగింది.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం తుఫాను వల్ల దెబ్బతిన్నవి 30,000 గృహాలు. మా గణాంకాల ప్రకారం 50,000 గృహాలు దెబ్బతిన్నాయి. యింకా వాటి గురించి ఎగ్జామిన్ చేస్తున్నారో లేదో తెలియదు. ఆంధ్రప్రదేశ్

రాష్ట్రంలో తూర్పు తీర ప్రాంతం 974 కిలోమీటర్లు ఉంది. ఈ రోజు తుఫాను వచ్చింది, పోయింది అనే పరిస్థితి కాదు. 44% తీరప్రాంతంలో తుఫానులు సంభవించే అవకాశం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. రూ. 3,000 కోట్లతో సముద్రం ఒడ్డున ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరముందని, సముద్ర నీరు ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోకి రాకుండా వన సంపదను పెంచే కార్యక్రమం ఆనాడు గతంలో స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీగారు చేపట్టడం జరిగింది. రెండు కిలోమీటర్ల వెడల్పుతో స్పెషల్ ఫారెస్ట్‌ను అభివృద్ధి చేసే కార్యక్రమాలను ఆమె అమలు చేయడం కూడా జరిగింది. ఈనాటి పరిస్థితి చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు రావడం జరిగింది. సముద్ర తీరప్రాంతాన్ని పరిశ్రమల పేరుతో యితరులకు కేటాయించడం జరుగుతోంది. సముద్ర తీరంలో ల్యాండ్ మైనింగ్‌ను కూడా చేసే పరిస్థితి ఉంది. సముద్ర ఒడ్డు గుల్ల అయ్యే పరిస్థితి ఉంది. అటువంటి పరిస్థితిలో ఆటోమేటిక్‌గా సముద్ర నీరు, నదుల నీరు ఊరులోని రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. ఇసుకను పూర్తిగా త్రవ్వుకుని దొంగతనాలు చేస్తున్న పరిస్థితులున్నాయి. భవిష్యత్తులో కూడా భారీ వర్షాలు వచ్చి మరింత భారీ స్థాయిలో తుఫానులు సంభవించి ప్రజలకు పెద్ద నష్టం వాటిల్లే ప్రమాదముంది కాబట్టి పారిశ్రామిక విధానంపై కూడా ముఖ్యమంత్రిగారు తగినటువంటి ఆలోచన చేయవలసిన అవసరముంది. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలను ఏ ప్రాంతంలో నెలకొల్పితే ప్రజలకు యిబ్బంది కలుగదో అటువంటి ప్రాంతాలను గుర్తించి అక్కడ మాత్రమే పరిశ్రమలను నెలకొల్పే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. ఈ విషయం గురించి గతంలో శ్రీ కె.రోశయ్యగారు అధికారంలో ఉన్న సమయంలో కూడా చర్చించడం జరిగింది. అడిగిన ప్రతి వారికీ పరిశ్రమలను నెలకొల్పడానికి భూమిని కేటాయించకుండా, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని చేయవలసిన అవసరముంది.

ట్రెజరీ రూల్ (27) ప్రకారం ఎంతమంది జిల్లా కలెక్టర్లు తమ అధికారాలను వినియోగించుకున్నారనే విషయాన్ని దయచేసి పరిశీలన చేయండి. మాదృష్టికి వచ్చిన గణాంకాల ప్రకారం, 16.11.2012 వ తేదీకి రూ. 4.24 కోట్లు, 30.11.2012 వ తేదీకి రూ. 5.36 కోట్లు అంటే 15 రోజులలో రూ. 1.12 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగింది. ఈ మధ్యనే 5.12.2012 వ తేదీకి మొత్తం రూ. 9.67 కోట్లు ఖర్చు చేశారు. అంటే ఈ 5 రోజులలో రూ. 4.31 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగింది. అంటే తుఫాను సంభవించిన తేదీ నుంచి 5.12.2012 వ తేదీ వరకూ కేవలం రూ. 9.67 కోట్లు మాత్రమే ట్రెజరీ రూల్ (27) ప్రకారం జిల్లా కలెక్టరు ఖర్చు చేయడం జరిగింది. రూల్స్ ప్రకారం, మండల రెవెన్యూ అధికారుల పరిధిలో తుఫానులో దెబ్బతిన్న 50 గృహాలు, రెవెన్యూ డివిజన్ అధికారి పరిధిలో 300 గృహాలు, 300 కంటే ఎక్కువ దెబ్బతిన్న గృహాలకు జిల్లా

కలెక్టర్లు సహాయక చర్యలను చేపట్టవచ్చు. వారి పరిధిలో ఉన్న సహాయ కార్యక్రమాలను మండలరెవెన్యూ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎందుకు చేయలేకపోయారు? క్రిందిస్థాయి అధికారులకు ఆథరైజేషన్ యివ్వకుండా జిల్లా కలెక్టర్ల చేతిలో ఆ అధికారాన్ని పెట్టుకున్నారు. నేడు కలెక్టర్లు కూడా ఉన్న అధికారాలను సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదు? తుఫాను సంభవించిన ప్రాంతంలో సహాయక కార్యక్రమాలను నిర్వహించడానికి జిల్లా కలెక్టర్లకు అధికారాలను యిచ్చామని మీరు చెబుతున్నారు. తుఫాను కారణంగా నష్టపోయిన వారికి ఏ సహాయ సహకారాలను వారు అందించారు? తుఫాను కారణంగా 61 మంది మరణించారని మీరు చెప్పారు. దానికి సంబంధించిన హెడ్ 111 (04) అక్కౌంట్ క్రింద రాష్ట్రమంతా కలిపి రూ. 21.50 లక్షలు మాత్రమే యిచ్చారు. 61 మంది చనిపోతే వారి కుటుంబాలకు నేటివరకూ ఎక్స్‌గ్రేషియా యివ్వడంలో ఎందుకు విఫలమయ్యారు? అందుకోసం కేవలం రూ. 21 లక్షలే ఎందుకు ఖర్చుపెట్టారు? హౌసింగ్ విషయంలో గృహాలు కోల్పోయిన వారికి వెనువెంటనే గృహాలను యివ్వాలి. గృహాలు కోల్పోయిన వారికి హెడ్ 101 (06) అక్కౌంట్ క్రింద రూ. 3.89 కోట్లు యిచ్చారు. అంటే ఎక్కడ సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి? డబ్బు ఎక్కడ ఖర్చవుతుంది ? పూర్తి వివరాలను వెల్లడించవలసిన అవసరముంది.

ఆహార దినుసులు, బట్టలు, వంటపాత్రలు కోల్పోయిన బాధితులకు రూ. 3 వేలు యివ్వాలి. ఆ మొత్తం బాధితులకు రూ. 1.50 కోట్లు మాత్రమే యివ్వడం జరిగింది. ఈ గణాంకాలన్నీ చూసినట్లయితే ఎక్కడా పూర్తి స్థాయిలో నేటివరకూ సహాయ కార్యక్రమాలు రాష్ట్రంలో జరగలేదు. మాకు తెలిసిన విషయం ప్రకారం, తుఫాను వల్ల జరిగిన ఈ నష్టాల గురించి ఒక నివేదికను తయారుచేసి వారికి అనుమతినివ్వాలని ప్రభుత్వాన్ని మళ్లీ కోరడం, ప్రభుత్వం అది పెండింగ్‌లో పెట్టడం జరుగుతోంది. అన్ని నిధులు ఖర్చు చేయడం కుదరదు, మళ్లీ ఆ గణాంకాలను రివైజ్ చేసి మరో నివేదికను పంపమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జిల్లాలకు వెళ్తున్నాయి. డ్యామేజి అనేది పెరుగుతుంది తప్ప తరిగిపోయే పరిస్థితి ఉండదు కదా! ప్రజలకు జరిగిన నష్టాన్ని రివిజన్ చేయవలసిన అవసరం ఏమి వచ్చింది ? ట్రెజరీ రూల్ (27) ను కూడా జిల్లా కలెక్టర్లు పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఎందుకు వచ్చిందో దానిపై ప్రభుత్వం వివరణ యివ్వవలసిన అవసరముంది. జిల్లా కలెక్టర్లు పనిచేయకుండా మీరు చేస్తున్నారా? లేక జిల్లా కలెక్టర్లే పని చేయకుండా అశక్తులయిపోయారా అనే విషయాల గురించి రాష్ట్ర ప్రభుత్వం చెప్పవలసిన అవసరముంది.

తుఫాను సంభవించిన కృష్ణా జిల్లాలో రూ. 2.26 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో రూ. 1.09 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ. 1.06 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. తుఫాను బాధితుల కోసం ఒక కోటి రూపాయిలు దాటి ఖర్చు చేసినవి కృష్ణా, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాలు మాత్రమే.

ఉ.11.20

ఎమెర్జన్సీ రిలీఫ్ ఎప్పుడు ఇస్తారండి? 48 గంటలలో ఎమెర్జన్సీ రిలీఫ్ ఇవ్వాలి. ఇప్పుడేంటి ఎమెర్జెన్సీ రిలీఫ్? ఇప్పుడు అంచనాలు వేస్తారా, ఇల్లు కొట్టుకుపోతే వారికి బట్టలు, యుటెన్సిల్స్, ఆహారం ఇవ్వాలి. 48 గంటల్లో ఎమెర్జన్సీగా ఇవ్వాల్సిన అవసరం ఉంటే, అది మానేసి, ఆ తరువాత ఇస్తామని చెబితే ఎలా? దానికి ఇంపార్టెన్స్ పోయె పరిస్థితి ఉంది. తగినటువంటి రీతిలో యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు జరగాల్సింది పోయి, తాపీగా, తీరుబడిగా ఆ కార్యక్రమాలు నిర్వహించడం అనేది చూసినట్టయితే, ఈ ప్రభుత్వ వైఫల్యం చాలా తీవ్రంగా ఉందనేది ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకురావడం జరుగుతుంది. విపత్తులు వచ్చినప్పుడు అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగి ముప్పయి రోజులు అయినా కూడా వారికి అమౌంట్ ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. తహసీల్దారు, ఆర్‌డివో, కలెక్టర్ స్థాయిలో ఇవ్వాల్సిన వాటిని కూడా మాకు ఫ్రీజ్, బ్యాన్ ఉందని ప్రభుత్వం నుండి అనుమతి రావాలని అధికారులు అంటున్నారు. అగ్ని ప్రమాదాలకు కూడా అమౌంట్ ముప్పయి రోజులలో వచ్చే పరిస్థితి లేదు. రూ.1.40 లక్షలు బడ్జెట్ వస్తున్నటువంటి పరిస్థితిలో ఆర్థిక సంక్షోభం ఏమైనా రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? ఇటువంటి తుఫాను వాటిలో సహాయ కార్యక్రమాల్ని సకాలంలో నిర్వహించలేనటువంటి ఆర్థిక సంక్షోభం ఏదైనా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే, దయచేసి దానిమీద ఒక వైట్ పేపర్ పబ్లిష్ చేయండి. ఈ రాష్ట్ర ప్రభుత్వం తాలూకు ఆర్థిక వ్యవహారాలు ఏమిటి? ఏమి లోటు వచ్చింది? ఈ సహాయ కార్యక్రమాలు ఎందుకు చేయలేకపోతున్నాము అనే టువంటిది ఒక వైట్ పేపర్ పబ్లిష్ చేయాల్సిందిగా ఈ ప్రభుత్వాన్ని తమరి ద్వారా కోరుతున్నాను. కనీసం ఇప్పుడైనా సరే ఆ ఆంక్షలను తొలగించండి. చనిపోయిన వారందరికి కూడా రూ.1.50 లక్షలు ఇస్తామంటున్నారు. రూ.1.50 లక్షలు చాలేటువంటి పరిస్థితి లేదు. కాబట్టి రూ.5.00 లక్షలు చనిపోయిన వారికి ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రభుత్వం ఎంత తొందరగా పని చేస్తే, ఆ ప్రభుత్వానికి అంత మంచిపేరు రావడం అనేది జరుగుతుంది. ఇటీవల చూసినట్లైయితే ఆమెరికాలో శాండి, మెగా హరికేన్ తుఫాను వచ్చింది. ఆ తుఫాను వచ్చినప్పుడు ఆమెరికా కోస్తా, తూర్పు ప్రాంతమంతా కూడా చాలా దెబ్బతిన్నది. అప్పుడు అటు అధికార పక్షం, విపక్షం వారు ఇద్దరూ కూడా ఎలక్షన్ క్యాంపెన్‌లో ఉన్నారు. ఒబామా, రోమ్నీ కూడా ఎలక్షన్ క్యాంపైన్ ఆపుచేసి ఆ సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించడానికి వెళ్లడం జరిగింది. ఆ పర్యవేక్షించడంలో ఒబామా ఎలక్షన్ క్యాంపెన్ కూడా ప్రక్కన పెట్టి తుఫాను సహాయ కార్యక్రమాలు బ్రహ్మాండంగా చేశారని, మంచి పేరు రావడం వల్ల ఆ మంచి పేరుతో ప్రజలు ఆయనకు ఓటు వేయడం జరిగిందని అనాలసిస్‌లు రావడం జరుగుతోంది. కానీ ఇక్కడ మనం ఏ స్థాయిలో ఉన్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి వారు ఆ తుఫాను వచ్చిన రెండు రోజులు కూడా జిల్లాలో ఉండాల్సిన క్యాబినెట్ అంతా కూడా ఢిల్లీలో ఉంది.

శ్రీ వట్టి వసంత కుమార్ (ఉంగుటూరు ) ః అధ్యక్షా, వారు వాస్తవం తెలుసుకోకుండా సభను పెడదోవ పట్టిస్తున్నారు.

శ్రీ దాడి వీరభద్ర రావు ః అధ్యక్షా, జిల్లాలో అడపా-దడపా పని చేసినటువంటి మంత్రుల గురించి నేను మాట్లాడడం లేదండి. చాలామంది ఢిల్లీలో ఉన్నారు. ఆ రెండు రోజుల్లో ఏ, ఏ మంత్రులు ఎక్కడెక్కడ ఉన్నారో అటెండెన్స్ ఇవ్వండి. ఎక్కడెక్కడ ఉన్నారో డైరీలు నాకు సబ్మిట్ చేయమనండి.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం )

శ్రీ దాడి వీరభద్ర రావు ః సభకు సబ్మిట్ చేయండి. ఎవరెవరూ, ఎంతమంది మంత్రులు ఎక్కడెక్కడా పర్యటన చేశారు. మొత్తం సబ్మిట్ చేయండి. మంత్రులు పర్యటన చేయాలి. కేవలం వచ్చినటువంటిదే కాదు. అందరం పర్యటన చేశాం. పశ్చిమ గోదావరి జిల్లాలో అధికార పార్టీ సభ్యులు ఎక్కడా కనిపించలేదని చెబుతున్నారు. అందుకు సమాధానం చెప్పండి. అధ్యక్షా, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రభుత్వం స్పందించాలి. ముఖ్యమంత్రి గారు కూడా ఆఘమేఘాల మీద వచ్చి పర్యటన చేస్తే, తప్పనిసరిగా దాని తాలూకు ఫలితాలు ఉంటాయి. ఆ ఫలితాలు లేకుండా పోయాయి అనేటువంటిది మా తాలూకు బాధ. ఎందుచేతనంటే, ఈ సైక్లోన్ విషయం రేపు, ఎల్లుండి వచ్చి మాట్లాడుకోవచ్చు అనేటువంటిది కాదు. ఆ స్పాట్‌లో 48 గంటల్లో రిలీఫ్ కార్యక్రమాలు జరగాలి. ఆ స్పాట్‌లో జరిగినప్పుడే ప్రభుత్వం అలర్ట్‌గా ఉండి రిలీఫ్ కార్యక్రమాలు చేస్తున్నదని ప్రజలకు భరోసా. క్యాబినెట్ కూడా పూర్తి స్థాయిలో చేసినట్లైతే విఫలమయ్యేటువంటి పరిస్థితి ఉండదు. హెలికాప్టర్స్, బోట్స్ లేవు. ఈ వేళ స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ల నుండి నివేదికలు తెప్పించుకొని మాట్లాడండి. నష్టపోయినటువంటి ప్రాంతాల్లో ఆర్ఐలు, గ్రామ కార్యదర్శులు, తహశీల్దారుల దగ్గర నుంచి ఎంతమంది ఆ గ్రామాలలో ఉన్నారు. మేము పర్యటించినటువంటి గ్రామాలలోకి కూడా రాలేదు. మండల అధికారులు పదిరోజుల వరకు పర్యటించనటువంటి గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి. వాటిని ఎగ్జామిన్ చేయాలి. మేము అన్నామని మీరు కోపాలు తెచ్చేసుకుంటే అవదు. మీరు పరిశీలన చేసుకోండి మీ క్రింద ఉన్నటువంటి యంత్రాంగం ఎంత బాగా పని చేస్తుంది. ఎందుకు విఫలమయింది అనేది పరిశీలన చేయవలసినటువంటి అవసరం ఉంది. ఈ వేళ సమీక్ష చేయండి, సమీక్ష చేస్తే, అధికారులకు భయం ఉంటుంది. రెండవ తారీఖున తుఫాను వచ్చింది. మూడవ తారీఖున వరదలు వచ్చి మొత్తం మునిగిపోయాయి. ఇక్కడ కంట్రోల్ రూం పెట్టాలి. ఎప్పుడు పెట్టాలి కంట్రోల్ రూం? కంట్రోల్ రూం ఇక్కడ 5వ తారీఖున పెట్టారు. తుఫాను వచ్చి వెలసిపోయిన తరువాత 5వ తారీఖున రాష్ట్రంలో కంట్రోల్ రూం పెట్టారు. ఎందుకు కంట్రోల్ రూం పెట్టకుండా విఫలమైంది. సాగునీటికి శాఖకు సంబంధించిన

బ్రీచెస్ పడిపోయాయి. వాటన్నింటికి కూడా సాగునీటి శాఖ వారు కంట్రోల్ రూం పెట్టాలి. ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయంలో ఎక్కడ పెట్టారండి. అదికూడా లేదు.

SRI C. RAMACHANDRAIAH: Sir, he has started the debate on surmises, but not based on the facts. The Control Room was constituted on the 2nd itself. ఎందుకంటే మంత్రి గారిని dispute చేయడానికి అవకాశం తీసుకోరు. అందువల్ల మీరు వీలైనంత వరకు facts పైన మాట్లాడండి. మనము పరిధిని దాటి మాట్లాడుతున్నాం. అధ్యక్షా, Can the Leader of Opposition demand the Tour Program of the Ministers in the august House? With all his wisdom, I am asking.

ఛైర్మన్ ః తుఫాను ప్రకాశం జిల్లా వరకు వచ్చి ఆగిపోయింది. రాదనుకున్నారు. అర్జెంటుగా నోటీసు ఇవ్వకుండా వచ్చింది. వాస్తవానికి I heard the Revenue Minister saying, తుఫాను ప్రకాశం జిల్లా వరకు వచ్చి అంత వరకే ఆగిపోయిందని పేపర్‌లో కూడా వచ్చింది. అది సడెన్‌గా మళ్లీ రావడం వల్ల కొంత గ్యాప్ వచ్చింది. అది ఒకటి, ఏదేమైనా, అలర్ట్‌గా ఉండాల్సిన అవసరం ఉంది.

శ్రీ దాడి వీరభద్ర రావు ః మాకు ఉన్నటువంటి సమాచారం ప్రకారం, డిపార్ట్‌మెంట్ వారు ఇచ్చినటువంటి, పత్రికల్లో వచ్చినటువంటి సమాచారాన్ని ఆధారంగా మేము మాట్లాడడం జరుగుతోంది. అంతే కాకుండా డైరీ అడగవచ్చా అంటే, నేనేమి డైరీ డిమాండ్ చేయలేదు. పర్యటించాము అంటే, పర్యటించినటువంటి వివరాలు చెప్పమని అడుగుతున్నాను. మీరు పర్యటించామని అన్నారు కాబట్టి, మేము అడిగాము. ఎస్పీ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూం పెట్టాలి. ఎన్ని ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూం పెట్టారండి. అక్కడ కూడా కంట్రోల్ రూం విఫలమవడం అనేది జరిగింది. ప్రతి సంవత్సరం కూడా డ్యామేజెస్, లీకేజెస్ ఏమైనా ఉన్నాయా? ఒడ్లు ఏమైనా చెడిపోయేటువంటి పరిస్థితులు ఉన్నాయా? అనేది సాగు నీటిపారుదల శాఖ వారు రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలనేటువంటి నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనల్ని సాగు నీటిపారుదల శాఖ వారు అమలు జరుపుతున్నారా? ఎక్కడైనా లీకేజెస్ ఉంటే వాటిని బాగు చేయాలి, బాగు చేస్తే బ్రీచ్ అయ్యేటువంటి పరిస్థితి ఉండదు. అలా చేయకపోవడం వల్ల బ్రీచ్ అవుతుంది. అలా బ్రీచ్ అవడం వల్ల గ్రామాలు, గ్రామాలు కొట్టుకుపోయేటువంటి పరిస్థితులు వస్తున్నాయి.

ఉ.11.30

వీటన్నింటి గురించి పూర్తిస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేగాకుండా ముఖ్యమంత్రిగారు ఖమ్మం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలలో ఒక్కరోజులోనే పర్యటించారు. మేము చాలా అసంతృప్తి చెందాము. ఆయన పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిగారు

స్పైస్‌జెట్ ఫ్లైట్‌కు వెళ్ళిపోతున్నారు కాబట్టి ఎవరూ కూడా బస్సు ఆపకూడదని చెప్పి జాతీయ రహదార్ల మీద దారి పొడవునా పోలీసులు నిలబడ్డారు. రెండురోజుల ముందునుంచీ ముఖ్యమంత్రిగారు వస్తారనే ఉద్దేశ్యంతో అందరూ కూడా అరేంజ్‌మెంట్స్‌లో ఉన్నారు. ఆ రెండు రోజులు కూడా అధికారులెవరూ సహాయ కార్యక్రమాలు చేసినటువంటి పరిస్థితి లేదు. ఆయన ఆగి ఆగి వచ్చినట్లయితే బాగుండేది.

(అంతరాయం)

శ్రీ పి.బాలరాజు (పాడేరు) : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక్క రోజులో మూడు జిల్లాలు, ఐదు జిల్లాలలో పర్యటించారనడం సరికాదు. ఎక్కడైతే తుఫానువల్ల నష్టపోయినవారు, బాధపడిన ప్రజలు ఉన్నారో ఆ ప్రదేశాలు సందర్శించాలి. వారికి ఓదార్పు ఇవ్వాలి. వారిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో పర్యటన కార్యక్రమాన్ని నిర్ణయించడం జరిగింది. మా విశాఖపట్నం జిల్లాలో కాలువ గట్లు తెగిపోయిన ప్రదేశంలో అర్ధరాత్రి అయినా దిగి ప్రజలతో మమేకమై వారితో మాట్లాడి, వారి అవసరాలు తీర్చడానికి ముఖ్యమంత్రిగారు చేసే ప్రయత్నాన్ని ఆగకుండా వెళ్ళిపోయారని అంటున్నారు. కానీ బస్సులో వెళ్ళేటప్పుడు రోడ్డుమీద కాకుండా ఆకాశం మీద బస్సులు వెళ్తాయా? గౌరవ ప్రతిపక్ష నాయకులు, సీనియర్ నాయకులు వారికి ఉన్నటువంటి అనుభవంతో ఇప్పుడు నష్టపోయిన రైతాంగాన్ని ఏ రకంగా ఆదుకుంటే బాగుంటుందో సలహాలు, సూచనలు చేస్తే మంచిది. నష్టం జరిగిన వెంటనే మేమందరమూ కూడా ప్రజల మధ్య ఉండి ఆ ప్రాంతాలను సందర్శించడం జరిగిందని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, ఎక్కడెక్కడ పర్యటనలు జరిగాయో అన్నీ దినపత్రికలలో రాశారు. ఇప్పుడు సమర్థించుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ఇటువంటి విపత్తులు వచ్చినపుడు కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా పర్యటనలు రూపొందించుకోవడం మంచిదనే విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది. ఇరవై లక్షల ఎకరాల పంటలు పూర్తిగా పోయింది. కానీ ఈ ప్రభుత్వం ఆ లెక్కలను తగ్గించి చూపిస్తున్నట్లుగా మాకు అనుమానంగా ఉంది. పంటలు నష్టపోయిన వాళ్ళందరికీ కూడా నష్ట పరిహారం వెంటనే ఇవ్వాల్సిన అవసరం ఉంది. పన్నెండు లక్షల ఎకరాలలో వరి పంట ఒక్కటే పూర్తిగా పోయినటువంటి పరిస్థితి. అలాగే ఆరు లక్షల ఎకరాలలో పత్తి నష్టపోగా, దూదిపూలు పూర్తిగా రాలిపోయాయి. ఉద్యాన పంటలు లక్ష ఎకరాల వరకు కూడా పోవడం జరిగింది. పత్తి యాభైమూడులక్షల క్వింటాళ్ళ వరకు దిగుమతికి నష్టం రావడం జరిగింది. వరంగల్‌లో అయితే మూడు లక్షల క్వింటాళ్ళ పత్తి పూర్తిగా నల్లబడిపోయి దానిని ఖరీదు చేసే పరిస్థితి కూడా కనబడడంలేదు. అలాగే తడిసి ముద్దయి పోయిన పంటలు ఉన్నాయి. సుమారు రు.100 కోట్లు నష్టం రావడం జరిగింది. అలాగే ఇరవై ఎనిమిది వేల ఎకరాల మొక్కజొన్న పూర్తిగా పోవడం జరిగింది. చెరకుపంట దెబ్బతింది.

రైతాంగానికి సుమారు రు.7000 కోట్ల నష్టం రావడం జరిగింది. ఈ నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారు? ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో మీరు ఏ విధంగా వారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారో చెప్పాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా నాలుగు లక్షల తొంభై అయిదు వేల హెక్టార్లలో యాభై శాతం కంటే ఎక్కువగా పంటకు నష్టం వచ్చిందని మీ లెక్కలలో చెప్పడం జరిగింది. మళ్ళీ పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది. అలాగే మీ తాలుకు లెక్కలు కొంచెం సవరించుకోవాల్సిన అవసరం ఉంది. మీరు కేవలం రు.300 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సరిపోతుందని అన్నారు. కాబట్టి ఈ లెక్కల ప్రకారంగా ఉద్యానపంటలు, ఇతర పంటలకు సంబంధించిన నష్టాన్ని అంచనా వేయించి ఆ నష్ట పరిహారాన్ని రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. అదేవిధంగా పశువులు, కోళ్ళు వంటి వాటిని వారు తిరిగి కొనుక్కోవడానికి వెంటనే ఆర్థిక సహాయాన్ని అందించాలి.

తెగిపోయిన చెరువులు, గట్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలి. వాటికి నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామీణ ఎత్తిపోతలు, చిన్న తరహా నీటి వనరులు, త్రాగునీటి సదుపాయం వంటి పథకాలు కూడా పోయాయి. పైపులు, ట్యాంకులు దెబ్బతినడంతోబాటు 382 నీటిపారుదల చెరువులు కూడా కొట్టుకుపోయాయి. వీటన్నింటినీ పునరుద్ధరించకపోతే గ్రామాలకు మంచినీరు కూడా లేని పరిస్థితి వస్తుంది. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారులు కూడా పూర్తిగా కొట్టుకు పోయాయి. ఇవాళ జాతీయ రహదారుల మీద ఉన్న గోతులను కూడా పూడ్చలేని పరిస్థితి ఉంది. వాటికి నిధులు ఉన్నాయి. ఆ రహదారులు మెయింటైన్ చేసే కాంట్రాక్టర్‌కు డబ్బు ఇవ్వడం జరుగుతుంది. వాళ్ళు కూడా దానిని బాగుచేయడం లేదు. ఈ ప్రభుత్వం పనిచేసే ప్రభుత్వంగా లేకపోవడం వల్ల వాళ్ళ డ్యూటీలు కూడా వాళ్ళు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఎందుకు బాగుచేయడంలేదని అడిగే నాధుడే లేని పరిస్థితిలో ఉన్నారు.

సైక్లోన్ కంటింజెన్సీ ప్లాన్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం జరుగుతుంది. దాని ప్రకారంగా ముఖ్యమంత్రిగారి ఆధ్వర్యంలో డిజాస్టర్స్ మేనేజిమెంట్ కమిటీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ఫ్లడ్ రిలీఫ్ కమిటీలు ఉంటాయి. యం.ఆర్.ఓ ఆధ్వర్యంలో మండల ఫ్లడ్ రిలీఫ్ కమిటీలు ఉంటాయి. ఇవన్నీ కూడా ఏప్రిల్ లోను, సెప్టెంబర్‌లోను సంవత్సరానికి రెండుసార్లు సమావేశం అవ్వాలి. రాబోయే అవాంతరాలు అంటే తుఫాను, వరదలు వస్తుందని ముందే ఊహించినట్లయితే దానిమీద ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే ప్రణాళికను ఒకదానిని సిద్ధం చేసుకోవాలి. ఇప్పటివరకు ఎన్ని సమావేశాలు నిర్వహించారో చెప్పాలని లీడర్ ఆఫ్ ది హౌజ్‌ను అడుగుతున్నాను. రాష్ట్ర , జిల్లా, మండల స్థాయిలలో ఎన్ని సార్లు ఈ సమావేశాలు నిర్వహించారు? అసలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన సైక్లోన్ కంటిజెన్సీ ప్లాన్‌ను ఎక్కడైనా అమలుజరుపుతున్నారా? అమలుచేయకపోతే ఎందుకు చేయడంలేదు? అమలుజరిపితే ఎటువంటి

అవాంతర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి వీటన్నింటినీ సక్రమంగా చేస్తే బాగుంటుంది.

ఎక్కడైతే తుఫాను ఉందో అక్కడ రుణ శిబిరాలను ఏర్పాటు చేయమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారు మార్గదర్శకాలు ఇచ్చారు. ఏ బ్యాంకరు కూడా రుణ శిబిరాలను ఏర్పాటు చేయడంలేదు. రైతులు ఎక్కడైతే నష్టపోయారో వారందరికీ కూడా అక్కడికక్కడే రుణాలు అందచేయమని మార్గదర్శకాలు ఉన్నా కూడా అవి అమలుచేయడంలేదు. ఇప్పుడు ఉన్న పంట రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా పది సంవత్సరాల వరకు మార్పు చేసి ఫ్రెష్ లోన్స్ ఇవ్వమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. అంతేగాకుండా గృహ అవసరాల కొరకు ప్రభుత్వం రైతులకు అందచేస్తున్న రు.3000 సరిపోవు. వాళ్ళకి రు.10000 వరకు తక్కువ వడ్డీతో రుణాలు అందచేయమని మార్గదర్శకాలు ఉన్నా అది కూడా చేయడం లేదు. కాబట్టి ఇవన్నీ కూడా సక్రమంగా జరిపేలాగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ సమావేశం నిర్వహించాలి. ఇంతవరకు ప్రభుత్వం ఆ సమావేశాన్ని నిర్వహించలేదు. తుఫాను, కరువు వచ్చిన వెంటనే ఈ సమావేశాన్ని నిర్వహించాలి. అదే విధంగా జిల్లా స్థాయిలో ఉన్న బ్యాంకర్స్‌తో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి రైతులకు రుణాలు అందజేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలలో ఉంది. దానిని కూడా రాష్ట్రంలో కానీ, జిల్లాలలో కానీ అమలు చేయలేదు. అమలు చేసే పరిస్థితి కూడా కనబడడంలేదు. కాబట్టి రైతులను ఆదుకుని, నిబంధనలు ఏవైతే ఉన్నాయో వాటిని సక్రమంగా అమలు చేసేటట్లు చేయమని మేము డిమాండ్ చేస్తున్నాము. అలా అమలుచేస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి అవాంతరాలు ఎదురైనపుడు ఎక్కువ నష్టం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రంగు మారిన మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి. దానికి నిబంధనలు అనే పేరు చెప్పి ఇక్కడే ఉంచే పరిస్థితి రావడానికి వీలులేదు.

ఉ. 11.40

రైతులకు అవసరమైన ఎగ్జమ్షన్స్ ఇవ్వాలి. ఆ రైతులకు ఎగ్జమ్షన్స్ ఇచ్చి అయినా, వారి దగ్గర దెబ్బతిన్నటువంటి పంట వారి దగ్గరే ఉండిపోకుండా ప్రభుత్వం తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేగాకుండా, వడ్డీ మాఫీ చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, రైతులు వడ్డీని చెల్లించే పరిస్థితిలో లేరు. కావున తక్షణమే ప్రభుత్వం వారికి వడ్డీ మాఫీ చేసి, ఋణాల రీ షెడ్యూల్ చేసి, క్రొత్త ఋణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

మిస్టర్ ఛైర్మన్ : వీరభద్రరావు గారూ, త్వరగా ముగించండి. ఇప్పటికే చాలా సమయం అయింది.

శ్రీ దాడి వీరభద్రరావు ః త్వరగానే క్లోజ్ చేస్తాను. డిమాండ్సు చెప్తున్నాను. రైతులకు విత్తనాలను కూడా 90 శాతం సబ్సిడీకి సరఫరా చేయవలసిన అవసరం ఉంది. అదేవిధంగా తుఫాను పడి గృహాలు కోల్పోయిన నిరుపేదలకు కూడా ఇందిరా ఆవాస యోజనలో (ఐఎవై) వారికి గృహాలను ఇప్పించే ఏర్పాట్లు చేయాలి. అంటే, వారు తిరిగి చెల్లించుకునే పరిస్థితులలో ఉండరు కావున ప్రభుత్వం ఐఎవైలో గృహాలను ఇప్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేగాకుండా, కొన్నిచోట్ల తీరప్రాంతాలలో తుఫాను షెల్టర్లు కూడా లేవు. అటువంటి ప్రాంతాలను గుర్తించి తక్షణమే తుఫాను షెల్టర్ల నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉంది. ఏటి ఒడ్డున, సముద్రపు ఒడ్డున ఉన్న గ్రామాలలోనూ, తీర ప్రాంతాలలోనూ, ఎత్తుగా ఈ తుఫాను షెల్టర్లను నిర్మించడమే కాకుండా, అందులో చుట్టుప్రక్కల ప్రాంతాల గ్రామ ప్రజలు తలదాచుకునేలాగా తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. వీటికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా నిధులను మంజూరు చేస్తుంది. గత ఎనిమిది సంవత్సరాల నుండి కాలువలు అన్నీ పూడికలు తీయకుండా అలాగే ఉంచేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ కాలువల పూడికలు తీయించే విధంగా తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా విశాఖపట్టణం జిల్లాలోని ఎస్. రాయవరంలో ఒక నది పూర్తిగా డైవర్ట్ అయిపోయి, వేరే గ్రామాలకు వెళ్ళిపోతోంది. ఎక్కడెక్కడయితే నదులు డైవర్ట్ అవుతున్నాయో, వాటిని గుర్తించాలి. లేకపోతే, డైవర్ట్ అయిన నదుల వల్ల గ్రామాలు కొట్టుకుపోయి, నది డైవర్షనే పూర్తిగా మారిపోయే పరిస్థితి ఉంది కాబట్టి, ఆ విధంగా డైరెక్షన్ మారిపోయే ప్రాంతాలలోనూ, టర్నింగ్ పాయింట్లలోనూ పెద్ద పెద్ద కాంక్రీట్ గోడలను నిర్మించవలసిన అవసరం ఉంది. అటువంటివాటిని గుర్తించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే రైతులకు అందుబాటులో ఉండే నదుల దగ్గర ఉండే నిర్మాణాలు కొంతమేర కోతలకు గురయ్యాయి. వాటిని కూడా పునరుద్ధరించవలసిన అవసరం ఉంది.

ఇక ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి ఇంతవరకూ చాలా తక్కువగా ఇస్తున్నారు. వరికి ఎకరాకు సుమారు రూ.10,000లు ఈ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడానికి ముందుకురావలసిందిగా కోరుతున్నాను. ఎందుకంటే, రైతు వరికి సంబంధించి ఒక ఎకరాకు సుమారు రూ.20,000ల వరకూ శిస్తు కాకుండా, పెట్టుబడి పెట్టారు. అంత మొత్తంలో పెట్టుబడి పెట్టాడు కాబట్టి, కనీసం ఎకరాకు రూ.10,000ల చొప్పున అయినా ఆ రైతుకు ప్రభుత్వం చెల్లిస్తే బాగుంటుంది. వీటికి సంబంధించి కాబినెట్ సబ్‌కమిటీని కూడా వేశారని అన్నారు. ఈ విషయాలు పత్రికలలో వస్తున్నాయి. దీనివలన హెక్టారుకు రూ.10,000ల చొప్పున పెంచుతున్నామని కూడా వార్తలు వచ్చాయి. ఈ రోజున ఆ డబ్బులు కూడా సరిపోయే పరిస్థితి లేదు. కనీసం ఒక ఎకరాకు రూ.10,000లు ఉదారంగా రైతులకు ఇచ్చేవిధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ విషయానికి సంబంధించి ఈ రోజు ముఖ్యమంత్రిగారు సభలో అనౌన్స్ చేస్తారని ఆశిస్తున్నాము. ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రజలందరూ ఎంతో ఆత్రురతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడెప్పుడు పెంచుతారా, పెంచిన ఆ అంకె ఎంత ఉంటుందా అని ఎదురు చూస్తున్నారు. కాబట్టి, ప్రత్తి, వేరుశనగ, పప్పుశనగ, చెరకు పంటలకు రూ.15,000లు చెయ్యాలని, మిరప, పండ్ల

తోటలు, కూరగాయలు, ప్రొద్దు తిరుగుడుకు రూ.12,500లు చెయ్యాలని మేము ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాము. అంతేగాకుండా, కౌలురైతులకు, భూమిని పండించే ప్రతి రైతుకు ఈ నష్టపరిహారాన్ని అందించడానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలి. ఆ భూ యజమానులు ఈ సొమ్మును తీసుకోకుండా, రైతులకు ఆ సొమ్ము అందేలా తగిన చర్యలు చేపట్టాలి. అదేవిధంగా దేవాదాయ శాఖ మంత్రి కూడా సభలో ఉన్నారు. వారికి మనవి చేసేదేమిటంటే, దేవాలయాల తాలూకు భూములను కొంతమంది శిస్తులకు తీసుకుని పంటలు పండించేవారు ఉన్నారు. ఇప్పుడు ఆ పంట పూర్తి అయిపోయింది. దేవాలయాలకు నష్టం కలిగించమని మేము చెప్పము. ఆ దేవాలయాలకు రైతులు చెల్లించాల్సిన శిస్తును రాష్ట్ర ప్రభుత్వం వారు దేవాలయాలకు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవలసిందిగా మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఈ విధంగా ఈ సహాయ కార్యక్రమాలను అనౌన్స్ చేయవలసిందిగా ఈ రాష్ట్రప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నాము. ధన్యవాదములు.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (స్థానిక సంస్థలు) ః అధ్యక్షా ! 'మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లుగా' - ఆంధ్రప్రదేశ్‌లో లైలా, జల తుపానులతోబాటు ఇటీవల నీలం తుపాను రావడం, చాలా జిల్లాలు అతలాకుతలం అవడం, రాజకీయ నేపథ్యం కాకుండా, అందరికీ కన్‌సర్న్ అనే సబ్జక్టుతో, సాధ్యమైనంతవరకూ అందరు కూడా రైతు కుటుంబాలనుంచి వచ్చినవారే. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సహా, అందరికీ ఈ ప్రకృతి వైపరీత్యాలపై కన్‌సర్న్ ఉంటుంది. దీనిని రాజకీయ కోణంలో కాకుండా, ప్రభుత్వం చేయవలసింది చేసుకుంటూ, అపోజిషన్ వారు, ఎల్.ఓ.పి. గారు కూడా కొన్ని మంచి సూచనలు చేశారు. కొన్ని రాజకీయ పరమైనటువంటి వ్యవహారం కూడా వచ్చింది. నేను దానిలోకి వెళ్ళకుండా - ఇంత భారీ నష్టం జరిగిన నేపథ్యంలో నాలుగవ తారీఖున నేను ఢిల్లీలో ఉన్నప్పుడు ఐదవ తారీఖున యూ.పి.ఎ. ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ గారిని కలిసినప్పుడు వారు ఎంత కన్‌సర్నో చెప్పాలి కాబట్టి చెబుతున్నాను. నేను విట్‌నెస్.

(శ్రీ మహమ్మద్ జానీ గారు అధ్యక్షస్థానం వహించారు.)

ఢిల్లీలో వారిని కలిసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి నివేదికల ప్రకారం, పరిస్థితులు ఎలా ఉన్నాయని, నాతో మాట్లాడడం, ముఖ్యమంత్రిగారితో మాట్లాడడం కూడా జరిగింది. ప్రధానమంత్రిగారు కూడా మాట్లాడారు. మా జిల్లాకు ఆరవ తారీకున ముఖ్యమంత్రిగారు హుటాహుటిన సంబంధిత రెవెన్యూ శాఖ, సహాయ శాఖల మరియు రిలీఫ్ శాఖ మంత్రులతోనూ, వ్యవసాయ మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా మంత్రి ఈ విధంగా అందరు మంత్రులతోనూ సత్తుపల్లి, దమ్మపేట మండలాలను పర్యటించడం జరిగింది. మా జిల్లాలో భారీ నష్టం జరిగింది. రైతాంగాన్ని కలిసి పరామర్శించి, వారు కష్టంలో ఉన్నారని, వారికి గుండె ధైర్యం చెప్పి, ఇది రైతు మేలు కోరే ప్రభుత్వమని ఊరడించారు. సోనియా గాంధీ గారు ఎంత

దయార్ద్రహృదయులు అంటే, వారు ఎవరితో చెప్పించుకోవలసిన పరిస్థితి లేదని, ఋణాలతో బాధపడుతున్న రైతాంగానికి సుమారు రూ.72,000 కోట్లు ఋణమాఫీ చేసినటువంటి యూపిఏ ప్రభుత్వం ఇది. రాష్ట్ర ప్రభుత్వం ఆరకంగా అప్పటివరకూ ఉన్న ఋణాలను రద్దు చేసిన ప్రభుత్వం ఇది. అంతేగాకుండా, కౌలుదారీ చట్టాలను తీసుకువచ్చి, కౌలు చేస్తున్నటువంటి రైతులకు రికార్డు ఇచ్చినటువంటి ప్రభుత్వం ఇది. అయినప్పటికీ, ఒక రైతు ముఖ్యమంత్రిగా శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారి కన్‌సర్న్‌తో వారు చేయవలసినంతవరకూ, వారి పరిధిలో ఉన్నంతవరకూ చేస్తూనే ఉన్నారు. రాజీవ్‌గాంధీగారి పుణ్యమా అని టెక్నాలజీ రావడం వలన ముఖ్యమంత్రిగారు ఢిల్లీలో ఉన్నా, ఎక్కడ ఉన్నా కూడా ఆయన నిముష నిముషానికి మంత్రులను, సంబంధిత జిల్లా కలెక్టర్లను అలర్ట్ చేసినటువంటి సంఘటనలు కూడా ఉన్నాయి. నేను ఏదో సమర్థిస్తున్నాని అనుకోవద్దు. అయినప్పటికీ ఇంకా చేయవలసింది చాలా ఉంది అధ్యక్షా, వీటికి సంబంధించిన ఎన్యూమరేషన్ కూడా జరుగుతోంది. ఒక్క ఖమ్మం జిల్లాను తీసుకున్నట్లయితే, అక్కడ వర్షపాతం 1975వ సంవత్సరం తరువాత సుమారు 200 మిల్లీ మీటర్లు పడిందంటే, ఎంత భారీస్థాయిలో వర్షం కురిసిందో మీరు ఆలోచించాలి. పంట చేతికి వస్తున్న సమయంలో ఈ వర్షపాతం కురియడం వలన రైతుకు చేతి నుంచి నోటి దాకా వచ్చిన ముద్ద పడిపోయినట్లు అయిపోయింది. ఈ వర్షాలకు మా జిల్లాలో సుమారు ఐదుగురు వ్యక్తులు చనిపోయినట్లుగా చెబుతున్నారు. ఇటీవల ఒకరు, ఇద్దరు పంటలను చూసి తట్టుకోలేక వారు కూడా ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా కొన్ని వెలుగులోకి వస్తున్నాయి. వీటికి సంబంధించి తిరుమలాయ పాలెం, మొదలైన ప్రాంతాలలో ఇంకా వెలుగు చూడని సంఘటనలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ సుమారు 900 గ్రామాలలో పంట నష్టం జరిగింది. ముఖ్యంగా మా జిల్లాలో ప్రత్తిపంటకు భారీగా నష్టం వాటిల్లింది. వరి, మిర్చి, మొక్కజొన్న మొదలైన పంటలకు సంబంధించి వేలాది హెక్టార్లలో భారీ నష్టం సంభవించింది. నేను తమ ద్వారా మనవిచేసేదేమిటంటే, సుమారు రూ.400 కోట్లకు ఇప్పుడు ఉన్న అంచనాల ప్రకారం రాష్ట్ర స్థాయిలో ఉన్నటువంటి 19 జిల్లాలలో మొదటగా తూర్పు గోదావరి జిల్లా తరువాత, ఖమ్మం జిల్లాలో భారీగా నష్టం సంభవించింది. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను, ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి కూడా ఎన్నడూ లేని విధంగా గతంలోనే సుమారు రూ.1800కోట్లు ఈ ప్రభుత్వం ఇచ్చి, 99 శాతం డిస్బర్స్‌మెంట్ అయినటువంటి పరిస్థితిలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం జరిగింది. ఇప్పుడు కూడా ఉపసంఘం రికమ oడేషన్ చేసినటువంటి వార్తలు వస్తున్నాయి. ఈ సబ్సిడీని మరింత పెంచి, రైతాంగాన్ని ఇతోధికంగా ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఋణాలను రీ షెడ్యూల్ చేయడం, విద్యార్థులకు ఆ ప్రాంతంలో ఫీజులు మాఫీ చేయడం మొదలైన అంశాలను ప్రభుత్వం పరిశీలించవలసిందిగా కోరుతున్నాను. ప్రధాన ప్రతిపక్ష నాయకులు చెప్పినట్లుగా వరిలో రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఎఫ్.సి.ఐ.తో మాట్లాడడంతోబాటు మా జిల్లాలో ఉన్న పత్తికి సంబంధించి కూడా సి.సి.ఐని రంగంలోకి దించి, వారికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి, పత్తి కొనుగోలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఈ విధమైన చర్యలు తీసుకోవడం వల్ల రైతాంగానికి

కొంత వెసులుబాటు కల్పించినట్లవుతుంది. అదేవిధంగా రైతులకు సంబంధించి ఋణాల రీ షెడ్యూలు, వడ్డీ మాఫీని కూడా అవసరమైతే కన్సిడర్ చేయవలసిందిగా మీ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి, సంబంధిత మంత్రులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఏది ఏమైనప్పటికీ, ఈ అంశానికి సంబంధించి పెద్దఎత్తున కేంద్రప్రభుత్వానికి కూడా ఇటీవల ముఖ్యమంత్రిగారు నివేదికలు ఇస్తున్నట్లు తెలిసింది. అంతేగాకుండా, సుమారు రూ.3,566కోట్లు రిక్వెస్టు కూడా ఇస్తున్నట్లుగా రెవెన్యూ మంత్రిగారు ఇచ్చిన నోట్‌లో ఉంది. అంటే, ఇంకా ఇందులో సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. ఏదిఏమైనప్పటికీ, నీలం తుపాను సంభవించి కొన్ని నెలలు కావస్తున్నా, రైతులు అప్పో, సొప్పో చేసి, తిరిగి రైతులు పంటలు వేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే సమయానికి పంటపొలాలు తిరిగి పచ్చదనంతో ఉంటే, ఇంక ఆ బృందం పచ్చటి పొలాలలను ఏ విధంగా రికార్డు చేసుకుంటారు. ఇది పెద్దల సభ, విజ్ఞుల సభ కాబట్టి, ఈయొక్క మెకానిజాన్ని సాధ్యమైనంత త్వరగానూ, అత్యవసరంగానూ, ఇంక ఏ మాత్రం ఆలశ్యం కాకుండా, వెంటనే ఉపశమనం కలిగించే విధంగా తగినన్ని నిధులను మంజూరు చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఆకలి వేసినప్పుడు అన్నం పెడితేనే అర్థం ఉంటుంది. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం ఇచ్చేదేదో సమయానికి ఇచ్చినట్లయితే రైతాంగాన్ని ఆదుకునే పరిస్థితి ఉంటుందని ఈ సభ ద్వారా కేంద్రప్రభుత్వానికి కూడా విజ్ఞప్తి చేసుకుంటున్నాను. ఈ విధంగా ఫస్ట్ ప్రయారిటీగా మన రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే విధంగా తగిన ప్రయత్నం చేస్తే బావుంటుందని విజ్ఞప్తి చేస్తున్నాను.

***ఉ.11.50***

డ్యామేజ్ అయిన రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, పవర్, త్రాగునీరు, భవనాలు అన్నీ కూడా దెబ్బతిన్నాయి. ఇవన్నీ కూడా ప్రయారిటీ క్రింద చేయాలి. ఎమర్జెన్సీ రిలీఫ్ మా జిల్లా వరకూ అయితే బాగానే వచ్చేలా మా జిల్లా మంత్రిగారు, ఇన్‌చార్జి మంత్రిగారు మానిటర్ చేస్తున్నాము. LOP గారు చెప్పినట్లు అమెరిగా గోల మనకు అక్కరలేదు. అమెరికా అధ్యక్షుని ఎన్నికలలో తుఫాను వచ్చినా వారు గెలిచారు అంటే, ఆ రకమైన మంచి పేరు మాకు అక్కరలేదు. అలాంటి తుఫానులు రావద్దని భగవంతున్ని కోరుకుంటున్నాము. అలాంటి మంచి పేరులు కానీ, అలాంటి మంచి కార్యక్రమాలు చేసే పరిస్థితి కానీ రావద్దని ఈ సభ ద్వారా నేను మిమ్మల్ని కోరుకుంటున్నాను. భగవంతున్ని కోరుకునేది ఏమిటంటే మనందరికీ మంచి జరగాలి, రైతాంగాన్ని ఆదుకునే ప్రభుత్వం మా ప్రభుత్వం. ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి గారు కూడా రైతు కుటుంబం నుంచే వచ్చారు. నేను ఎవరినీ విమర్శించడం లేదు. రైతాంగానికి మేలు చేయడానికి మా నాయకురాలు, ప్రధాన మంత్రి గారు కూడా సానుకూలంగా ఉన్నారు. Cost of living పెరిగినప్పటికీ ఉన్న పరిధిలో మినిమం సపోర్టు ప్రైస్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న సివిల్ సప్లైస్ శాఖ వారు కూడా మానిటరింగ్ చేస్తున్నారు.

నేను LOP గారితో ఏకీభవించేది – ఇసుక మైనింగ్ వ్యవహారం. నేను గతంలో కేంద్ర పర్యావరణ శాఖ వారికి, రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఇసుక మైనింగ్ అనేది చాలా ప్రమాదకరమైనది. స్పేస్ టెక్నాలజీకి ఉపయోగపడుతుంది కాబట్టి అందులో ఆరు రకాల మినరల్స్‌ని ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో ఇసుక మైనింగ్ జరుగుతుంది. ప్రభుత్వం అలాంటి కార్యక్రమాలకు స్వస్తి పలికితే, ఆ ప్రాంతం సురక్షితంగా ఉంటుంది. ఎందుకంటే environmental protection rules, సి.ఆర్.జెడ్ రూల్స్‌ను అతిక్రమించి చేస్తున్నటువంటి పరిస్థితి ఉంది. నేను మీ ద్వారా సభను కోరేది ఏమిటంటే, environment protection అందరూ పాటిస్తే, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు తట్టుకునే శక్తి ఆ తీర ప్రాంతాలకు ఉంటుంది. ఈ తుఫానులను రాజకీయం చేయకుండా, మీరు చేయలేదు, మేము చేయలేదు అనేది కాదు. ప్రతిపక్షం నుంచి మంచి సూచనలు వచ్చాయి. రైతాంగం, సామాన్య ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి మంచి కార్యక్రమాలను మనందరం కూడా ప్రోత్సహించాలి. ప్రజలు, రాష్ట్రం కష్ట కాలంలో ఉన్నప్పుడు మనోధైర్యం పెంచే కార్యక్రమాలను మనం చేయాలి. ఓట్ల రాజకీయం, లేదా ఈ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తే, మనకు మంచి పేరు వస్తుందనే కోణంలో ఆలోచించకూడదు. రాష్ట్ర ప్రభుత్వానికి గురుతర బాధ్యత ఉంది. వాతావరణ శాఖ ఇచ్చిన రిపోర్టును నేను చదవడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నా దాని మీద సమగ్ర దర్యాప్తు జరపాలి. నీలం తుఫాను వచ్చిన సమయం, వారిచ్చిన హెచ్చరికలు, తీసుకున్న చర్యలు, ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకోవాలని మీ ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎక్కడ లోపం జరిగిందో ప్రజలు
తెలుసుకోగోరుతున్నారు. యంత్రాంగం అలెర్టు అయినప్పటికీ ఎందుకు నష్టం వచ్చింది. కంట్రోలు రూములు పెట్టి అక్కడ ఉన్న షార్టు మెకానిజం, ఎమర్జెన్సీ మెకానిజం, లాంగ్ టెర్మ్ మెకానిజం ఇన్ని రకాలుగా ఉన్నప్పటికీ అలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది. తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణన లోనికి తీసుకొని – ముఖ్యమంత్రిగారిని, రిలీఫ్ శాఖ మంత్రిగారిని తీసుకున్న చర్యలకు అభినందిస్తూ, తీసుకోబోయే చర్యలు తొందరగా, సక్రమంగా తీసుకుంటే తప్ప, దెబ్బతిన్న రైతులకు సహాయాన్ని అందించే పరిస్థితి ఉండదని తెలియజేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్రర్వం input subsidy పెంచే కార్యక్రమం ఇతోధికంగా, ఎంత పెంచితే ఉపయోగకరంగా ఉంటుందో అలోచించి చేయాలని కోరుకుంటూ, మరొక సారి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు అభినందిస్తూ, తీసుకోబోయే చర్యలు యుద్ధ ప్రాతిపదిక మీద చేయాలని విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జెల్లి విల్సన్ (లోకల్ అథారిటీస్) ః అధ్యక్షా! గతంలో వచ్చిన జలతుఫానుకన్నా నవంబరు మొదటి వారంలో వచ్చినటువంటి నీలం తుఫాను వల్ల మన రాష్ట్రానికి తీవ్రమైన నష్టం వాటిల్లింది. పంటలు చేతికొచ్చే సమయానికి రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. నదులు, వాగులు పొంగి జనజీవనం స్తంభించిపోయిన పరిస్థితి ఉంది. రైలు కట్టలు తెగిపోయి, రోడ్లు తెగిపోయి ప్రయాణాలు

కూడా చాలా ఇబ్బందిగా ఉన్న పరిస్థితిలో మా పార్టీ వైపు నుంచి, సి.పి.ఐ నాయకత్వంలో ఎక్కడైతే ఈ ప్రమాదం సంభవించిందో మొత్తం అన్ని జిల్లాలలో కూడా బృందాలుగా ఏర్పడి పర్యటించి సహాయక చర్యలను చేపట్టే అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగింది. ఏది ఏమైనా ముఖ్యంగా రాష్ట్రంలో లక్షలాది హెక్టారులు – వరి, జొన్న, మొక్కజొన్న, శెనగ పంటలతో సహా కూరగాయ పంటలన్నీ కూడా తీవ్రమైన నష్టానికి గురి అయ్యాయి. అలాగే గుడిసెలు, ఇళ్ళు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల అంధకారంలో చిక్కుకున్న పరిస్థితి ఉంది. భారీ నష్టం జరిగింది. తుఫానును పసిగట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో వాతావరణ శాఖ విఫలం అయిందని మనందరికీ తెలిసినటువంటి అంశం. అలాగే దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలు పంపించి, వాటికి సంబంధించి సహాయక చర్యలు రాబట్టడంలో మన ప్రభుత్వం విఫలం అయింది. గతంలో వచ్చిన తుఫానులకు మాత్రమే ఇప్పుడు కేంద్ర బృందాలు వచ్చాయి. ఇప్పుడు జరిగినటువంటి నీలం తుఫానుకు, బృందాలు రావడం కానీ, వాటి అంచనాలను తయారు చేసే పరిస్థితి కానీ లేకుండా పోయింది.

పట్టణాలలో ముఖ్యంగా నివాస ప్రాంతాలలో వరద నీరు – విజయవాడ లాంటి నగరాలలో వరద నీరు వెళ్ళడానికి out-fall సరిగా లేక నీటిలో చిక్కుకున్నాయి. కృష్ణా జిల్లాలో మెట్ట ప్రాంతాల నుంచి వచ్చిన బుడమేరు వరద వల్ల విజయవాడ నగరాన్ని, అలాగే ఆ నగర దిగువు భాగాన ఉన్న నివాస ప్రాంతాలను పంటపొలాలను వరద నీరు ముంచెత్తాయి. కృష్ణా, గోదావరి డెల్టాల ఆధునికీకరణ పనులు సకాలంలో చేసి ఉంటే, అలాగే డ్రైనేజీ వ్యవస్థమీద ప్రభుత్వం దృష్టి పెట్టి, పక్కాగా దానిని అమలు జరిపి ఉంటే, ఇలాంటి తీవ్రమైన పరిస్థితి వచ్చి ఉండేది కాదు. డ్రైనేజీ వ్యవస్థని మెరుగు పరచుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని చెరువులైనా కట్టలు తెగకుండా ఉన్నందుకు కొద్దిగా సంతోషించాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో కట్టలు బలోపేతం చేసుకోవడం వల్ల ఆ కట్టలన్నా మిగిలి ఉన్నాయని నాకు అర్థం అవుతుంది. శ్రీకాకుళం జిల్లా కాకరాలపల్లి వద్ద ఈస్ట్ కోచ్‌కు సంబంధించినటువంటి పవర్ ప్లాంటు వుంది. ఆ ప్లాంటు నిర్మాణం వల్ల సముద్రంలోకి out-fall లేకపోవడం వల్ల వేలాది ఎకరాలు వరి పంట మొత్తం నాశనం అయింది.

12.00 noon

అసలు అవుట్ ఫాల్ అనేదే లేదు. వాళ్లు మూసేశారు. అక్కడ సరైన పరిస్థితి లేకుండా పోయింది. అలాగే గుంటూరు జిల్లాలోని కొండవీడు వాగు సమస్యను పరిష్కారం చేయాలని దశాబ్దాలుగా ఆ ప్రాంత రైతులు గానీ ప్రజలు గానీ పోరాడుతున్నారు. ఆ కొండవీడు వాగును బకింగ్‌హ్యామ్ కెనాల్ ద్వారా ప్రకాశం బ్యారేజీ క్రింద వున్నటువంటి కృష్ణా నదిలో కలిపితే దాని ప్రమాదాన్ని నివారించ వచ్చు, ఆ ప్రాంత పొలాలను గానీ ప్రజలను గానీ ఆదుకునే పరిస్థితి ఉంటుంది. అలాగే తెనాలి, దుగ్గిరాల

ప్రాంతంలో వుండే డిబిఆర్‌సి ని వెడల్పు చేసి దాని కరకట్టల ఎత్తును పెంచితే బాగుంటుందని చెప్పాం . ఈ సందర్భంగా మంత్రి రఘువీరారెడ్డి గారి దృష్టికి ఒక విషయాన్ని తీసుకరాదలిచాను. కృష్ణా జిల్లా వీర్లపాడు, కంచికచర్ల మండలాలలో రైతులు మహాజాన్సీ అనే పత్తి విత్తనాన్ని నూజివీడు సీడ్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేశారు. నీలం తుఫాను వల్ల ఆ పంటే లేకుండా పోయింది. ఐదు వేల ఎకరాలలో దాదాపు మూడు వేల మంది రైతులు నష్టానికి గురైన పరిస్థితి వుంది. ఏదేమైనా మొత్తం గ్రామీణ ప్రాంతం, పట్టణ ప్రాంతం అస్తవ్యస్తమైంది. సహాయక చర్యలు సకాలంలో చేపట్టకపోవడం, మన ప్రభుత్వ యంత్రాంగం దానికి తగిన విధంగా స్పందించలేదన్నదే మా అభిప్రాయం . కాబట్టి ఇప్ప టికైనా ప్రభుత్వం స్పందించి, రంగు మారిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే యఫ్‌సిఐ ద్వారా కొనుగోలు చేయాలి, ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. అలాగే నష్ట పోయిన వరికి ఇన్‌పుట్ సబ్సిడీ క్రింద ఎకరాకు రూ.10వేల చొప్పున ఇవ్వాలి. కౌలు రైతులకు ఆ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం . ఈ ప్రమాదం వల్ల చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కూడా మేము కోరుతున్నాం . రాబోయే కాలంలో వ్యవసాయం మీద నమ్మకం కలిగించే పద్ధతిలో వడ్డీ లేని రుణాలు, ఎరువులు మరియు విత్తనా లను రైతులకు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం . కూలిపోయిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించి పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టవలసిన అవసరం వుంది. ఈ సహాయక చర్యలు చేపట్టి మన రాష్ట్రంలోని ఈ తుఫాను బాధితులందరినీ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నేను సెలవు తీసు కుంటున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు (లోకల్ అథారిటీస్) ః అధ్యక్షా, ఈ నీలం తుఫాను వచ్చి ఈరోజుకి నెల మీద ఎనిమిది రోజులు అయింది. ఇది మన రాష్ట్రంలో చాలా తీవ్రమైన నష్టం కలిగించిందని మనందరికీ తెలుసు . ఈ తుఫాను వచ్చి నెల మీద ఎనిమిది రోజులైన తర్వాత, ఈ చర్చ జరుగుతున్న సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన నోట్‌ను పరిశీలిస్తే – ఇది ఎంత లోపభూయిష్టంగా వుందంటే అంత లోపభూయిష్టంగా వుంది. నిర్లక్ష్యం, అశ్రద్ధ .. ఎంతన్నా తక్కువే. అంటే ప్రభుత్వం రాజకీయ పర్యటనలు చేస్తోందే తప్ప ఈ తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి, వారికి అవసరమైన సహాయక చర్యలు ఏమిటో మీరిచ్చిన లెక్కలను చూస్తేనే మాకు అర్థమవుతోంది. ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారు లుండగా, 20 గ్రామాలకు ఒకరు చొప్పున ఎఇఓలు, క్షేత్ర స్థాయిలో సిబ్బంది తక్కువగా ఉండడం, జిల్లా స్థాయిలో డేటా నమోదు పనికి .....

శ్రీ యన్. రఘువీరారెడ్డిః నేను ఇంతకు ముందే సబ్మిట్ చేశాను, బహుశా మీరు విన్నట్లు లేదు. ఆ పేరాలు డెలిట్ చేసుకోండని చెప్పాను, అది ఆనాటికి relevant గానీ not today.

శ్రీ చేరుపల్లి సీతారాములుః ఇప్పుడు చెప్పారు సభకు వచ్చిన తర్వాత . అసలు రాయడానికి కూడా ప్రభుత్వం సిగ్గు పడాలి. మీరు సర్దుకోమన్నది ఒక భాగం, అసలు ఏముంది ఈ నోటులో అంటే – క్షేత్ర సిబ్బంది తక్కువగా ఉండడం, జిల్లా స్థాయిలో డేటా నమోదు పనికి, కంప్యూటరీకరణకు నిధులు తక్కువగా ఉన్న కారణంగా తూర్పు గోదావరి జిల్లాలో గణన ఆలస్యం అయింది అని చెప్పారు. నిధుల కొరత కారణంగా గణన ఆలస్యమైందని రాస్తే , ఇప్పటి సవరణకు నిన్న ఇచ్చిన దానికి తేడా ఏమిటి సార్? అసలు భయంకరమైన తుఫాను వస్తే నిధులు లేకపోవడమా గణన చేయడానికి? ఇది చాలా బాధాకరమైన విషయం . సవరణ చేసుకోవడం కాదు, అసలు రాసిన దానికి మీ సమాధానం ఏమిటి? ఈ ప్రాథమిక అంచనా విషయంలో మొదటి అంచనాకు తర్వాతి అంచనాకు 50శాతం తేడా వుంది. దీన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి గారు కేంద్ర ప్రభుత్వాన్ని రూ.1000కోట్లు ఇవ్వమని అడిగారు. ప్రాథమి అంచనా ప్రకారం 51,049.54 హెక్టార్లుంటే, పూర్తి ఎన్యూమరేషన్ తర్వాత 26,198.73 హెక్టార్లలో పంట నష్ట పోవడం జరిగిందని ఇచ్చారు. ఇక్కడ 50 శాతం తేడా వుంది. ముఖ్యమంత్రిగారు కేంద్రాన్ని అడిగింది రూ.1000కోట్లు . ఇప్పుడు అడగబోతున్నది రూ.3566కోట్లు . దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఏ లెక్క చూసినా ఆ పద్ధతి ప్రకారంగానే వుంది. 116 మండలాలు, 429 గ్రామాలలో ఇంకా గణన కొనసాగుతోందని, ఊహించడమవుతోందని అన్నారు. రెండు రోజుల కిందే కదా మాకు ఈ నోట్ ఇచ్చింది. ఇంత తేడానా? దీన్ని బట్టి నాకు అర్థమవుతున్నదేమంటే – ప్రభుత్వం చాలా బాధ్యతారాహిత్యంగా వున్నది . ఈ నీలం తుఫాను వచ్చినపుడు పెద్ద ఎత్తున అధికార యంత్రాంగాన్ని దించి సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నది మాకున్న అభిప్రాయం . మంత్రిగారేమో ఈ మధ్య కాలంలో నీళ్ల యాత్రలు మొదలుపెట్టారు. ఆయన ఆ యాత్ర మొదలు పెట్టడానికి మాకేమీ అభ్యంతరం లేదు. రైతులకు నీళ్లు ఇవ్వండి, ఇస్తే బాగుంటుందనే అంటున్నాం . ఇస్తే వద్దనడం లేదు, కావాలనే కోరుకుంటున్నాం కానీ నీలం తుఫాను విషయంలో నిర్లక్ష్యంగా వుండి ఈ విధంగా వ్యవహరిస్తే ప్రజలకు ఏమి లాభం జరుగుతుందన్నది మాకున్న అభిప్రాయం . కాబట్టి నీలం తుఫాను బాధితులకు సహకారం అందించడంలో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అనుకుంటున్నాం . లెక్కలు చాలా ఇచ్చారు, సర్దుకోమని చెబుతున్నారు కాబట్టి వాటి జోలికి పోవడం లేదు. ఏదేమైనా ప్రభుత్వానికి దూరదృష్టి వుండి వుంటే ఖచ్చితంగా ఇంత నష్టం జరిగి వుండేది కాదు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని వుంటే చాలా బాగుండేది. ఏదో ఆపద వచ్చినపుడు, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లుగా, అంతా అయిపోయిన తర్వాత హడావుడి చేస్తే ఏమి లాభం? ఈరోజుకీ మనకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాలేదు. ముఖ్యమంత్రి గారు వెయ్యి కోట్లు అడిగారు. ఇప్పుడు రూ. 3566కోట్లు అడగబోతున్నారు. తుఫాను వచ్చి ఈరోజుకి నెల మీద పది రోజులు అవుతోంది. మనకు ఎప్పుడు సహకారం అందాలి, మనం ఎప్పుడు ప్రజలకు సహాయం చేయాలి? ఇప్పుడే పెద్దలు దాడి వీరభద్రరావుగారు చెప్పారు, చాలా నామినల్ సహకారం వుంది. మాకు ఇచ్చిన నోటులో ఆ సహకార వివరాలు ఏమీ లేవు. వీరభద్రరావుగారు చెప్పినపుడు నేను అంకెలు నోట్ చేసుకున్నాను,చాలా నామినల్‌గా వుంది. నాకున్న

సమాచారం ప్రకారం చాలామందికి ఈరోజు వరకూ కనీసం బియ్యం కూడా ఇవ్వలేదు. కొంత మందికి ఇచ్చి కొంత మందిని వదిలేసిన సంఘటనలున్నాయి. కొంత మంది చేనేత కార్మికులు నా దృష్టికి తీసుకొచ్చారు. కొంత మందికి ఇచ్చి కొంత మందికి బియ్యం ఇవ్వకుండా వదలేశారు. వాళ్లందరికీ బియ్యం, షుగర్, కిరోసిన్ ఇవ్వవలసిన అవసరం వుంది, ప్రభుత్వపరంగా మినిమమ్ సపోర్ట్ చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. అది కూడా చేయనటువంటి పరిస్థితి వుంది. ఈ డ్రెయినేజీ సిస్టం సరిగా లేకపోవడం వల్ల చాలా భయంకరమైన పరిస్థితులు వస్తున్నాయి. ఈ చిన్న నీటి వనరులకు సంబంధించిన చెరువులు, కుంటల మరమ్మత్తులు సకాలంలో చేయకపోవడం వల్ల చిన్న చిన్న వర్షాలకే అవి కొట్టుకుపోతున్నాయి. మరి ఇంత పెద్ద వర్షాలు, తుఫానులు వచ్చిన తర్వాత అవెక్కడ వుంటాయి?

12.10pm

అనేక చెరువులు కుంటలు కొట్టుకుపోయే పరిస్థితి ఉన్నది. తక్షణం చెరువులు, కుంటలు మరమ్మత్తులు చేయాలి, అదే విధంగా డ్రైనేజి విధానాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. రైతాంగానికి వరి పైరు నిమిత్తం ఎకరానికి రూ.10,000లు చొప్పున అదే విధంగా ఇతర పంటలకు ఎకరానికి రూ.20,000లు చొప్పున ఇస్తే తప్ప ఈ నష్టం పూడదు. ముఖ్యంగా పత్తి, వరి పంటలు రంగు మారిపోయి ఎవరూ కొనలేని పరిస్థితి దాపురించింది. వరంగల్ జిల్లాలో పత్తి అసలు పనికి రాకుండా పోయింది. కొనే నాధుడు లేడు. అటువంటి విషయాలలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి కూడా కనబడడం లేదు. వాటిపై ప్రభుత్వం శ్రద్ధ చూపవలసిందిగా నేను తమ ద్వారా కోరుతున్నాను అధ్యక్షా. వరదలే కాకుండా నిరంతరం కరవును ఎదుర్కొంటున్న ప్రాంతాలలో ప్రభుత్వం తక్షణ చర్యలను తీసుకోవలసిన అవసరం ఉన్నది. గత సంవత్సరం కరవు జిల్లాలను ప్రకటించారు కానీ, కావలసిన నిధులు ఇవ్వలేదు. ఈ సంవత్సరం కూడా 290 కరవు మండలాలున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఆ కరవు మండలాలకు సరైన సహాయం అందించడం లేదు. అటు కరవు, ఇటు వరదల వల్ల రాష్ట్రంలో సుమారు అయిదు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. కాబట్టి, వరదలకు ఏ విధంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నారో, కరవు సహాయానికి కూడా ఆ విధమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నదంటే – 2009వ సంవత్సరంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు రూ.12,456కోట్ల ను మనం అడిగితే రూ.104 కోట్ల56లక్షలు ఇవ్వడం జరిగింది. 2010వ సంవత్సరంలో లైలా తుఫాను కారణంగా రూ.1603 కోట్ల నష్టానికి గాను రూ.74.78 కోట్లు ఇవ్వడం జరిగింది. 2010వసంవత్సరంలో జెల్ తుఫానుకు గాను రూ.672 కోట్ల నష్టానికి రూ.300కోట్లు ఇవ్వడం జరిగింది. అంటే మనం అడిగిన దానికి కేంద్రప్రభుత్వం ఇచ్చినదానికి నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. ముఖ్యమంత్రిగారు వెయ్యి కోట్లు అడిగారు ఇంతవరకూ ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. కేంద్రప్రభుత్వం నుండి రావలసిన నిధులను రాబట్టి రాష్ట్ర ప్రజలకు ఖర్చు పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కేంద్రప్రభుత్వం మీద

ఆధారపడడం తప్ప రాష్ట్రప్రభుత్వం ఇంతవరకూ ఖర్చుపెట్టింది చాలా నామినల్‌గా ఉన్నది. కాబట్టి, కేంద్రప్రభుత్వం మీద వత్తిడి తీసుకువచ్చి ఏదో ఒక విధంగా రాష్ట్రప్రజానీకాన్ని ఆదుకోవలసిన అవసరం ఉందని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలు అడిగాయి కానీ, ఇంతవరకూ ఎటువంటి ప్రకటనా రాలేదు. ప్రభుత్వం నుండి సరైన స్పందన లేక రాష్ట్ర ప్రజలు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. ఇప్పటికైనా తుఫాను వల్ల వచ్చిన నష్టాన్ని యుద్ధ ప్రాతిపదిక మీద అంచనా వేసి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని నేను కోరుతున్నాను. ఏ పంటకు ఎంత నష్టపరిహారం ఇవ్వాలి, ఏ మేరకు నష్టపరిహారం ఇస్తే రైతాంగానికి న్యాయం జరుగుతుందనే వివరాలు సభ్యులు శ్రీ దాడివీరభద్రరావు గారు తెలియచేశారు. నేను వారితో ఏకీభవిస్తున్నాను. కాబట్టి, ఈ విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని నష్టపరిహారాన్ని ఇచ్చే విధంగా చూడాలి. విపత్తు వచ్చాక నష్టపరిహారం గురించి ఆలోచించడం కంటే, ముందుగానే తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. తుఫాను హెచ్చరిక కేంద్రాలు, తగిన అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నది. ఇంతకుముందు దాడి వీరభద్రరావు గారు మాట్లాడినప్పుడు అమెరికా గురించి ప్రస్తావించారు. తరువాత సుధాకర రెడ్డి గారు అటువంటి అవసరం మాకు లేదని అన్నారు. అయితే, దాడి వీరభద్రరావు గారు అమెరికాలో ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకున్నదో చెప్పారు, మన ప్రభుత్వం కనీసం అందులో సగభాగమైనా తీసుకోవాలి కదా! విపత్తు వచ్చి నెల రోజులు దాటినా ఇంకా ఏ విధమైన చర్యలు తీసుకోకుండా ప్రజలను గాలికి వదిలేస్తే ప్రజలకు ఎవరు దిక్కు? ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదా? జరిగిన నష్టం ఎలాగో జరిగింది, కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (అసెంబ్లీ) ః అధ్యక్షా, నీలం తుఫానుపై మాట్లాడే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. 2010వ సంవత్సరం మే మరియు అక్టోబరు మాసాలలో జెల్, లైలా తుఫానుల వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులు, రైతాంగానికి కలిగిన నష్టం మన కళ్లముందు ఉండగానే ఇటీవల సంభవించిన నీలం తుఫాను రాష్ట్రంలోని రైతాంగానికి కళ్లల్లో కన్నీరు మిగిల్చిందని మనవి చేస్తున్నాను. కోస్తా ప్రాంతాలలో కనీసం రెండు సంవత్సరాలకు ఒక్కసారైనా తుఫాను, వరదలు, అధిక వర్షపాతం వల్లగానీ, బంగాళాఖాతంలో వచ్చే వాయుగుండాల వల్ల మరీ ముఖ్యంగా ఖరీఫ్ పంట చేతికి వచ్చే సమయంలో చేజారిపోయే సంఘటనలను అనేకం చూస్తున్నాము. నాకు ఊహ తెలిసినప్పటినుండి నేను చూస్తునే ఉన్నాను – కోస్తా ప్రాంతంలో మరీ ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే ఖరీఫ్ పంట ఖచ్చితంగా నీళ్లల్లో మునిగి పోయే పరిస్థితులలో రైతాంగం యొక్క బాధలు నాకు తెలుసు. 2010వ సంవత్సరం తరువాత ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగం ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను సింహావలోకనం చేసినట్లయితే నాడు జెల్,

లైలా తుఫానులు, నేడు నీలం తుఫాను మధ్యలో క్రాప్ హాలిడే వంటివి ఆ ప్రాంత రైతులను ఎంతగానో ఇబ్బంది పెట్టింది. వీటన్నింటికీ కారణం ఏమిటి? వీటికి నివారణ ఏమిటి? ఏ విధంగా చేస్తే బాధిత రైతాంగానికి ఊరట కలుగుతుందనే విషయాలపై ఈ రాష్ట్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేసిననాడే, భవిష్యత్తులో అయినా ఇటువంటి సమస్యలకు అడ్డుకట్ట వేయడానికి దోహదపడుతుందని ప్రగాఢంగా విశ్వసించే వ్యక్తిని నేను. రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి అనుకూలంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. వడ్డీ లేని రుణాలు, ఉచిత విద్యుత్తు, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడమనేది చూశాము. కానీ, తుఫాను తదితర విపత్తులు సంభవించిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజల ఆర్థికపరమైన ఇబ్బందులతో ఏ విధంగా కుంగిపోతారో ప్రత్యక్షంగా చూసినటువంటి వ్యక్తిని నేను. నీలం తుఫాను వల్ల సుమారు అయిదున్నర లక్షల హెక్టార్లలో వరి తదితర పంటను రైతులు నష్టపోయారు.

మ. 12.20

ముఖ్యంగా, నీలం తుఫాను సంభవించడం వల్ల సుమారుగా నాలుగున్నర లక్షల హెక్టార్లలో రైతులకు చేతికందిన వరిపంట చేజారిపోయింది. అహర్నిశలూ శ్రమిస్తూ, మద్ధతు ధర వచ్చినా రాకపోయినా, నారు నాటినప్పటి నుంచి పంట కోసేవరకూ కూడా కన్న బిడ్డలా సాకి ప్రతి దశలోనూ పంటను చూసి మురిసిపోయే రైతుకు నీలం తుఫాను వల్ల కన్నీరే మిగిలింది. ఇటువంటి పరిస్థితులలో ఎన్ని చర్యలను ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినప్పటికీ యింకా మరెన్నో జాగ్రత్తలను తీసుకోవలసిన ఆవశ్యకత ఉన్నదని నేను తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

నేను నివసిస్తున్న ప్రాంతం కోనసీమ. కోనసీమ అంటే "పచ్చని పైర్లతో, సెలయేళ్లతో, కాలువలతో, నదులతో అలరారే ప్రాంతమని, కోనసీమ ప్రాంతానికి ఏ విధమైన ఇబ్బంది లేదని" చాలామంది రాయలసీమ మరియు తెలంగాణ ప్రాంత వాసులు అనుకుంటూ ఉంటారు. అది నిజం కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే, నదీ పరీవాహక ప్రాంతానికి మరియు సముద్రతీరానికి సమీపంలో ఉన్నటువంటి ఈ ప్రాంతం, ముఖ్యంగా తుఫానుకు గురైనపుడు సముద్ర నీరు సమీప గ్రామాలలోకి చొచ్చుకుని రావడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తీరప్రాంతంలో ఉప్పునీరు ఎక్కువగా ఉంటుంది కాబట్టి వేసవికాలంలో త్రాగడానికి మంచినీరు కూడా దొరకని గ్రామాలు కూడా కోనసీమలో ఉన్నాయని చాలా మందికి తెలియకపోవచ్చు.

కోనసీమ ప్రాంతంలో కొబ్బరి పంటపై గతంలో కొంత ఆదాయం వచ్చి రైతులు కొంత ఊరట చెందే పరిస్థితి ఉండేది. ఈ మధ్య కాలంలో చూసినట్లయితే, కొబ్బరి పంటకు కూడా సరైన మద్ధతు ధర లేకపోవడం, ప్రతిసంవత్సరం తుఫానుల కారణంగా వరి పండించే రైతులు నష్టపోతూ, సరైన మద్ధతు ధర లేక దిక్కుతోచనటువంటి పరిస్థితులలో రైతాంగం యొక్క గోడు విని వారిని ఆదుకునే పరిస్థితి

ప్రభుత్వానికి ఒక ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇటువంటి పరిస్థితుల నుంచి బయటపడడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో కొన్ని సూచనలు కూడా చేయవలసిన ఆవశ్యకత ఉందని మనవి చేస్తున్నాను.

ఈ విధమైన తుఫానులు, అత్యధిక వర్షాలు, వరదలు వచ్చినపుడు అక్కడున్న డ్రయినేజి వ్యవస్థ అంతా పాడయిపోయిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. 1989 వ సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి డా. చెన్నారెడ్డిగారు సుమారు రూ. 900 కోట్లతో ఆ ప్రాంతంలో ఉన్న డ్రయినేజీలను మోడ్రనైజ్ చేయడం వల్ల కొంత ఊరట కలిగి, రైతాంగమంతా ఎకరానికి కనీసం నాలుగు బస్తాల వరిని ఎక్కువగా పండించే అవకాశం కలిగింది. కానీ, ఈ మధ్య కాలంలో ఈ డ్రయినేజీల మోడ్రనైజేషన్‌లో భాగంగా నిర్మాణాలు పూర్తిగా చేయలేకపోవడం వల్ల, అదుపు, అజమాయిషీ లేకపోవడం వల్ల, నీటిపారుదల శాఖకు చెందిన యంత్రాంగం సరిగా పనిచేయలేకపోవడం వల్ల ఈ నష్టం వాటిల్లుతుందని ఈ సందర్భంగా తమరి ద్వారా మనవి చేస్తున్నాను. డ్రయినేజి వ్యవస్థ సరిగా లేదని గౌరవ సభ్యులు చెప్పిన మాట వాస్తవం. దానిపై తగిన చర్యలు ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. లేనట్లయితే ఈ రాష్ట్రంలోని రైతాంగానికి రాబోయే రోజులలో కూడా ఇదే రకమైన దుస్థితి ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇది యావత్ రాష్ట్రంలోని రైతాంగం యొక్క ఆవేదన మరియు ఆక్రందన. ఆ వాణిని ఈ సభలో వినిపించడానికే నేను ఈ రోజు సమయాన్ని తీసుకున్నాను. ఇటువంటి పరిస్థితులలో ఇకనైనా అశ్రద్ధ చేయకుండా ఉండవలసిన ఆవశ్యకత ఉంది.

నీటమునిగిన పంటకు కూడా మద్ధతు ధర ఖచ్చితంగా యివ్వాలి. నీటి మునిగి, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఆ విధంగా చేసినట్లయితే, రైతులకు కూడా కొంత ఊరట కలుగుతుందనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి మనవి చేస్తున్నాను. రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో, ఇన్‌పుట్ సబ్సిడీ ఎంత చెల్లించాలనే విషయం గురించి గౌరవ ప్రతిపక్ష నాయకులు, యితర సభ్యులు వారి యొక్క ఆలోచనల గురించి చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హెక్టారుకు రూ. 1500 లు మాత్రమే యిచ్చినటువంటి పరిస్థితి మీకందరికీ తెలుసు. తదుపరి, కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 4,500 లు, నేడు రూ. 6,000 లు చెల్లించే పరిస్థితి ఉన్నప్పటికీ కూడా ఆ మొత్తం ఖచ్చితంగా సరిపోదనే విషయాన్ని తమరి ద్వారా తెలియజేస్తున్నాను. ఖచ్చితంగా ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి హెక్టారుకి రూ. 12,000 లు అయినా రైతుకు యిచ్చినట్లయితేనే కాస్త ఊరట కలుగుతుంది. It is a sigh of relief to the farmer.

మా ప్రాంతంలో అంతర్వేది అనే ఒక పుణ్యక్షేత్రం ఉంది. ఆ పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి ఆ స్వామిని దర్శించుకుంటారు.

అక్కడ సముద్రం సుమారుగా ఒక కిలోమీటరు ముందుకు వచ్చి అక్కడ ఉన్న లైట్ హౌస్ కూడా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ ఉన్న సరిహద్దు గోడ వరకూ కూడా సముద్రనీరు చొచ్చుకొని వచ్చింది. ఆ పుణ్యక్షేత్రం సమీపంలో "అన్నా చెల్లెలు గట్టు" అని పిలవబడే ప్రాంతం ఉన్నది. సముద్రం ముందుకు చొచ్చుకుని రావడం వల్ల ఇటు గోదావరి నది, అటు సముద్రం కలిసే ఆ ప్రాంతానికి కూడా వెళ్లే పరిస్థితి లేదు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖకు సంబంధించినటువంటి ఈ సమస్యను పరిష్కరించడానికి ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద అడ్డుకట్టలు వేయకపోతే, పుణ్యక్షేత్రమైన అంతర్వేదికి కూడా ముప్పు వాటిల్లే పరిస్థితి ఉంటుంది.

రైతాంగం నష్టపోయినందుకుగాను ఖచ్చితంగా ఇన్‌పుట్ సబ్సిడీని రెట్టింపు చేయాలి. నీటిలో తడిసి పాడైపోయిన ధాన్యాన్ని రాష్ట్రప్రభుత్వం స్వయం సహాయక బృందాల ద్వారా ఖచ్చితంగా కొనుగోలు చేయడం ద్వారా రైతాంగానికి కొంత ఊరట కలిగించాలి. డ్రయినేజిలను మోడరనైజేషన్ చేయకపోతే చాలా ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని మరొకసారి గుర్తుచేస్తున్నాను. ఇటువంటి సమస్యలన్నింటినీ కూడా దృష్టిలో పెట్టుకుని రైతాంగానికి మనం చేస్తోన్నటువంటి సేవ మరింతగా చేయాలనుకున్నప్పుడు, రైతులు ఎల్లప్పుడూ కూడా సంతోషంగా ఉండాలంటే ఈ చర్యలన్నీ తప్పకుండా చేపట్టాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మరీ ముఖ్యంగా, ఉద్యానవన శాఖ, పశు సంవర్థక శాఖకు చెందిన లబ్దిదారులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు కూడా అనేక రకాల యిబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. సముద్ర తీరంలో నివసించే మత్స్యకారులందరికీ వారు కోల్పోయిన బోట్లు, వలలకోసం చాలినంత నష్టపరిహారాన్ని యివ్వవలసిన ఆవశ్యకత ఉంది. పూర్తిగా సముద్రం మీద ఆధారపడి జీవించే బడుగు జీవులందరికీ కూడా రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం చేపడుతోన్న ఉచిత విద్యుత్ పథకం మరియు ఇతర పథకాలన్నీ రైతులందరికీ అందిస్తూ, రైతులకు మద్దతు ధరను కూడా యింతకుముందెన్నడూ లేని విధంగా పెంచాలి. పొలాన్ని లీజుకు తీసుకున్న రైతులకు కూడా ఈ ప్రయోజనాలు చేరే విధంగా పనిచేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా మనవిచేస్తూ, నాకీ అవకాశం యిచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం): అధ్యక్షా, తుఫాను సంభవించి దాదాపు 40 రోజులు గడిచాయి. ప్రస్తుతం అమలు చేస్తున్న సహాయక చర్యలు వాటి తీరుతెన్నులను పరిశీలించడానికి 40 రోజుల అనుభవం సరిపోతుందని నేను భావిస్తున్నాను. ఈ నలభై రోజుల తరువాత కూడా మరణించిన వారి కుటుంబసభ్యులకు నష్టపరిహారాన్ని అందించలేని పరిస్థితి ఉంది. యింతవరకూ

తుఫాను బాధితుల సహాయార్థం ఎన్ని నిధులను ప్రభుత్వం ఖర్చు చేసిందో వారు సమర్పించిన నివేదికలో పేర్కొనలేదు. ఎన్ని నిధులను అడుగుతున్నాము, ఎంత మేరకు నష్టం వాటిల్లిందనే విషయాలపై అంచనాలు ఉన్నాయి. కానీ, తుఫాను బాధితుల సహాయార్థం యిన్ని నిధులను ఖర్చు చేశామనే విషయం గురించి ప్రభుత్వం సభకు సమర్పించిన నివేదికలో ప్రస్తావించలేదు, నేడు గౌరవ మంత్రిగారు సభలో మాట్లాడిన సందర్భంలో కూడా ఆ వివరాల గురించి ఆయన చెప్పలేదు. వారి పర్‌ఫార్మన్స్ గురించి పూర్తిగా చెబితే పని జరుగుతోందా, లేదా అనేది అర్థం అవుతుంది. ఈ తుఫాను సంభవించి 40 రోజులు గడిచినా, ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో కూడా, యిటువంటి ముఖ్యమైన సందర్భంలో, జిల్లా స్థాయిలో ఎటువంటి సమీక్షా సమావేశం జరగనేలేదు. ఏవిధంగా ఈ తుఫాను బాధితులను ఆదుకోవాలనే విషయంలో, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రయత్నం కూడా చేయలేదనేది తేటతెల్లమవుతుంది. సీరియస్‌నెస్ లేదనే దానికి ఇది ఒక సంకేతమని నా అభిప్రాయం. The Government lacks seriousness in tackling the issue.

మనకు విద్యాహక్కు చట్టం అనేది వచ్చింది. ఎన్ని పాఠశాలలు తుఫాను కారణంగా మునిగిపోయాయి? ఎంతమంది విద్యార్థులు యొక్క విద్యాహక్కు తాత్కాలికంగా దెబ్బతిన్నదనే విషయం గురించి ఈ నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదు. మా జిల్లాలోనే సుమారుగా 20 పాఠశాలలు నీటిలో మునిగిపోయి విద్యార్థులు ఆ పాఠశాలలకు వెళ్లడానికి కూడా అవకాశంలేని పరిస్థితి నెలకొని ఉంది. అంతేగాక, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి కూడా నీటిలో మునిగిపోవడం జరిగింది. శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి మాత్రమేగాక అక్కడకు వెళ్లడానికి రోగులకు అవసరమైన శ్రీకాకుళం బస్టాండ్ కూడా నీటితో మునిగిపోయింది.

మ.12.30

పట్టణ సంస్కరణల్ని బాగా అమలు జరిపినందుకు కేంద్ర ప్రభుత్వం నుండి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ వరుసగా మూడు సంవత్సరాలు అవార్డు పొందింది. బాగా అమలుజరిపిన తరువాత విశాఖపట్నం ప్రాంతం 30 శాతం పైగా మునిగిపోయింది. గంగవరం పోర్టు కట్టారు. గంగవరం పోర్టు వారు ఒక గోడ అడ్డంగా నిర్మించుకొన్నారు. వారికి ఆ హక్కు ఎవరిచ్చారో మాకు తెలియదు కాని గోడ అడ్డంగా నిర్మించడం వల్ల గాజువాక ప్రాంతం నుంచి వచ్చే నీరు సముద్రంలో కలిసేందుకు ఆ గోడ అడ్డుకోవడం వల్ల పెదగచెంపాడ, గంగవరం ప్రాంతమే కాకుండా షీలా నగర్ వరకు ఉన్నటువంటి ప్రాంతాలన్ని మునిగిపోయాయి. పట్టణ సంస్కరణలు బాగా అమలు జరిగితే అది ఎక్కువగా మునిగిపోయిందనేది కనబడుతోంది. సంస్కరణలైనా మానేయండి. లేదా ముంపు నుంచైనా మమ్మల్ని కాపాడండి. మున్సిపాలిటీ వారు ఇచ్చినటువంటి రిపోర్టులో రహదారులు కొట్టుకుపోయాయి, వీధి దీపాలు పోయినాయని చెప్పారు తప్ప, ఇటువంటి అంశం, అలాగే పాఠశాలల గురించి కూడా ఎక్కడా కవర్

కాలేదు. అసలు ముంపుకు ఎందుకు గురైందనేటువంటిది చెప్పలేదు. ఎందుకంటే అక్కడ ఉన్నటువంటి గడ్డలన్నీ ఆక్రమించుకోబడ్డాయి. వాటన్నింటిని తొలగించడానికి దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోలేదు. ఎక్కువ గడ్డలు ఆక్రమించిన వారిలో చాలా మంది రాజకీయ నాయకులు ఉన్నారు. బహుశా, అందుకనే ఒక విచిత్రమైన ఐక్యతతోనే ఈ విషయం ప్రస్తావించడం లేదేమో, కాని గడ్డల్ని తొలగించాల్సిన అవసరం ఉంది. నిర్దాక్షిణ్యంగా ఆ పని చేయకపోతే భవిష్యత్తులో ఇంకా చాలా మునిగిపోయే పరిస్థితి ఉంది. మంచినీటి సమస్యకి చాలా సీరియస్ చాలెంజ్ ఉంది. తాండవ, రైవాడ అదేవిధంగా ఏలేరు మూడు కాలువలకి బ్రీచెస్ వచ్చాయి. ఏకంగా ఏలేరు రిజర్వాయర్‌కి 25 మీటర్ల బ్రీచ్ వచ్చింది. వాటి నుండి పరిశ్రమలకి, విశాఖనగరానికి మంచినీరు వస్తుంది. ఇప్పుడు విశాఖ పట్నం మంచినీటి సమస్యను ఎదుర్కోవలసి వస్తున్నది. కాబట్టి ఇటువంటి సీరియస్ సమస్యల్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. 50 శాతం పంట నష్టం ఉంటేనే అమలు చేయాలనేటువంటి ఆ క్లాజును అధికారులు ఎంత బాగా అమలు జరుపుతున్నారో నాకు శెట్టి నాయుడు గారని మునగపాక మండలంలోని వాడ్రాపల్లి గ్రామ రైతు చెప్పారు. అదేమంటే అతను 1.4 ఎకరాలు కౌలు రైతు. 1.4 ఎకరాలు మునిగిపోయింది. 50 శాతం లెక్క సెట్ చేయడం కోసం ఆయనకు 20 సెంట్ల పంట మాత్రమే మునిగిపోయిందని చెప్పారు. ఆ 20 సెంట్లకి ఎక్కడ గీత గీశారో అర్థం కాలేదు. 1.4 ఎకరాలు మొత్తం మునిగిపోయింది. మునిగిపోతే 1.4 ఎకరాలు మునిగి ఉండాలి. దాని మొత్తానికి ఇవ్వాలి. లేదు దానిలో కొంతే మునిగింది అంటే, అది ఇయర్ మార్క్ చేయాలి. మొత్తం మునిగిపోయినా కూడా 20 సెంట్లే వ్రాశామన్నారు. ఎందుకంటే అందరికి కోత పెడుతున్నాం కాబట్టి నీకు కూడా కోత పెడుతున్నామని. అది కూడా 50 శాతం వ్రాయాలి కాబట్టి వ్రాస్తున్నామని తెలిపారు. అది కూడా 50 శాతానికి 70 సెంట్లు ఉండాలి కాని 20 సెంట్లే వ్రాశారని తెలిపారు. అధికారుల insensitivity ఎంత ఉందనేది ఇక్కడ అర్థం చేసుకోవచ్చు.

శ్రీ కె. జానా రెడ్డి (నాగార్జునసాగర్) ః అధ్యక్షా, గౌరవ సభ్యునికి సహాయపడడానికి మాట్లాడుతున్నాను. ఉన్న పొలంలో 50 శాతం వ్రాయమని కాదు. పంట నష్టం 50 శాతం జరిగితే, దానిని ఎన్ని ఎకరాలు ఉన్నదో వ్రాయమని. పొలంలో 50 శాతం కాదు. పంటలో 50 శాతం.

శ్రీ ఎమ్.వి.ఎస్. శర్మ ః గౌరవ మంత్రి గారికి ధన్యవాదాలు, నా వాదనలో కొంత అదనంగా తోడ్పాటును ఇచ్చారు. మొత్తం 100 శాతం నష్టం జరిగింది. 1.4 ఎకరాలకి గాను, 20 సెంట్లే వ్రాశారు. అలాగే పంట నష్టం 50 శాతం కంటే ఎక్కువ అనే దానికి ఉన్నటువంటి గైడ్‌లైన్స్ ఏమిటనేది మాకు తెలియవు, ఆ గైడ్‌లైన్స్ ఏమైనా ఇస్తే, అధికారులు దానిని సక్రమంగా పాటిస్తున్నారో, లేదో మేము కూడా కనుక్కోవడానికి వీలవుతుంది. ముందు నుండి పర్యావరణ శాఖ తుఫాను హెచ్చరికలు ఏమి ఉన్నాయనేది కనుక్కోవలసిన అవసరం ఉంది. ఎప్పుడో ఒకప్పుడు తుఫాను వచ్చేటువంటి ప్రాంతమే మన రాష్ట్రం.

1995 నుంచి డ్రైన్లు మరమ్మత్తులు చేయనందువల్ల కలిగినటువంటి man made loss ఎక్కువ. ఒకవేళ ఆ డ్రైన్లు కాల పరిమితిలో మరమ్మత్తులు చేసినట్లైయితే, కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతం గాని, విశాఖపట్నం లాంటి ప్రాంతాలు గాని, ఇవన్నీ ముంపుకు గురై ఉండేవి కావు. కాబట్టి తుఫాను వల్ల వచ్చిన నష్టం కాదది. తుఫానులు వస్తాయనేది కూడా లెక్క చేయకుండా సాధారణంగా మెయింటెన్ చేయాల్సిన డ్రైన్ మెయింటెన్ చేయకపోవడం, కాలువలు మెయింటెన్ చేయకపోవడం వల్ల కలిగిన నష్టం ఎక్కువ. కాబట్టి ఈ నష్టంలో 20 శాతం, 50 శాతమని కాకుండా ఈ నష్టం మొత్తానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. దానికి తగినటువంటి పరిహారం ప్రభుత్వం చెల్లించాలి. ఇన్‌పుట్ సబ్సిడీల వంటి వాటికి కాకుండా, జరిగిన పంట మొత్తం నష్టానికి కాంపెన్‌సేట్ చేయాలి. ఆ పంట ఆయన చేతికి రాకుండా పోయింది. దానికి ఆయన లోపం కాదు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రధానమైన కారణం. కాబట్టి నష్టపరిహారం మీద మనకున్న సాంప్రదాయ పద్ధతుల్ని రీ విజిట్ చేసైనా సరే రైతుకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలని కోరుతున్నాను. పంచాయతీ రాజ్ శాఖ వారు కూడా ఇక్కడే ఉన్నారు కాబట్టి పాఠశాలల అన్నింటికి ఉపాధి హామీ పథకం క్రింద మట్టి తరలించి వాటిని ఎత్తు చేయించే ప్రత్యేకమైన ఉత్తర్వులు ఇస్తే, వారికి పని దొరుకుతుంది. పాఠశాలలు మునిగిపోకుండా ఉంటాయి.

శ్రీకాకుళం పట్టణం ఒక డొప్పలాగా ఉంటుంది. ప్రక్కన నాగావళి నది ఉంటుంది. కాబట్టి పట్టణంలోని నీరు నదిలోనికి వెళ్లవు, నదిలోని నీరు పట్టణంలోకి వస్తుంది. దానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజి పెట్టడానికి కుదరదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పెడితే, నదిలోని నీరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి వస్తాయి. కాబట్టి దానికి ప్రత్యేకమైనటువంటి పథకాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. శ్రీకాకుళం జనరల్ ఆసుపత్రి ఏమాత్రం వర్షం వచ్చినా మునిగిపోయే పరిస్థితి ఉంది. దాని మరమ్మత్తులకి నిధులు విడుదల చేశామంటున్నారు కాని పనులేమి జరగడం లేదు. వర్షం వచ్చినప్పుడు I.V. fluid ను staff nurse ఎక్కిస్తే ఎంత భయంకరమైన infection వచ్చే ప్రమాదముంటుందో ఆలోచించండి. ఇటువంటి పరిస్థితుల మీద ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని కోరుతున్నాను. 225 సబ్‌స్టేషన్లు ముంపుకు గురైనవంటి చాలా ప్రమాదకరమైన పరిస్థితులున్నాయి. రిపోర్టులో పాఠశాలలు, ఆసుపత్రులు మరియు సబ్‌స్టేషన్లకు సంబంధించిన అంశాలు ఏమి లేవు కాబట్టి ఇటువంటి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. బహుశా మనము అడిగే నష్టపరిహారాలన్నింటిలో ఈ అంశాలన్ని ఉన్నాయో, లేవో నాకు తెలియదు. కాబట్టి దయచేసి జిల్లా రెవ్యూ కమిటీలని ఏర్పాటు చేయాలని ఒక ఆదేశం జిల్లా కలెక్టర్లకి, ప్రత్యేకమైన ఏజెండాగా నీలం తుఫాను మీద రెక్టిఫికేషన్ చర్యలు ఎమి తీసుకుంటున్నారనేది రెవ్యూ చేయడానికి జిల్లా రెవ్యూ కమిటీలను వేయాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఇక్కడ ఓవర్ వ్యూ ఉంది మొత్తం నష్టం ఉంది, జిల్లా వారీగా ఉంటే, అందులో ఏ మండలంలో ఎంత జరిగింది, ఎంత జరుగలేదు. ఏ అధికారులు కదిలారు, ఏ అధికారులు కదలలేదు. ఎక్కడ విషయం ఫోకస్‌లోకి రావలసింది, రాకుండా పోయింది. ఇవన్నీ కూడా కవర్ అవుతాయి కాబట్టి

ఇప్పటికైనా అర్జెంటుగా ఆ పని చేయాలని కోరుతున్నాను. ప్రభుత్వం సీరియస్‌గా మాటల్లో కాకుండా చేతల్లో ఉండాలని కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి : అధ్యక్షా, నీలం తుఫాను అనేటువంటిది రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. వాస్తవంగా వాతావరణ శాఖ చాలా ఇంప్రూవ్ అయినటువంటి సమయంలో మనము సకాలంలో సహాయక చర్యలు తీసుకోకపోవడమనేది విచారకరమైన విషయం. చాలా మంది రైతులు నష్టపోయారు, కొంతమంది రైతులు చనిపోయారు, పశువులు చనిపోయాయి. ఒకటి, రెండు కాకుండా 19 జిల్లాలో నీలం తుఫాను యొక్క ప్రభావం ఏర్పడింది. ఈ ఒక్క సంవత్సరమే కాకుండా ప్రతి సంవత్సరం ఆక్టోబర్, నవంబర్ మాసంలో తుఫాను ప్రభావం మనం చూస్తూనే ఉన్నాం. ఎప్పుడో ఒక సంవత్సరం తప్ప, ప్రతి సంవత్సరం ఆక్టోబర్, నవంబరులో పంటలు కోసే సమయంలో నాశనం చేయడమనేది చూస్తున్నాం. వాతావరణ శాఖ సూచనల మేరకు సహాయక చర్యలు తీసుకుంటే ఇంత నష్టం జరిగేది కాదేమో అని భావిస్తున్నాను. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.1000.00 కోట్లు గాని, 1500.00 కోట్లు గాని రూ.2,000.00 కోట్లు గాని ముందు కేటాయించి ఉంచితే బాగుంటుంది. గౌరవ మంత్రి గారు ఎన్ని వేల కోట్లు తుఫాను కొరకు బడ్జెట్‌లో రిజర్వ్ చేశారనేటువంటిది కూడా ఇందులో లేదు.

మ.12.40

ఉపాధ్యాయులు డిక్టేషన్ ఇచ్చినట్లు మంత్రిగారు స్పీడుగా చెప్పారు. దీనిలో వివరాలు కూడా సరిగా దిద్దుకోలేకపోయాము. ఏది ఏమైనా రైతులకు చాలా నష్టం జరుగుతోంది. వాళ్ళని ఆదుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వం పైన ఉన్నది. వాళ్ళు కష్టపడి ఎరువులు కొని, కూలీలను పెట్టి, బ్యాంకులలో లోను తీసుకువచ్చి పెట్టుబడి పెట్టి పంటలు పండించితే, కోత సమయానికి తుఫాను వచ్చి అంతా సర్వనాశనం చేసిన విషయం మీకు తెలియంది కాదు. కనుక రంగుపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. ఇంత నష్టం జరిగిన తరువాత కూడా కేంద్ర ప్రభుత్వం నుండి సహాయం రావాలి అప్పుడు ఇవ్వాల్సి ఉంటుందని అంటే రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. కాబట్టి మొట్టమొదట మనం డబ్బు ఇచ్చి, కేంద్ర ప్రభుత్వం నుండి డబ్బు వచ్చిన తరువాత దానిని రీయంబర్స్‌మెంట్ చేస్తే బాగుంటుంది. ఆ పద్ధతిలో మంత్రిగారు ఆలోచన చేయాలని, తద్వారా రైతులకు ఊరట కలుగుతుందనే విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృ తజ్ఞతలు తెలియజేస్తున్నాను.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ (Local Authorities) : అధ్యక్షా, నీలం తుఫాను మీద అవకాశం ఇచ్చినందుకు మొట్టమొదట మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రాష్ట్రంలో రెండు దఫాలుగా వచ్చిన నీలం తుఫానువల్ల సుమారు పదిహేను నుంచి పదహారు జిల్లాలు అతలాకుతలం అయిపోయాయి.

మొత్తం మూలకమైన వనరులన్నీ కూడా దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోవడంతోబాటుగా రహదారులు, డ్రైనేజి వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నాయి. దానిపైన మాట్లాడుతూ ఇందాక చాలామంది సభ్యులు వివరంగా చెప్పారు. అసలు పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామాలలో ఉన్నటువంటి అంతర్గత రహదారులు కానీ, లింకేజీ రహదారులు కానీ ముఖ్యంగా మట్టిరోడ్లు, కంకర, తారు రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరించడానికి, బాగుచేయడానికి కనీసం శ్రద్ధ కూడా ప్రభుత్వం చేపట్టలేదు. ఏమాత్రం నిధుల్ని కేటాయించలేదు. ముఖ్యంగా ఈ విపత్తుల గురించి కేంద్రప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి గ్రామాలలోని రహదారులను బాగు చేసి లింక్ రోడ్లను వేసే దిశగా ప్రభుత్వం ఆలోచించకపోవడం చాలా విచారకరం. ప్రజలు చాలా తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రిగారు కానీ, రెవెన్యూ మంత్రిగారు కానీ ఒకసారి వచ్చి ఆ రహదారులపై తిరిగితే ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో తెలుస్తుంది. అలాగే నీలం తుఫాను వచ్చి నెల రోజులు గడిచినా రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తారు? ఏమి ఇస్తారనేది ఇప్పటివరకూ నిర్ణయించకపోవడం విచారకరం. ఆ మధ్య రఘువీరారెడ్డిగారు పాదయాత్రలో ఉండగా అక్కడ మంత్రుల సబ్ కమిటీ సమావేశమైందని, ఏదో ప్రకటిస్తారని అన్నారు తప్పితే అది జరిగి కూడా పది, పదిహేను రోజులైంది ఇప్పటివరకు దానిపైన నిర్ణయం ప్రకటించలేదు. అలాగే ఎకరాకు ఇంత ఇస్తామని ప్రకటించలేదు. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం గతంలో కంటే విపరీతంగా పెరిగింది. 2004 సంవత్సరంలో రు.26000 కోట్ల బడ్జెట్ ఉంటే ఈరోజున రు.1,46,000 కోట్ల బడ్జెట్ ఉంది. రేపో మాపో రు.1,66,000 కోట్ల వరకు ఆర్థిక శాఖామంత్రిగారు బడ్జెట్ పెడతారని వార్తలలో చూశాము. ఆ దామాషాలో బడ్జెట్ ఆరు రెట్లు పెరిగింది కాబట్టి రైతులకు సహాయాన్ని కూడా ఆరు రెట్లు పెంచి ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్తున్నాము. మా తెలుగుదేశం పార్టీ, మా నాయకుడు చంద్రబాబునాయుడుగారు ఎకరాకు వరికి రు.10000 వరకు, వాణిజ్య పంటలకు రు.15000 వరకు ఇమ్మని అడగడం జరిగింది. అందులో న్యాయం ఉంది. ధర్మం ఉంది. రైతులకు ఖర్చులు పెరిగాయి. కూలీల రేట్లు, ఎరువుల రేట్లు, క్రిమిసంహారక మందులు, విత్తనాల ధరలు పెరిగాయి. ఇన్ని ఇబ్బందులు పడుతుంటే దానిపైన ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడమే గాక, ఇందాక అధికారపార్టీ సభ్యులు మాట్లాడుతూ చెప్పా పెట్టకుండా తుఫాను వచ్చిందన్నారు. తుఫాను ఎప్పుడైనా చెప్పి వస్తుందా అధ్యక్షా? దానికి ప్రభుత్వ యంత్రాంగం, వాతావరణ శాఖ ఉన్నాయి. అదేమంటే రెవెన్యూ మంత్రిగారు సమర్థవంతమైన యంత్రాంగం, వాతావరణ శాఖ లేదు. ఇంకా రెండేళ్ళ తరువాత రు.400 కోట్ల పెట్టుబడి పెడతాం, రెండేళ్ళ తరువాత తుఫాను ఎప్పుడు వస్తుంది? ఎంత సేపు ఉంటుంది? ఎంత వేగంతో వస్తుంది? అప్పుడు మేము కనుక్కుంటాం, అప్పటివరకు మేము ఏమీ చేయలేమని అంటున్నారు. అంటే ఈ రెండు సంవత్సరాలు మా రైతులు, మా గ్రామీణ ప్రజలు ఏమి చేయాలి? అసలు వాతావరణ శాఖ వైఫల్యం పక్కన పెడదాం. మేము అడిగేది ప్రభుత్వ వైఫల్యం. చాలా స్పష్టంగా ఈ ప్రజలకు జవాబుదారీగా ఈ ప్రజలు కష్టాలు నష్టాలలో ఉంటే వాళ్ళని ఆదుకుని, బాధ్యతాయుతంగా ప్రభుత్వం ఉండాలి. ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితి పక్కన పెడితే

బాధ్యతాయుతమైన మంత్రులు ఏమి చేశారు? తుఫానులు వచ్చి రాష్ట్రం మొత్తం అతలాకుతలం అయిపోయి, కోస్తా జిల్లాలలో రహదార్లు తెగిపోయి, ఇళ్ళు మునిగిపోయి, తినడానికి తిండి లేక మమ్మల్ని ఎవరు ఆదుకుంటారని ప్రజలు మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. మరి మంత్రులందరూ విజయనగరం జిల్లాలో పెళ్ళి కోసం, విందు భోజనాల కోసం వెళ్ళిపోవడం ఎంత అన్యాయం? పెళ్ళి అనేది శుభకార్యం. ముఖ్య నాయకుల ఇంట్లో శుభకార్యానికి వెళ్ళడం విషయంలో మేము కాదనడంలేదు. ఆ తరువాత అయినా ప్రజలను ఆదుకోవాలి కదా. అది వదిలేసి అటునుంచి అటే విజయనగరం నుంచి ఢిల్లీకి వెళ్ళిపోయారు. ఇది ఏమిటని అడిగితే, సమావేశాలు ఉన్నాయి, మా రాహూల్‌గాంధీగారిని ప్రధానమంత్రిని చేయాలి అంటారు. వీళ్ళకి పెళ్ళి, ఢిల్లీ, విందు, వినోదాలు తప్పితే ఈ రాష్ట్ర ప్రజల గురించి గానీ, వాళ్ళ కష్ట, నష్టాల గురించి కానీ, వాళ్ళు వానల్లో, వరదల్లో, తుఫానుల్లో కొట్టుకుపోయినా, వాళ్ళకి తినడానికి తిండి లేకపోయినా, ఈ ప్రభుత్వం అసలు పట్టించుకోదా? ఈ ప్రభుత్వం వాళ్ళగురించి అసలు ఆలోచించదా?

శ్రీ సి.రామచంద్రయ్య ః అధ్యక్షా, రాజేంద్రప్రసాద్‌గారికి ఈ నీలం తుఫాను మీద గణాంకాలు సమస్యలు లేనట్లున్నాయి. రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఒక మంత్రిగారి ఇంట్లో శుభాకార్యం జరిగితే అక్షింతలు వేయడానికి వెళ్ళాము. అనుకోని రీతిలో తుఫానులు, వరదలు, ఉప్పెనలు వచ్చినపుడు ఆ సమయానికి అక్కడ ఉండి సమస్యలను పరిష్కరించామా లేదా? ప్రభుత్వం బాధ్యత తీసుకున్నదీ, లేనిదీ చూడాలి తప్ప వ్యక్తిగతంగా మాట్లాడకూడదు. మా పార్టీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. జిల్లా మంత్రిగా నేను కూడా బాధ్యతలు తీసుకుని వ్యవహారం చక్కదిద్దామా లేదా? అనేది చూడాలి తప్పితే వ్యక్తిగతంగా దూషించే పద్ధతి మానుకోవాలని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ ః నేను గౌరవనీయమంత్రిగారిని ఎక్కడా దూషించలేదు. పెళ్ళికెళ్ళారు. విందు భోజనాలు చేశారన్నాము. అది దూషణ అవుతుందా? రాష్ట్రంలోని ప్రజలు తినడానికి తిండిలేక నీళ్ళలో మునిగిపోయి అలో లక్ష్మణా అని ఏడుస్తున్నారని, వాళ్ళ విషయం తెలియజేశామంతే.

మ.12.50

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ ః త్వరగా మాట్లాడండి. ఇంకా మాట్లాడవలసిన వారు చాలా మంది ఉన్నారు.

శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ ః అధ్యక్షా, ప్రజలకు రక్షణగా ఉండవలసిన ప్రభుత్వం, మంత్రులు ఇక్కడ లేకుండా పోతే, ఇంక ప్రజలకు దిక్కు ఎవరు? ఇక మంత్రుల బాధ్యత ఏమిటి? మంత్రిగారు లేచి

ఘనంగా, సగర్వంగా పెళ్ళికి వెడతాము, ఢిల్లీకి వెడతామని, అమెరికా వెడతామని అన్నారు. వెళ్ళండి. ప్రజలు అటునుండి అటే వారిని వెనక్కి కూడా పంపించేస్తారు. ప్రజలను పట్టించుకోకపోతే జరిగేది అదే. దీనిపైన సీరియస్‌గా ఆలోచించాలి.

(ఈ నేపథ్యంలో శ్రీ రుద్రరాజు పద్మరాజు 'పక్కదారి పట్టించే మాటలు మాట్లాడుతున్నారని' సభకు అంతరాయం కలిగించసాగారు.)

అధ్యక్షా, ప్రజలు చాలా ఇబ్బందులకు లోనవుతున్నారు. అంతేగాకుండా, నేను చాలా స్పష్టంగా అడిగేది ఏమిటంటే ఈకాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు తొమ్మిది సంవత్సరాల కాలంలో వివిధ తుఫానులు, అకాల వర్షాలు, వరదలు వచ్చాయి. ఆయా సందర్భాలలో సుమారు రూ.56,000 కోట్ల మేర ఈ రాష్ట్ర ప్రజలకు నష్టం వాటిల్లినదని చెప్పి, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించింది. ఈ రకంగా నివేదికలు పంపిస్తే, కేంద్రంలో ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం మన రాష్ట్రానికి కేవలం రూ.2,200కోట్లు ఇచ్చింది. అంటే, కేవలం ఆరు శాతం మాత్రమే ఇవ్వడం జరిగింది. ఎంత అన్యాయం, ఎంత దారుణం. ఈ అంశాలపై రెవెన్యూ మంత్రిగారు దృష్టిపెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనకు సుమారు రూ.56,000 కోట్లు నష్టం వచ్చింది అంటే, కేంద్ర ప్రభుత్వం కేవలం 9 సంవత్సరాలలో రూ.2,000 కోట్ల చిల్లర మాత్రమే ఇవ్వడం జరిగింది. ఇంత నష్టం మన రాష్ట్రానికి జరిగితే, మన రాష్ట్రం నుండి 33 మంది ఎం.పి.లను పంపించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీకి బాధ్యతలు అప్పగించడానికి మూలకారణమైన ఈ రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఏం మేలు చేస్తోంది? దీనిపైన కేంద్రప్రభుత్వంపై ఎందుకు గట్టిగా గళం విప్పి మాట్లాడలేకపోతున్నారు. మన కంటే, యు.పి.ఎ. ప్రభుత్వంలో ఉన్న మిత్రపక్షాల ప్రభుత్వాలు, తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక మొదలైన ప్రాంతాలలోని ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి నిధులు తెచ్చుకుని తద్వారా ఆ రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. మేము జాతీయ రహదారులు, ఓడ రేవుల అభివృద్ధి గురించి అడగడం లేదు. కనీసం, మీకు మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు, వాటి గురించి కూడా ఏమీ మాట్లాడడం లేదు. నిన్న గాక మొన్న కేవలం 5 మంత్రి పదవులు ఇచ్చారు. అవి కూడా తోక మంత్రి పదవులు. కాబినెట్ మినిస్ట్రీలో ఇవ్వనటువంటి దారుణమైనటువంటి పరిస్థితి ఉంది. మీరు కనీసం మంత్రిపదవులు తెచ్చుకోకపోయినా, మరి ఇంకా ఏదైనా కానీ, ఈ రాష్ట్ర ప్రజలు మీకు ఓటు వేసినందుకు అయినా, తెలుగు ప్రజలకు కృతజ్ఞతాపూర్వకంగా కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్ర ప్రభుత్వం అడిగిన మొత్తంలో కనీసం 50 శాతం అయినా నష్టపరిహారం ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

శ్రీ వై. శివరామిరెడ్డి ః (Local Authorities) త్వరగా కానివ్వండి, ఇవన్నీ ప్రజలు అనుకునేవారు...

శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ : నిజాలు చెబితే అలా భయపడితే ఎలా, ఉలిక్కిపడకూడదు. ఇవన్నీ వాస్తవాలు. మేము అనేవి కావు. మరీ ముఖ్యంగా శ్రీ ఎన్. రఘువీరారెడ్డి మా నాయకుడు చేసినటువంటి పథకాన్ని పూర్తి చేసి, ప్రారంభించిన సందర్భంలో ఆయన పాదయాత్ర చేశారు. మిగిలిన వారు ప్రజలలో ఎక్కువ తిరగలేదు కాబట్టి, ప్రజలు రఘువీరారెడ్డిగారిని అడిగి ఉంటారు. అందులో ఆయన రెవెన్యూ మంత్రి. రైతులు, పేద, బడుగు, బలహీన వర్గాల వారు నష్టపోతే మీరు ఇచ్చే నష్టపరిహారం ఏమిటి అని అడుగుతున్నారు. ముఖ్యంగా మా కృష్ణా జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరిగింది. దానికి ముఖ్యకారణం ఏమిటంటే డ్రైనేజి వ్యవస్థ దెబ్బతినడం. దీనికి సంబంధించి 2006వ సంవత్సరంలో సుమారు రూ.4,600 కోట్లతో డెల్టా మోడ్రనైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఆరు సంవత్సరములు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ 10 శాతం పనులు కూడా అక్కడ పూర్తి కాలేదు. దీనిపైన ప్రభుత్వం ఏం చేస్తోంది, ఏ విధంగా స్పందిస్తోంది. ఆ పనులు పూర్తి చేసుకుని ఉంటే, ఈ రోజున వందల వేల కోట్ల రూపాయల నష్టం మా రైతులకు జరిగేది కాదు కదా! కేవలం ఆ యొక్క డ్రైన్లను బాగుచేసుకోకపోవడం వలన, పొలాలలోని నీళ్లు బయటకు వెళ్ళక, తీవ్రమైన పంట నష్టం జరిగింది. ఈ సమస్యలపైన, డ్రైన్లను మోడ్రనైజేషన్ చేసి, బాగుచేసే అంశమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తికి తీసుకువచ్చి, అత్యధికంగా నిధులు తెచ్చుకునే అంశం పైన అందరూ తక్షణమే స్పందించి, సరైన కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా ఇలాంటి విపత్తులు సంభవించినప్పుడు మంత్రులు, రాష్ట్రప్రభుత్వం కూడా ప్రజల సంక్షేమం కోసం పెళ్ళిని, ఢిల్లీని విడిచిపెట్టి, పెళ్ళికంటె, ఢిల్లీ కంటే కూడా ప్రజలయొక్క సంక్షేమమే ముఖ్యమని, వారి సమస్యలని పట్టించుకోవలసిందిగా కోరుతూ, ఎకరాకు రూ.10,000ల నష్టపరిహారం ఇస్తేనే రైతులకు న్యాయం చేసినట్లు అవుతుంది. ఆ స్థాయిలో ఈ ప్రభుత్వానికి ప్రజలు పన్నులు కడుతున్నారు కాబట్టి, ఆదాయం ఉన్నది కాబట్టి, కచ్చితంగా ఈ రోజునే, ఇక్కడే మన శాసన మండలిలోనే ముఖ్యమంత్రిగారు కూడా తక్షణమే స్పందించి ఆ రైతులకు ఒక ఎకరానికి రూ.10,000ల నష్టపరిహారాన్ని కూడా విడుదల చేయవలసిందిగా మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ధన్యవాదములు.

డా. రాయపాటి శ్రీనివాస్ (Local Authorities) : ఈ నీలం తుఫాను సందర్భంగా మాట్లాడే అవకాశం కలుగజేసినందుకు అధ్యక్షులకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వ్యవసాయానికి సంబంధించి కృష్ణా డెల్టా ఆధునీకరణ కార్యక్రమాలు నత్తనడకన నడుస్తున్న పరిస్థితి ఉంది. మా జిల్లాలో అయితే, ఈనాటికీ 5, 6 సంవత్సరాలుగా కనీసం 10 శాతం పనులు కూడా పూర్తి చేయనటువంటి పరిస్థితి ఉన్నది. ఇరిగేషన్, డ్రైనేజి వ్యవస్థలకు సంబంధించినటువంటి పనులు జరగకపోవడం వలన, రెగ్యులర్‌గా చేసే కార్యక్రమాలు, రెగ్యులర్ మోడ్రనైజేషన్ కార్యక్రమాలు ఏమీ జరగకపోవడం వలన వ్యవసాయానికి, వరి పంటకు తీవ్ర నష్టం సంభవించిందని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. అదేవిధంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కానీ, లేదా రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ గానీ, ఏదైనా కొంత

రిలాక్సేషన్‌తో రైతుల వద్ద నుండి కొనుగోలు చేయవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యంగా ప్రత్తి రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. దానికి సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్ని కొనుగోలు స్టాళ్ళను ప్రారంభించింది. అయితే, వారికి ఈ విధంగా నీలం తుఫానులో నష్టపోయిన ప్రత్తి కొనుగోలుకు సంబంధించిన అంశంలో ఎటువంటి రిలాక్సేషన్స్ ఇవ్వలేదు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజ్‌మెంట్ వారు రైతుల నుండి పత్తిని కొనుగోలు చేయలేదు. అలా కొనుగోలు చేయకపోవడంతో బయట మార్కెట్‌లో కేవలం ఒక కేజీ పత్తిని రూ.23, 24లకే కొంటున్నారు. ఆపత్తిని పంట నుండి తీయడానికి కేజీకి రూ.12, 13లు రూపాయలు రైతుకు ఖర్చు అయ్యే పరిస్థితి ఉంటోంది. ఇందులో కనీస మద్దతు ధర కూడా రైతులకు అందడం లేదని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా తక్షణమే ప్రత్తి రైతులు మినహాయింపు ఇచ్చే విధంగా ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు చేపట్టి ఆ రైతులను ఆదుకోవాలని తమ ద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా నీలం తుఫాను వలన మిర్చి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అందువల్ల మిర్చి రైతులు పూర్తిగా మిర్చి మొక్కలను పీకివేశారు. వీటికి సంబంధించిన నష్టపరిహారాన్ని కూడా ప్రభుత్వం అందించవలసిందిగా కోరుతున్నాను.

అదేవిధంగా, చేనేత కార్మికులు కూడా ఇటువంటి తుఫానులు సంభవించినప్పుడు, వారికి ఉన్న మగ్గాల క్రింద ఉండే గుంటలలో నీరు చేరి, సుమారు 10, 15 రోజుల పాటు వారు నేతపని చేయడానికి అవకాశం ఉండదు. కాబట్టి, వారికి తగిన విధంగా నష్టపరిహారాన్ని అందించాలని ఈ సందర్భంగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా, మత్స్యకారులకు సంబంధించి కూడా తుఫానులు సంభవించినప్పుడు వారు కొన్ని రోజుల పాటు సముద్రంపై వేటకు వెళ్ళలేని పరిస్థితి ఉంటుంది కాబట్టి, వారికి కూడా తగిన సహాయ కార్యక్రమాలను అందించి, నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాను. అలాగే ప్రస్తుతం ఈ తుఫాను వలన సహాయ కార్యక్రమాలు గుంటూరు జిల్లాలో బాగా జరిగాయి. అయితే, ఈ సహాయక కార్యక్రమాలు ఏమిటంటే, తీర ప్రాంతాలలోని ఇళ్ళలోకి భారీగా నీరు చేరడం వలన ఆ ఇళ్లు అన్నీ సుమారు 5, 6 అడుగుల లోతు నీళ్ళల్లో ఉండిపోవడం వలన వారి సామగ్రి, బట్టలు, ఆహారపదార్థాలు మొదలైనవన్నీ పాడయిపోయిన పరిస్థితులు ఉన్నాయి. అటువంటివారిని తిరిగి వారి ఇళ్ళకు పంపించేటప్పుడు వారికి కావలసిన పాత్రలు, బట్టలకు సంబంధించి తగినవిధంగా ప్రభుత్వం సహాయం చేసినట్లయితే బాగుంటుందని, అలాగే వారికి సుమారు 15 నుండి 25 కేజీల వరకూ బియ్యాన్ని, కిరసనాయిలు మొదలైనవి కల్పించడం ఒక సాంప్రదాయంగా ఉంటూ వస్తోంది. ఆ విధమైన సహాయాన్ని ప్రభుత్వం ఇప్పటికే అందించిందా, లేకపోతే తక్షణమే ఆ సహాయం అందించే కార్యక్రమాలను చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా అనేకమైన రహదారులు తుఫాను తాకిడికి దెబ్బతిన్నాయి. అలాగే గుంటూరు నుండి పాత మద్రాసు రోడ్డు, పత్తిపాడు, పెదనందిపాడు మీదగా

రహదారి వెడుతుంది. దాని ప్రక్కన నల్లమల డ్రైన్‌కు సంబంధించి ఒక బ్రిడ్జి ఉంది. అది గతంలోనే కొంత డ్యామేజి అయ్యింది. ఈ నీలం తుఫాను తర్వాత ఆ బ్రిడ్జి మరింత దెబ్బతిని, కూలిపోతుందేమోననే అనుమానం, ఆందోళన ఆ ప్రాంత ప్రజలలో ఉంది. ఒకవేళ అటువంటిదే జరిగితే, గుంటూరు జిల్లా నుండి ప్రకాశం జిల్లాకు పత్తిపాడు నుండి రాకపోకలు ఉండవు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వ అధికారులు తయారు చేస్తున్నారని తెలిసింది. వాటికి సంబంధించిన పనులలో ఎటువంటి జాప్యం లేకుండా, త్వరితగతిన నిధులను ఇప్పించవలసిందిగా కోరుతున్నాను. ప్రభుత్వం చేసిన కార్యక్రమాలలో ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి 2004వ సంవత్సరం తరువాత, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెంచుతూ వచ్చారు, చాలా సంతోషం.

*మ.1.00*

2004వ సంవత్సరంలో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత input subsidy ని గణనీయంగా పెంచుతూ వచ్చారు. అయితే input subsidy కనీసం హెక్టారుకు 10,000ల రూపాయలు ఇస్తే బాగుంటుందని రాజకీయాలకు అతీతంగా ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకోవలసిందిగా ముఖ్యమంత్రిగారిని, శ్రీ రఘువీరారెడ్డి గారిని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి.వి.సూర్యనారాయణ రాజు (Local Authorities) : అధ్యక్షా! మాట్లాడడానికి నాకు అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, విశాఖ పట్నం జిల్లాలో మా ప్రాంతంలో ఉన్న వాగులన్నీ బాగా పొంగడం వల్ల అపారమైన నష్టం జరిగింది. జాతీయ రహదారిలో రెండు, మూడు ప్రయివేటు బస్సులు, ఒక ఆర్.టి.సి బస్సు కొట్టుకుపోవడం జరిగింది. విజయవాడకు సంబంధించిన వ్యక్తులు మరణించడం జరిగింది. విపరీతమైన నష్టం మా జిల్లాలో సంభవించింది. మా మంత్రులు, ముఖ్యమంత్రిగారు పూర్తిగా సహాయసహకారాలు అందించడం కోసం జిల్లాలో పర్యటించి పాయకరావుపేట నియోజకవర్గంలో తాండవ, వరహా, అనకాపల్లిలో ఉన్నటువంటి శారద నది, ఈ మూడు నదులు తాలూకు గట్టు ఎక్కడెక్కడ కొట్టుకుపోయాయో, అవన్నీ జాతీయ రహదారి మీద నుంచి చూసి, ఆ గట్లను పటిష్టం చేసి, ముందు ముందు వచ్చే వరదలకు గట్లు కొట్టుకుపోకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని, కొంత నిధులను గట్లకొరకు కేటాయిస్తామని చెప్పడం జరిగింది. అదేవిధంగా నష్టపరిహారం విషయంలో వరి, చెరకు లాంటి కొన్ని పంటలకు ఒకే రకమైన నష్టపరిహారాన్ని ప్రకటించడం జరిగింది. ఆ ప్రాంతంలో చెరకుపంట బాగా ఉంటుంది. నాలుగైదు సుగర్ ఫ్యాక్టరీలు కూడా ఉన్నాయి. వరికి, చెరకుకు ఒకే రకంగా input subsidy ని ఇవ్వడం వల్ల చెరకు రైతులు ఇబ్బందిపడే

పరిస్థితి ఉంది. వరి కంటే చెరకుకు ఎక్కువ సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నాను. నదీప్రవాహక ప్రాంతంలో ఉన్న ఇళ్ళను గురించి – సాధారణంగా పాయకరావు పేట, ఏలేరులో తీసుకుంటే, నదుల ప్రక్కనే నాలుగైదు వీధులు నిర్మించడం జరిగింది. పునరావాసం కోసం వారికి పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వకపోతే ప్రతీసారీ జరిగే నష్టాన్ని భర్తీ చేయలేని పరిస్థితులు ఉన్నాయి. నష్టం జరిగినపుడు సహాయక చర్యలు చాలా వరకు జరిగాయి, ఇంకా కొన్ని జరగవలసి ఉన్నాయి. మా ప్రాంతంలో మునిగి పోయిన ప్రతి కుటుంబానికి 20 కె.జిల చొప్పున బియ్యం ఇవ్వడం జరిగింది. కానీ కిరసనాయిలు బట్వాడా జరగలేదు. అది జరగాలని కోరుకుంటున్నాను. అలాగే ఇరిగేషన్, పంచాయితీరాజ్, ఆర్ & బి శాఖలకు విపరీతమైన నష్టం జరిగింది. మా ప్రాంతంలో ఒక 1900 ఎకరాల అయకట్టు వున్న ప్రాంతం పూర్తిగా నాశనమైపోతే, మంత్రి శ్రీ బాలరాజుగారు, మేము వెంటనే అక్కడకు వెళ్ళి రైతులకు నీరు ఇవ్వాలి, వరి పాడవుతుందనే ఉద్దేశ్యంతో ఎక్కడా లేని విధంగా ఒక 10 ఆయిల్ ఇంజన్లను పెట్టి, దగ్గరగా ఉన్న వ్యవసాయ భూములకు నీరు ఇవ్వడం జరిగింది. ఒక పది రోజుల్లోనే దానిని టెంపరరీ రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. ప్రభుత్వాన్ని నేను ఒక్క విషయం అడుగుతున్నాను – సబ్సిడీని ఆన్‌లైన్‌లో ఇవ్వడం జరుగుతుంది. కానీ మొన్న వచ్చిన కరువుకు సంబంధించిన input subsidy ఇంకా రైతులకు అందలేదు. దానికొరకు అకౌంట్ ఓపెన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం జరిగింది. బ్యాంకర్లు సహకరించకపోవడం వల్ల జీరో అకౌంటుకు వారు ఒప్పుకోక పోవడం వల్ల సబ్సిడీ ఇంకా అందలేదు. ఈ సబ్సిడీలో తక్కువ డబ్బు ఉంటే నేరుగా డబ్బులే ఇచ్చే విధంగా, రెండు, మూడు వేలకు ఎక్కువగా ఉంటే ఆన్‌లైన్‌లో ఇచ్చే విధంగా చేసి, ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ విధానాన్ని – రైతుకు సహాయ పడాలనుకున్న ప్రతి పైసా కూడా వెంటనే రైతులకు చెందే విధంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా! ధాన్యం, ప్రత్తి కొనుగోలు గురించి ఒక రిప్రజెంటేషన్‌ను ఇవ్వడానికి ముఖ్యమంత్రిగారి పేషీలోకి ఎం.ఎల్.ఏలు రావడం జరిగింది. ముఖ్యమంత్రిగారు పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి : రిప్రజెంటేషన్ తీసుకున్నాను. సభ జరిగేటప్పుడు నేను బయటకు వెళ్ళి అనౌన్సుమెంట్ చేయకూడదు కదా. బయటకు వెళ్ళి చెప్పమంటారా వారికి? అలా చేయకూడదు కదా. సభ గౌరవాన్ని కాపాడాలి. సభ జరిగేటప్పుడు మీకు ఇంకా ఎక్కువ గౌరవం ఇవ్వాలి. రిప్రజెంటేషన్ తీసుకున్నాను. వారు అడిగిన దానికి సభలో సమాధానం చెప్పడం జరుగుతుంది.

శ్రీ బాలసాని లక్ష్మీనారాయణ (అసెంబ్లీ) : ఈ రోజు నీలం తుఫానుపై మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చాలా మంది పెద్దలు మొన్న వచ్చిన తుఫాను వల్ల జరిగినటువంటి నష్టాన్ని, లక్షల ఎకరాలు కోల్పోయిన రైతుల పరిస్థితిని చెప్పారు. అయితే

ముఖ్యంగా మా దగ్గర ఖమ్మం జిల్లాలో చాలా నష్టం జరిగింది. ముఖ్యమంత్రిగారు దమ్మపేట, సత్తుపల్లి మండలాలకు రావడం జరిగింది. వరి 20 వేలు, ప్రత్తి 10 వేలు, మిర్చి 10 వేల ఎకరాలల్లో నష్టం జరిగింది. మొక్కజొన్న, కూరగాయలు కూడా నష్ట పోయాయి. ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చినప్పటికీ కూడా ఇంతవరకు అక్కడ ధాన్యాన్ని ఎవరూ కొనుగోలు చేయలేదు. ముఖ్యమంత్రిగారు నష్టం జరిగిన ధాన్యాన్ని ఐ.కె.పి సెంటర్ల వారు కొనాలని చెప్పినప్పటికీ ఈ రోజు వరకూ ఒక్క బస్తా ధాన్యం కూడా కొనలేదు. గంగారం రైతులు, ధాన్యం బస్తాలను తెచ్చి ఐ.కె.పి సెంటర్లలో పెట్టడం జరిగింది. ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదు. పైన పొట్టు రంగు మారింది కానీ, లోపల బియ్యం మాత్రం బాగానే ఉన్నాయి. అయినప్పటికీ కొనుగోలు చేయడం లేదు. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రిగారి ఛాంబర్‌లో చెప్పాము. మాకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశ్యంతో రైతులు ఐ.కె.పి సెంటర్ల వద్ద ధాన్యం పెడితే వారికి న్యాయం జరగలేదు. ఖమ్మం జిల్లాలో మిర్చి అధికంగా పండుతుంది, కానీ 50 శాతం దాటితేనే అనేటువంటి కొన్ని నామ్స్‌ను పెట్టడం వల్ల వారు రెమ్యూనరేషన్ ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళాము. మొక్కజొన్న విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

1.10p.m.

ఎందుకంటే మిర్చి మీద 50 శాతం దాటలేదు కాబట్టి వాళ్లు ఎన్యూమరేషన్ చేయడం లేదు. మొక్కజొన్న విషయంలో కూడా ప్రభుత్వం క్లారిటీ ఇవ్వవలసిన అవసరం వుంది. ప్రైవేటు కంపెనీల దగ్గర బాండు తీసుకుని రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన పరిస్థితి వుంది. ఈరోజు మా జిల్లా కలెక్టర్ ఏమంటున్నారంటే, మీరు ప్రైవేటు వ్యక్తుల దగ్గర మొక్కజొన్న విత్తనాలు తీసుకున్నారు కాబట్టి నష్టపరి హారం వాళ్లే ఇస్తారని అంటున్నారు. నీలం తుఫాను వచ్చి నష్టం జరిగితే, ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవ లసిన అవసరం వుంటే, ప్రైవేటు వ్యక్తుల నుంచి నష్ట పరిహారం పొందండని జిల్లా యంత్రాంగం చెప్పడం ఏమేరకు సమంజసం? ప్రైవేటు వ్యక్తులు సీడుకు ఇవ్వవచ్చు గానీ దున్నినటువంటి దుక్కికి నష్టపరి హారం ఇచ్చే పరిస్థితి వుండదు. కాబట్టి జిల్లా యంత్రాంగానికి ముఖ్యమంత్రి గారు క్లారిటీ ఇవ్వవ లసిందిగా కోరుతున్నాం . మిర్చి రైతులు వేల రూపాయల పెట్టుబడి పెట్టిన తర్వాత, ఇసుక మేటలు వేసి పంట నష్టపోయారు, చెట్లు పడిపోయి నష్టపోయిన పరిస్థితి వుంది. ప్రత్యామ్నాయ పంటలు వేస్తు న్నారు. అప్పటికే ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు పెట్టారు. దానికి సంబంధించి ప్రత్యేకమైన ఆదేశాలు ఇవ్వవలసిన అవసరం వుంది.

పత్తికి సంబంధించి ఇంతకు ముందే ముఖ్యమంత్రి గారిని కలిశాం, మా శాసనసభ్యులందరూ కూడా వచ్చారు. సిసిఐ వచ్చి కూడా ఉపయోగం లేకుండా పోయింది. కొనుగోలులో మధ్య దళారీలు దూరారు. పాలక వర్గంలో వుండే డైరెక్టర్లు క్వింటాలు రూ.3200 ల నుంచి రూ.3300లకు రైతుల నుంచి కొనుగోలు చేస్తే, వాళ్ల నుండి సిసిఐ క్వింటాలు రూ.3900 ల నుంచి రూ.4000లకు కొనుగోలు చేస్తోంది.

నేరుగా రైతుల దగ్గరి నుంచి గాకుండా వ్యాపారుస్తుల నుంచి, దళారుల నుంచి సిసిఐ పత్తిని కొనుగోలు చేస్తోంది. దీని మీద ప్రత్యేకమైన నిఘా పెట్టవలసిన అవసరం వుంది. ఇప్పటికే 80శాతం వరకు పత్తి అయిపోయింది, ఇంకా రైతుల దగ్గర వున్నది కేవలం 20శాతం పత్తి మాత్రమే. సెంట్రల్ గవర్నమెంటు సిసిఐ ని పంపినా, అది వ్యాపారస్తులు, మధ్య దళారీల నుంచే కొనుగోలు చేస్తోందే తప్ప నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదు, ఇది వాస్తవంగా జరుగుతోంది, ఖమ్మం మార్కెటులో మేము స్వయంగా చూశాం . అక్కడ వేరే వాళ్లు రైతుల నుంచి కొని సిసిఐకి ఇస్తున్నారు. సిసిఐ డైరెక్టుగా రైతుల దగ్గర నుంచి పత్తిని కొనుగోలు చేయడం లేదు. పరిస్థితి ఇప్పటికే చేయి దాటిపోయింది. 80 శాతం పత్తి పోయింది, ఉన్నటువంటి 20 శాతం పత్తిని సిసిఐ డైరెక్టుగా రైతుల నుంచి కొనుగోలు చేసి, వారికి గిట్టు బాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మేము ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచిస్తున్నాం . ఈరోజు పత్తి విషయంలో ముఖ్యమంత్రి గారు, మంత్రి వర్గం ఆలోచించవలసిన అవసరం వుంది. తెలంగాణా ప్రాంతంలో పత్తిని పండించే జిల్లాలు ఎక్కువగా వున్నాయి. పత్తిని రెండు, మూడు సార్లు తీసి వుంటారు. కొన్ని ప్రాంతాలలో రెండు సార్లు తీసినవి కూడా వున్నాయి. వర్షాలు ముందు పడక పో వడం వల్ల లేటుగా క్రాప్ వచ్చిన పరిస్థితులు కూడా వున్నాయి. ఏదైతే పంట నష్టం జరిగిందో దాన్ని తీసు కోవాలే తప్ప ఐదు సార్లు పికింగ్ జరిగింది కాబట్టి మేము తక్కువ ఇస్తాం, దాన్ని ఎన్యూమరేట్ చేయ మనే పద్ధతి మంచిది కాదు. రైతాంగాన్ని ఆదుకోవడానికి ఈ ప్రభుత్వం ముందుకు రావలసిన అవసరం వుంది.

ఇక ఇన్‌పుట్ సబ్సిడీ విషయానికి వస్తే – గత సంవత్సరంలో జల్ తుఫాను, లైనా తుఫాను వచ్చి నపుడు ఖమ్మం జిల్లాలో జరిగిన నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ రూ.15కోట్ల నుంచి రూ.20 కోట్లు ఇవ్వలేదు. ఈ విషయాన్ని డిడిఆర్‌సి మీటింగులో కూడా చెప్పాం . ప్రభుత్వం నుంచి బ్యాంకులకు డబ్బు చేరింది కాని అది రైతులకు అందని పరిస్థితి వుంది. కొంత మంది రైతులు బ్యాంకుల్లో ఎకౌంట్లు ఓపెన్ చేస్తే ఎకౌంట్ల నెంబర్లు మార్చడమో లేక మళ్లీ మార్చమని అంటున్నారు. రూ.500 లు, రూ.1000లకు సంవత్సరం నుంచి రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి వుంది. డబ్బులు వచ్చి కూడా బ్యాంకుల నుంచి రిలీజ్ చేయని పరిస్థితి వ్యవసాయ శాఖలో వుంది. ఎన్యూమరేషన్‌కు సంబంధించి చాలా చోట్ల ఆందోళనలు జరుగుతున్నాయి. అది కరెక్టుగా చేయడం లేదని ఆందోళనలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా డిడిఆర్‌సి మీటింగు, జిల్లా పరిషత్ మీటింగులో మంత్రిగారి సమక్షంలో మేము చెప్పాం . వ్యవసాయం చేయనటువంటి, రైతులు కాని వారికి మీరు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు, ఎవరైతే నిజంగా పంటలు వేసి నష్టపోయారో అటువంటి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని పరిస్థితి వుంది. దానికి సాక్ష్యాధారాలు చూపించాం . కొంతమంది యాక్షన్ కూడా తీసుకున్నారు. భవిష్యత్తులో ఆ విధంగా జర గకుండా, ఈ నీలం తుఫాను మూలంగా వాస్తవంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, నష్ట పరి హారం అందేలా ఈ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వవలసిన అవసరం వుంది. తప్పుడు నివేదికలు ఇచ్చి, వ్యవ

సాయం చేయని వారికి, పంటలు వేయని వారికి ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చేసిన జిల్లా యంత్రాంగం మీద చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం .

చనిపోయిన వారికి ఇప్పటి వరకూ ఎక్స్‌గ్రేషియా రిలీజ్ చేయకపోతే ఎలా? వెంటనే వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం . వర్షాలకు రోడ్లు కూడా అధ్వాన్నంగా తయారైన పరిస్థితి వుంది. తూర్పు గోదావరి జిల్లా, అన్నవరం పుణ్యక్షేత్రంలో వెల సిన శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారిని దర్శించుకోవడానికి, అక్కడ కార్తీక మాసంలో వ్రతాలు చేసుకోవడానికి తెలంగాణా ప్రాంతం నుంచి లక్షలాది మంది భక్తులు వెళుతుంటారు. ఈరోజు సత్తుపల్లి నుండి జంగారెడ్డి గూడెంకు పోవాలంటే, ఆ 50 కిలోమీటర్ల దూరానికి నాలుగు గంటలు పడు తోంది. తుఫాను వచ్చి పాడై పోయిన రోడ్లను కార్తీక మాసం సందర్భంగానైనా రిపేర్ చేయకపోతే ఎలా? కనీసం కారు కూడా పోయే పరిస్థితి లేదు. మంత్రిగారు ట్రెయిన్‌లో, ఫ్లైట్‌లో రావచ్చు. కానీ జనం కారులో పోవాలంటే మాత్రం నరకం అనుభవిస్తున్నారు. ప్రతి సంవత్సరమూ అదే పరిస్థితి. ప్రతి సంవత్సరమూ కోట్లు పెట్టి రిపేర్లు చేస్తారు గానీ మళ్లీ సీజను వచ్చే సరికి అవి కొట్టుకుపోయే పరిస్థితి వస్తోంది. మిత్రులు సుధాకర్ రెడ్డి గారు ఆ ప్రాంతానికి సంబంధించిన వ్యక్తి. పుణ్యక్షేత్రానికి వెళ్లే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులున్నాయి, ప్రభుత్వం తాత్కాలికంగానైనా ఆ రోడ్లను రిపేర్ చేయవలసిన పరి స్థితి వుంటే, కనీసం తట్టెడు మట్టి కూడా పోయలేదు. కారు గోతిలో దిగిన తర్వాత పైకి ఎక్కే పరిస్థితి లేదు. ప్రభుత్వ పరిపాలన ఏవిధంగా వుందో, జిల్లా యంత్రాంగం ఏవిధంగా పని చేస్తోందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఈరోజు పంట నష్టపోయిన రైతులందరికీ కూడా ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చూడండి. ఐకెపి కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ఆదేశాలిచ్చి, జాయింట్ కలెక్టర్లను పెట్టి మానీటరింగ్ చేసి కొనుగోలు చేస్తే రైతాంగానికి కొంత ఊరట ఇచ్చినట్లవుతుంది, ఆదుకున్నట్లవుతుంది. రైతుల దగ్గర ఉన్న 20 శాతం పత్తిని సిసిఐ నేరుగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి ముఖ్యమంత్రిగారు ప్రకటన చేస్తారని అనుకుంటున్నాం, ఎందుకంటే వారు కూడా చెప్పారు దానిపై కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఆ ఇన్‌పుట్ సబ్సిడీ విషయాన్ని ఈ కౌన్సిల్ ద్వారా చెబితే కౌన్సిల్ గౌరవం, మీ గౌరవం కూడా పెరుగుతుంది. కమిటీ చేసిన సిఫారసు మేరకు మేము ఇన్ పుట్ సబ్సిడీ పెంచుతున్నామని మీరు ప్రకటిస్తే మేము మిమ్ములను అభినందించడానికి సిద్ధంగా వున్నాం . రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు, వారిని ఆదుకోవాలి. జల్, నీలం తుఫానులే గాకుండా అనేక ప్రకృతి వైపరీత్యాల మూలంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి వుంది. కరెంటు లేక, ఎరువులు, విత్తనాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని, ఇంతకు ముందు పెద్దలు వీరభద్రరావుగారు చెప్పినట్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ పెంచి ఇవ్వవలసిందిగా కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి ఎ. లక్ష్మీ శివకుమారి (నామినేటెడ్) ః నీలం తుఫాను కారణంగా మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షుల వారికి నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ నీలం తుఫాను వచ్చిన జిల్లాలలో మా తూర్పు గోదావరి జిల్లా కూడా ఉంది. నీలం తుఫాను వచ్చిన వెంటనే, మంత్రులు గానీ గౌరవ ముఖ్యమంత్రి గారు గానీ, ఆకాశం దారులు ఇవ్వకపోయినా, నేల దారి ఇవ్వకపోయినా, వెంటనే స్పందించి ప్రజల మధ్యకు పోవాలని తెగించి, ప్రజల మధ్యకు వెంటనే రావడం అన్నది ప్రజలకు మరింత ఊరట కలుగజేసి, మరింత భరోసా కల్పించడం ముఖ్యమన్నది ఈ సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను. అంతే గాకుండా పేద ప్రజల పూరి పాకలు కొట్టుకుపోతే, వారికి గృహాలు కట్టించాలన్న ఆలోచన చేసి వెంటనే ఆ గృహాలను ఇవ్వడమన్నది మా జిల్లాలోజరిగింది. పెద్దలు చెప్పినట్లుగా తక్షణ సహాయక చర్యల క్రింద పేద వారికి బియ్యం, కిరోసిన్ కూడా వెంటనే ఇవ్వడం జరిగింది. మేము ఏది కొని తెచ్చుకోవాలన్నా పల్లెల నుంచి పట్నాలకు వెళ్లాలి. అయితే ఈ తుఫాను వల్ల మాప్రాంతంలో దారులు బీభత్సంగా కొట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితుల్లో మంత్రులు వెంటనే స్పందించి పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లేలా దారులు ఏర్పాటు చేయడం జరిగింది. రైతుల నష్టపరిహార విషయానికి వస్తే – గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, రైతుల చేత బ్యాంకుల్లో ఎకౌంట్లు ఓపెన్ చేయించి నేరుగా నష్టపరిహారం ఆ ఎకౌంట్స్‌లో క్రెడిట్ అయ్యేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సభా ముఖంగా తెలియజేస్తున్నాను.

యస్సీ, యస్టీ పేద ప్రజల యొక్క ఆస్తులు ఎక్కువగా పందులు, కోళ్లే . వీళ్లు ఎక్కువగా పందులు పెంచుకుంటారు, కోళ్లు మేపుకుంటారు. ఒక్కొక్క కుటుంబానికి ఐదు నుంచి పది పందులు, అలాగే ఐదు నుంచి పది కోళ్లుంటాయి. ఐదు నుంచి పది పందుల వరకున్న కుటుంబం ఆస్తి విలువ ఎంతంటే అది రూ.50వేలుంటుంది. అలాగే కోళ్లకు సంబంధించి రూ.20వేల నుంచి రూ.30వేలుంటుంది. యస్టీలు కొండ వాగుల పక్కన గుడిసెలు కట్టి అక్కడే పందులను పెంచుతుంటారు.

1.20 pm

అధ్యక్షా, కొండవాగులు వచ్చి పశువులే కాకుండా, పందుల గూళ్లు కొట్టుకుపోవడం, పందులు చనిపోవడం, కోళ్లు చనిపోవడం జరిగింది. ఆ పేద కుటుంబాలలో ఉన్న మహిళలకు పొదుపు చర్యలు చేసే కార్యక్రమం ఏమిటంటే.. ఈ పందులు, కోళ్ల పెంపకం. నీలం తుఫాను వల్ల ఆ ప్రాంతంలో నివసించే ప్రతి పేద కుటుంబానికి దాదాపు 70వేల రూపాయల వరకు నష్టం జరిగింది. ఢిల్లీ నుండి మాట్లాడదామంటే దానికి ఎలాంటి స్పందన లేదు. ఈ సభలో ఉన్న గౌరవ ముఖ్యమంత్రి వర్యులకు మీ ద్వారా కోరేది దీని మీద ఏమైనా సహాయ చర్యలు చేపడతారా అని మనవి చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ అంగర రామ మోహన్ (Local Authorities) ః అధ్యక్షా, నీలం తుఫాను కారణంగా కొస్తా ఆంధ్రాలో ప్రధానంగా వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాలకు పైగా తీవ్ర నష్టం జరిగింది. అక్కడున్న రైతాంగానికి వరుసగా ఒక పంట ఏమో క్రాప్ హాలిడే. రెండవ పంట ఏమో మోడరైనేజేషన్ పనులతో రెండు లక్షల ఎకరాలకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడేమో ఈ నీలం తుఫాను కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. సుమారు ఎకరానికి రూ.20వేలు నష్టపోయిన పరిస్థితిలో ఈనాడు రైతాంగం ఉంది. ఈవేళ పంట కోసే సమయంలో 10 బస్తాలు కూడా పండని పరిస్థితిలో రైతాంగం ఉంది. ఇంత నష్టం జరుగుతున్నా పండిన ధాన్యాన్ని కూడా అమ్ముకోలేని పరిస్థితిలో వారున్నారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పుడిప్పుడే తెరుస్తున్నారు.

అదే విధంగా లక్ష్మీపాలెం అవుట్‌లెట్స్ కారణంగా వేలాది ఎకరాలు మునిగిపోతున్నాయి. దాని గురించి మంత్రి గారికి తెలుసు. దీని వల్ల ప్రతి పంట మునిగి పోయే పరిస్థితి వచ్చి రైతులు గండి కొట్టుకొనే పరిస్థితి వచ్చింది. సముద్రంలోకి వెళ్లే అవుట్‌లెట్స్ సరిగా పని చేయని కారణంగా వేలాది ఎకరాల పంటకు నష్టం జరుగుతోంది. లక్ష్మీపాలెం అవుట్‌లెట్స్ గురించి ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పంట నష్ట పరిహారం ఎప్పుడో తెలుగుదేశం హయాంలో రూ.1500లు మాత్రమే ఉండేదని చెప్పడం కాదు. ఇప్పుడు వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిన సందర్భంలో పెద్ద ఎత్తున ఆర్ధిక సహాయంతో రైతాంగాన్ని ఆదుకోవాలి. ఎకరానికి రూ.2400లు నష్ట పరిహారం అంటే కేవలం ఐదారుగురు కూలీలకు సరిపోని పరిస్థితి. అందుచేత, తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసినట్లు ఎకరానికి రూ.10,000లు సబ్సిడీ క్రింద తక్షణమే ఇచ్చే విధంగా ప్రకటన చేయాలి. ఎప్పుడో తుఫాను వచ్చినా ఈరోజుకు కూడా ప్రకటన చేయకపోవడం చాలా బాధాకరం. అదే విధంగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని రైతాంగమంతా ముఖ్యమంత్రి గారు వస్తున్నారు, కనీసం నాలుగైదు ప్రాంతాలు చూస్తారనుకుంటే.. ఒక గంట కూడా మా జిల్లాలో గడపలేని పరిస్థితి వచ్చింది. ఇది చాలా బాధాకరం. అదే విధంగా, చేనేత కార్మికులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. చేనేత కార్మికులకు మగ్గాలు, యార్న్ పోయాయి. మగ్గానికి రూ10,000లు నష్టం వచ్చింది. వారికి కేవలం 10కిలోల బియ్యం ఇచ్చి ఊరుకున్నారు తప్ప యార్న్ నష్టపోయినందుకు ఎటువంటి సహాయం చేయలేదు. వారి విషయమై ప్రభుత్వం తక్షణ సహాయంగా ఒక్కొక్క మగ్గానికి రూ.5,000లు నష్టపరిహారంగా ఇచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. జిల్లాలో ప్రధానంగా లూజు సాయిల్ అవ్వడం వల్ల ఆర్ అండ్ బి రోడ్లకు కాని, పంచాయతీ రోడ్లకు కాని తీవ్రమైన నష్టం జరిగింది. రోడ్లకు సంబంధించిన నిధులు కొన్ని జిల్లాలకే వెళ్లిపోతున్నాయని ఇటీవల మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఆ విధంగా కాకుండా, నష్టపోయిన జిల్లాలలో రోడ్లన్నింటికి తక్షణమే తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని మీ ద్వారా కోరుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (అసెంబ్లీ) ః అధక్షా, ఈ అవకాశం ఇచ్చినందుకు ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తీరప్రాంతానికి 20 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధులతో

నిర్మించిన తుఫాను షెల్టర్లల్లో ఈరోజు ఒక్క తుఫాను షెల్టరు కూడా పని చేయడం లేదు. అవి ఉపయోగపడలేని పరిస్థితి ఉంది. నేను ఈ విషయాన్ని ఆర్థిక శాఖ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చినప్పుడు ఇది రెవెన్యూ శాఖకు సంబంధించినదని వారితో సంప్రదించమని చెప్పడం జరిగింది. దయచేసి ముఖ్యమంత్రి గారు, రెవెన్యూ శాఖ మంత్రి గారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తుఫాను షెల్టర్లు ఏవైతే ఉన్నాయో, అవి కమ్యునిటికి ఉపయోగపడే రీతిలో తుఫాను షెల్టర్లు నిర్మించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

రెండవది, నేను గుంటూరు జిల్లా కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో జరిగిన పంట నష్టాన్ని చూడడానికి వెళ్లినప్పుడు అక్కడ ఇసుకను వేలంపాటలో పాడుకున్నటువంటి వాళ్లు ఆ కొండవీటి వాగుకు అడ్డంగా లారీలు పోయేదానికి కట్ట వేసుకున్నటువంటి నేపథ్యంలో అక్కడ ఉన్నటువంటి ఎగువ భూములు, దిగువ భూములన్నీ పూర్తిగా మునిగిపోయాయి. అక్కడ పసుపు, క్యాబేజీ, కాలిఫ్లవర్ మొదలైన పంటలు పండిస్తున్నారు. వరికి ఎకరానికి రూ.20,000 ఖర్చు అయితే, ప్రత్తికి రూ.40,000ల వరకు ఖర్చు అవుతుంది. అదే పసుపుకు అయితే ఎకరానికి దాదాపు రూ.80,000లు వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. దీనికి సంబంధించి పంటల వారీగా కనీసం 50 శాతం మేరకైనా పంట నష్టపరిహారం ఇచ్చే దానికి కచ్చితమైన లెక్కలను ఆసరాగా తీసుకొని ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఏ ఏ మండలాల్లో, ఏ ఏ గ్రామాలలో, ఏఏ రైతులకు ఏ ఏ పంటలకు ఎన్ని ఎకరాల పంట నష్టపోయింది, వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఏ తీరుగా ఇస్తున్నారనే దానిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అక్కడ ఉన్నటువంటి డిడిఆర్‌సీ మీటింగుల ద్వారా కాని, ప్రజా ప్రతినిధులతో కాని, అఖిల పక్షంతో కాని కచ్చితంగా బేరీజు వేయవలసిన అవసరం ఉందని నేను మనవి చేస్తున్నాను. చివరిగా, ఈ డిసెంబర్, 1,2,3, వ తేదీలలోనూ, 5 వ తేదీన రాష్ట్రంలో వచ్చినటువంటి తుఫానుతోపాటు, దురదృష్టపశాత్తు తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎర్రంనాయుడు గారు మరణించిండం, విజయనగరం జిల్లాలో శుభ కార్యం జరగడం, అదే సమయంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండడం , ఈ తుఫాను రావడం, కొన్ని రాజకీయపార్టీలు వారి యొక్క ప్రాభవం కోసమో, ప్రజల కోసమో పాదయాత్రలలో ఉండడం వల్ల టోటల్ రాజకీయ యంత్రాంగమంతా ఈ తుఫాను ప్రభావాన్ని ప్రజల నుండి తొలగించే దానికి దూరంగా జరగడానికి ఒక కారణభూతమైందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నటువంటి జిల్లా కలెక్టర్ కాని, డి.ఆర్.ఓ కాని, ఎం.ఆర్.ఓ కాని ఈ తుఫాను ప్రభావం నుండి రక్షించడానికి వారికున్న అధికారాలను ఎవరూ వినియోగించుకోలేదని తెలుస్తోంది. పూర్తిగా అంతా అయిపోయిన తరువాత కూడా, 40రోజులు సమయం గడచినా కూడా వారికి ఏ విధమైన ప్రతిఫలం చెందకుండా ఉన్నందువల్ల రాష్ట్ర ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ప్రభుత్వం దయచేసి దీనిని గమనించాల్సిన అవసరం ఉంది. అధికార యంత్రాంగం పనిచేయడం లేదు. అధికార యంత్రాంగంతో పని చేయించే శక్తి సామర్థ్యాలను ప్రభుత్వం చేకూర్చుకొని ఏ మాత్రం ఆలస్యం లేకుండా మేము సూచించిన

సూచనలన్నింటిని వెంటనే కార్యాచరణలోకి తీసుకురాకపోతే పేద ప్రజలకు తీవ్రమైన పరిస్థితులు ఎదురవడానికి ప్రభుత్వమే కారణమవుతుందని మనవి చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారు, మంత్రివర్యులు అందరూ ఇక్కడే ఉన్నారు కాబట్టి ఈ సీరియస్ సబ్జెక్ట్‌ను రాష్ట్రానికి ఉన్న అతి తీవ్రమైన పరిస్థితిని రాజకీయాలకు అతీతంగా వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాను. ప్రభుత్వం అంచనా వేసిన రూ.3,600కోట్లు నష్టపరిహారం క్రింద సరిపోవు. కనీసం ఐదారు వేల కోట్ల రూపాయలు అయినా సరే కేంద్రం ప్రభుత్వం నుండి తీసుకురావడానికి, రాష్ట్ర ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలి. చేతి వృత్తుల వారికి ముఖ్యంగా చేపలు పట్టే వాళ్లకు తీవ్రంగా నష్టం జరిగింది. వాళ్ల వలలు, పడవలు పోయాయి. వారు తీవ్ర నష్టానికి లోనయ్యానారు. దాదాపు ఐదారు రోజుల పాటు అసలు సముద్రంలో వేటకు వెళ్లడానికి అవకాశమే దొరకలేదు. వేటకు సెలవు ప్రకటించినప్పుడు వాళ్లకు ప్రత్యామ్నాయంగా ఒక అలవెన్సు ఏదైతే ఇస్తున్నారో అదే విధంగా, ఈ పీరియడ్‌కు కూడా ఆ రకమైన అలవెన్స్‌ను మత్స్యకారులకు ఇచ్చేదానికి కూడా ప్రభుత్వం ఆలోచించాలని మనవి చేస్తూ, మీకు మరోసారి ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (అసెంబ్లీ) : అధ్యక్షా, నేను మాట్లాడడానికి అనుమతించినందుకు మీకు, ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

అధ్యక్షా, నీలం తుఫాను వచ్చిన ప్రాంతాలలో నేను కూడా పర్యటించాను. అక్కడ జరిగిన నష్టాలను చూడడానికి పర్యటించిన విషయం టీ.విలలో, పత్రికలలో చూచి ఉంటారు. అక్కడ పరిస్థితులను గమనించాను కాబట్టి, మాట్లాడక తప్పడం లేదు. శాసన మండలి ఎప్పుడో కాని సమావేశం కాదు. మొన్న సభ జరిగినప్పుడు అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయాను. ఈరోజు సభకు ప్రజల తరపున, ముఖ్యంగా మహిళల తరపున అక్కడ చూచిన అవస్థల గురించి చెప్పాల్సిన అవసరం ఉందని వచ్చాను. ఒకటి, వాళ్లు అంత బాధలలో కూడా మాట్లాడినటువంటి ధోరణి ఏమిటంటే.. గ్రామాలలో పెద్ద, పెద్ద చెరువులుంటాయి. చెరువులకు మామూలుగా కాలువల ద్వారా నీళ్లు నింపుతారు. అయితే కరువుతో చెరువులకు నీళ్లు నింపుకునే పరిస్థితి లేక, వర్షాలు లేక, నీళ్లు లేక మొన్నటి వరకు ఇబ్బందులు పడ్డామని చెప్పారు. మొన్న వచ్చినటువంటి వర్షానికి చెరువు కట్టలు తెగిపోయినవి కొన్ని అయితే, కొన్నింటిని వాళ్లు తెగ్గొట్టారు. ఐదారు రోజులు వరుసగా కురిసిన వర్షానికి చెరువులు నిండిపోయి కట్టల మీద నుండి పొంగి పొలాలలు, గ్రామాలు మునిగిపోతున్నాయనే ఉద్దేశ్యంతో వాళ్లు ముందుగానే ఆ చెరువు కట్టలను తెగ్గొట్టి ఆ నీళ్లను కాలువలకు వదిలినట్లు తెలిసింది.

1.30pm

సహజంగా కెనాల్స్‌లో నీళ్లను పొలాలకు పెడతారు. చెరువులు నింపుకుంటారు. కానీ, ఇక్కడ జరిగిందేమింటంటే పొలాలలోని నీళ్లను కెనాల్స్‌లోకి పెట్టడం జరిగింది. అదీ పరిస్థితి. ఆ ప్రాంతం వారు ముంపు గ్రామాలకు ముందున్నాము, కెనాల్ నీళ్లకు వెనక ఉన్నామని చెప్పారు. అంటే వారికి త్రాగడానికి నీరు లేదు కానీ, వరదలు వచ్చినప్పుడు మాత్రం కాలనీలు మునిగిపోతున్నాయి. కాబట్టి కౌలు రైతులు, సన్న చిన్నకారు రైతులు ఏ విధంగా ఇబ్బంది పడ్డారనే విషయాలు మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాము. సాధారణంగా పత్తిగింజ నాటితే మొలక వస్తుంది. కానీ, మొన్న కురిసిన వర్షాలకు పండిన పత్తిలో ఉన్న గింజనుండి మొలక వచ్చింది. పలు టి.వి. ఛానల్స్‌లో కూడా ఈ విషయాన్ని చూపించడం జరిగింది. అది కూడా నల్లగా మాడిపోయింది. అధ్యక్షా, మిర్చి పంట, తదితర పంటల విషయమై ప్రతిపక్ష నేత శ్రీ దాడి వీరభద్రరావు గారితో కలిసి కొంతమంది ఎమ్ఎల్ఏలు, ఎమ్ఎల్‌సిలు ముఖ్యమంత్రిగారిని కలవడం జరిగింది. అప్పుడు వారితో నష్టపరిహారం త్వరితగతిన ఇప్పించమని, ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు చేయవలసిందని కోరడం జరిగింది. మంచి పత్తినే కొనుగోలు చేయడం లేదు, ఇంకా ఈ మునిగిపోయిన ధాన్యాన్ని, పత్తిని ఏ విధంగా బయట వారు కొంటారు? కాబట్టి ఎట్టి పరిస్థితులలోనైనా రైతాంగానికి చేయూతనివ్వాలని తమ ద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. మరో ముఖ్యమైన అంశమేమంటే – కొన్ని గ్రామాలలో మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్రమైన ఇబ్బందికి గురవుతున్నారు. ఈ మధ్య వర్షాలు పడినప్పుడు పెదనందిపాడు, బాపట్ల, చిలకలూరిపేట, పత్తిపాడు నియోజకవర్గం తదితర ప్రాంతాలలోని గ్రామాలలోని కాలనీలు ముంపుకు గురై మహిళలు దాదాపు నాలుగైదు రోజులపాటు బయటకు వెళ్లలేక ఎంతో ఇబ్బందికి గురయ్యారు. కాబట్టి, గతంలో ప్రభుత్వం వాగ్దానం ఇచ్చినటువంటి ఇందిరమ్మ గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో మహిళల కొరకు మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టవలసిన అవసరం ఉందని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువస్తూ, వారిని ఈ విషయమై స్పష్టమైన హామీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. ఈ విషయమై మా వాళ్లు ధర్నా చేయడం జరిగింది. ఇంత నాగరికత పెరిగినప్పటికీ మరుగుదొడ్లు లేకపోవడమనేది శోచనీయమైన విషయం. అధ్యక్షా, శాసనసభ ఈ విధంగా జరగడం లేదు. ఇది పెద్దల సభ కాబట్టి ఇంత సజావుగా సాగుతోంది. అందరం చాలా హుందాగా మాట్లాడుతున్నాము. ఈ సభ ద్వారా ముఖ్యమంత్రిగారిని ఈ అంశాలను నెరవేర్చే విధంగా స్పష్టమైన హామీ ఇవ్వవలసిందిగా, చేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి ః అధ్యక్షా, ఇప్పటివరకూ సర్వశ్రీ దాడి వీరభద్రరావు, జల్లి విల్సన్, చేరుపల్లి సీతారాములు తదితర 15మంది గౌరవ సభ్యులు మాట్లాడడానికి అవకాశమిచ్చారు తమరు. వారందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. నీలం తుఫాను తీవ్రత గురించి మనకు తెలిసినదే. అయితే, అది తమిళనాడులోనే తీరం దాటడంతో మనకు ప్రమాదం లేదని వాతావరణ నిపుణులు చెప్పడం జరిగింది. దురదృష్టవశాత్తు నవంబరు 2వ తేదీన అది అల్పపీడనంగా మారి భారీ వర్షాలు

సంభవించాయి. దాంతో బాగా నష్టం జరిగింది. అధ్యక్షా, ఇటువంటి నష్టాలు జరిగే అవకాశముందని తెలియగానే ఆయా జిల్లాలలో కంట్రోల్ రూమ్స్‌ని ఓపెన్ చేయడం జరిగింది. రాష్ట్రస్థాయిలో ఉండే మెయిన్ కంట్రోల్ రూమ్ 365 రోజులు తెరిచే ఉంటుంది. దానిని మూయడమనేది ఉండదు. అల్పపీడనం వల్ల నష్టం వాటిల్లుతుందని తెలిసిన వెంటనే ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ఇతర ప్రజాప్రతినిధులు ఎంతో బాధ్యతగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం జరిగింది. అక్కడ ఉన్న అధికార యంత్రాంగం కూడా వారి విధిని నిర్వర్తించడంలో ఏ మాత్రం వెనుకాడలేదు. ముఖ్యమంత్రి మరియు ఇతర మంత్రులు వెంటనే నష్టం జరిగిన ప్రాంతాలకు వెళ్లలేదని కొందరు గౌరవ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే, ఒకసారి ముఖ్యమంత్రిగారు ఏదైనా జిల్లాకు వెడితే ఆ యంత్రాంగం మొత్తం ముఖ్యమంత్రి గారి దగ్గరకు రావడం జరుగుతుంది. అధికార యంత్రాంగం అంతా డిస్టర్బ్ అవుతుందని ముఖ్యమంత్రిగారు మొదట సమీక్ష చేసి వెంటనే ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి కొన్ని నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అక్కడ ఉన్న అధికారులకు తగిన డైరెక్షన్స్ ఇవ్వడం జరిగింది. తరువాత ముఖ్యమంత్రిగారు, నేను నాలుగైదు జిల్లాలకు వెళ్లిరావడం జరిగింది. అంటే వెంటనే వెళ్లకూడదని కాదు, ఆ విధంగా వెళ్లడం వల్ల నష్టం జరుగుతుంది, ఎవరి పని వారు చేసుకోవడం మంచిదనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారు ఉన్నత స్థాయి సమీక్ష చేపట్టడం జరిగింది. చనిపోయిన వారందరికీ లక్షన్నర రూపాయలు వెంటనే చెల్లించాలని, ఆపద్బంధు పథకం ద్వారా మరో యాభైవేల రూపాయలను కలిపి మొత్తం రెండు లక్షల రూపాయలను చెల్లించాలని చెప్పడం జరిగింది. ఈ విధంగా 61మంది చనిపోతే 58మందికి ఇవ్వడం జరిగింది. మరో ముగ్గురికి వారియొక్క లీగల్ హెయిర్స్ ఎవరనేది తెలియని కారణంగా ఇవ్వలేదు. అది పరిష్కారమయిన వెంటనే వారికి ఆ సొమ్మును ఇవ్వడం జరుగుతుంది. మరో 8మంది గల్లంతయ్యారు. వారికి సంబంధించిన ఆధారాలు దొరికిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని తెలియచేస్తున్నాను. అంతేకాకుండా, గౌరవ ముఖ్యమంత్రిగారు మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అవేమిటంటే – డామేజి అయిన గృహాలకు వెంటనే డబ్బులు ఇవ్వవలసిందిగా, ఎటువంటి అప్రూవల్ కోసం ఎదురుచూడకుండా ముందుగా శాంక్షన్ చేసి రాటిఫికేషన్‌కు ప్రభుత్వాన్ని అడగమనే నిర్ణయం తీసుకున్నారు. పశువులకు సంబంధించి గతంలో రెస్ట్రిక్షన్స్ ఉండేవి. అంటే ఎన్ని చనిపోయినా నాలుగు గొర్రెలకు మాత్రమే, 20 కోళ్లకు మాత్రమే, పశువులు కూడా ఎన్ని చనిపోయినా రెండింటికి మాత్రమే నష్టపరిహారం ఇచ్చేవారు. ముఖ్యమంత్రిగారు ఇటీవల తీసుకున్న మంచి నిర్ణయమేమంటే ఎన్ని చనిపోతే అన్ని పశువులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. ఆ నిర్ణయం అమలు జరుగుతోంది.

(ట్రెజరీ బెంచెస్ వైపునుండి హర్షధ్వానాలు)

మ. 1.40

పంట పండించే రైతులకు కాకుండా పండించని వారికి కూడా ఎన్యూమరేషన్ వస్తుందని, ఎన్యూమరేషన్ పంపిణీలో పొరపాట్లు జరుగుతున్నాయనే విషయం గురించి చాలామంది గౌరవసభ్యులు కూడా చెప్పడం జరిగింది. ఫూల్‌ప్రూఫ్ సిస్టమ్ ఉండాలి. మీరు లిస్టులు తయారు చేయండి. వాటిని మూడు రోజులపాటు గ్రామ సభల్లో పెట్టండి. అలా పెట్టిన తరువాత, అన్ని రాజకీయ పార్టీలుకాని, ప్రజా ప్రతినిధులుకాని, రైతులుకాని వాటిని పరిశీలించే విధంగా ఫూల్‌ప్రూఫ్‌గా ఉండాలని కూడా ఆ రోజు చెప్పడం జరిగింది. ఏదైనా తప్పు జరిగినట్లయితే, దానికి ఎవరు బాధ్యులో వారిపై తప్పకుండా కఠిన చర్యలను తీసుకోవడం కూడా జరుగుతుంది. నష్టపోయిన ప్రతి ఎకరాకు మనం నష్ట పరిహారం ఇచ్చితీరాలి. అదేవిధంగా, వారికి ఇన్సూరెన్స్ కూడా అప్లికబిలిటీ వుంటే, ఆ మొత్తాన్ని వారికందించాలనే కీలక నిర్ణయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆరోజు తీసుకోవడం జరిగింది.

జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు మరియు ఇతర డివిజన్ స్థాయి అధికారులు గ్రామాలను సందర్శించి, ర్యాండమ్‌గా చెక్ చేసి, వాటిని కూడా ఫైనలైజ్ చేసి పంపాలని గౌరవ ముఖ్యమంత్రిగారు నిర్ణయించడం జరిగింది. త్రాగునీటికి సంబంధించి, ఏ మాత్రం వేచి చూడకుండా, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం, అవన్నీ రెస్టోర్ కూడా చేయడం జరిగిందని తమరి ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కోసం గతంలో ఏ అనుమతిని తీసుకోవాలన్నా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపవలసి వచ్చేది. గౌరవ ముఖ్యమంత్రిగారు తీసుకొన్న మరొక కీలక నిర్ణయం ఏమిటంటే, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల విషయంలో ఎటువంటి ఆలస్యం చేయకూడదు, రూ. 5 లక్షల వరకూ, ఆన్ నామినేషన్, సంబంధిత కలెక్టర్లే శాంక్షన్ యిచ్చి, ర్యాటిఫికేషన్ కొరకు ఆ దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపాలని ఆదేశించడం జరిగింది. అదే విధంగా, రూ. 10 లక్షల వరకూ కలెక్టర్లకే అధికారం ఇచ్చి, షార్ట్ టర్మ్ టెండర్ల ద్వారా పనులను పూర్తి చేసి, ఆ తరువాత ప్రభుత్వానికి ఆ దస్త్రాన్ని పంపాలని కూడా ఆదేశించడం జరిగింది. ఈ విధమైన నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవడం వల్ల తెగిపోయిన కొన్ని వందల చెరువులను కూడా రెస్టోర్ చేయడానికి ఆస్కారం కలిగింది. జిల్లాల నుంచి ముందస్తు అనుమతుల కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం వల్ల కొంత సమయం కూడా వృధా అవుతుంది. ఆ రకంగా సమయం వృధా కాకుండా చూడడం జరుగుతోంది. నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచాలని, కిరోసిన్, బియ్యం మొదలైన వస్తువులను వెంటనే వారందరికీ అందించాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి అంటువ్యాధులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగింది. నీటిలో తడిసి, రంగు మారిన ధాన్యం మరియు పత్తిని సంబంధిత సంస్థలను ఒప్పించి తప్పకుండా కొనుగోలు చేయడం జరుగుతుందని, దానికోసం సిద్ధంగా ఉండాలని, ట్రెజరీ రూల్, 27 ప్రకారం ఎన్ని నిధులు అవసరమయితే అన్ని నిధులను డ్రా చేయవలసిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలను కూడా జారీ చేయడం జరిగింది.

తుఫాను ప్రాంతాలలో విద్యుత్తును సత్వరమే రెస్టోర్ చేయించడం జరిగింది. ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో గతంలో ఎంతవరకూ యివ్వడం జరిగింది, ప్రస్తుత పరిస్థితి ఏమిటి, ఇంకా ఏమైనా పెంచవలసిన అవసరముందా అనే విషయాలను పరిశీలించడానికి ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా నియమించడం జరిగింది. బాధ్యత ఉంది కాబట్టే, ఒకటి కాదు రెండు కాదు, దాదాపు 17, 18 నిర్ణయాలను తీసుకొని గౌరవ ముఖ్యమంత్రిగారు క్షేత్రస్థాయికి వెళ్లారనే విషయాన్ని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

తుఫాను ప్రాంత బాధితులకు ప్రభుత్వం ఎలాంటి సహాయాన్ని అందజేసిందని గౌరవ సభ్యులు అడిగారు. ఇంతకుముందే కొన్ని విషయాలను వివరించాను. మరికొన్నింటిని ఇప్పుడు తెలియజేస్తున్నాను. 410 శిబిరాలను ఏర్పాటు చేసి 10,13,120 ఆహార పొట్లాలను నీటి ముంపునకు గురై ఇబ్బంది పడ్డవారికి ఇవ్వడం జరిగింది. 14,72,000 నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. పిల్లలకోసం 1900 లీటర్ల పాలను సరఫరా చేయడం జరిగింది. 1984 వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసి రోగులకు సేవలనందించడం జరిగింది. ఇంతకు ముందు నేను చెప్పిన విధంగా, అవసరమైన నిధులను ట్రెజరీ రూల్ 27 కింద జిల్లా కలెక్టర్లు డ్రా చేస్తారు. మనకు రూ. 5000 కోట్ల నష్టం జరిగింది, రూ. 4000 కోట్ల నష్టం జరిగింది, ఆ రూ. 4000 కోట్లను ట్రెజరీ రూల్ 27 కింద డ్రా చేసుకోవాలని మనం భావించడం సరైనదికాదు. కలెక్టర్లు ఏది అత్యవసరమని భావిస్తే దానికోసం వారు నిధులను తీసుకుంటారు. ట్రెజరీ రూల్ 27 కింద ఇప్పటికే రూ.9,67,00,000/-లు వారు డ్రా చేయడం కూడా జరిగింది.

ఇంతకు ముందు చెప్పిన విధంగా, 61 మంది మరణించగా, వారిలో 58 మందికి చెందిన కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షల ప్రకారం డబ్బును చెల్లించడం జరిగింది. మిగిలిన ముగ్గురి యొక్క కుటుంబ సభ్యులకు కూడా, వారి వారసులను గుర్తించిన తరువాత ఆ నష్టపరిహారాన్ని చెల్లించడం జరుగుతుంది. అదేవిధంగా, రూ.50,000/-లను ఆపద్బంధు పథకం కింద వారికి చెల్లించడం జరుగుతోంది. ఎవరైతే ఈ నీట మునిగి ఇబ్బందిపడ్డారో, వారికి ఇప్పటికే 9,800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, 3,561 కిలో లీటర్ల కిరోసిన్‌ను కూడా సరఫరా చేయడం జరిగింది. పూర్తిగా ధ్వంసమైన ఒక్కొక్క పక్కా ఇంటికి రూ.35 వేలు, పూర్తిగా ధ్వంసమైన ఒక్కొక్క కచ్చా ఇంటికి రూ.15 వేలు, బాగా దెబ్బతిన్న ఒక్కొక్క పక్కా ఇంటికి రూ. 6,300 లు, బాగా దెబ్బతిన్న ఒక్కొక్క కచ్చా ఇంటికి రూ. 3,200 లు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.1900 లు, గుడిసెలకు రూ.2,500 లు తుఫాను బాధితులకు చెల్లించడం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా, దెబ్బతిన్న పశువుల పాకలకు రూ. 1,250 లు రైతాంగానికి ఇవ్వడం జరిగింది. ఈ సహాయ కార్యక్రమాలన్నీ ప్రస్తుతం జరుగుతూ ఉన్నాయి. అన్ని విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడం జరిగింది.

అధ్యక్షా, ఇంతకుముందు గౌరవ సభ్యులు కొన్ని సలహాలు ఇచ్చారు. సైక్లోన్ షెల్టర్స్ ఎక్కువగా నిర్మించవలసిన అవసరం వుంది, కొన్నిచోట్ల అవి ఉన్నాకూడా అవి సరిగా పనిచేయడం లేదని వారు చెప్పారు. అది వాస్తవం. వారు చెప్పిన ఆ విషయంతో నేను ఏకీభవిస్తున్నాను. ఈ విషయంలో, కేవలం సైక్లోన్ వచ్చినప్పుడు మాత్రమే వాటిని ఉపయోగించడం కాకుండా, మల్టీపర్పస్ షెల్టర్స్‌గా అవి ఉన్నట్లయితే, 365 రోజులలో వీలైనన్ని ఎక్కువ రోజులు వాటిని కమ్యూనిటీ పర్పస్‌కు ఉపయోగించేవిధంగా, వాటిని రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. నూతనంగా షెల్టర్లు, రోడ్లను నిర్మించడానికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిపి రూ. 771 కోట్లను కేటాయించడం, దానికి సంబంధించిన పనులు కూడా ప్రారంభించడం జరిగింది. వీటికోసం అత్యాధునికమైన నిర్మాణ పద్ధతులను అవలంబిస్తున్నారు. అవన్నీ కూడా 2014-15 సంవత్సరంలోపు పూర్తవుతాయని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ప్రపంచంలో కొన్ని అభివృద్ధి చెందిన దేశాలైన UK, US లలో ఉన్నంతగా ఋతుపవనాలను సరిగ్గా అంచనా వేసే సాంకేతిక నైపుణ్యం మన దేశంలో అందుబాటులో లేదు. ఆ టెక్నాలజీని మనం మెరుగు పరచుకోవలసిన అవసరం వుంది. ఆ విషయంలోనే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మీదట, రూ. 400 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. ఇది ఈ రోజేదో కొత్తగా వచ్చిన సమస్యకాదు. కానీ ఇంత వరకూ దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ పరిస్థితిని మన కర్మ అని సరిపెట్టుకోకుండా, కేంద్ర ప్రభుత్వాన్ని కోరినందువల్ల, రూ. 400 కోట్ల నిధులను వారు మంజూరు చేయడం జరిగింది. Yes, it will take another two years. అప్పటివరకు మేమేమీ చేయకుండా ఉండమని కాదు. కాకపోతే ఆ హెచ్చరికలు మనకు సరిగ్గా వచ్చినట్లయితే ఈ నష్టాన్ని మరింత నివారించడానికి అవకాశం వుంటుంది.

గతంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీని నగదు రూపంలో చెల్లించేవారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మొత్తాన్ని చెక్కుల రూపంలో యివ్వడం ప్రారంభించాము. ఆ విధంగా కూడా తప్పులు దొర్లుతున్నాయని భావించి ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా ప్రస్తుతం వారికి చెల్లించడం జరుగుతోంది. ఇంకనూ కొన్ని జిల్లాల్లోని రైతులకు రూ. 5 కోట్లు లేక రూ. 10 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదంటే, కొన్ని అనివార్య కారణాలవల్ల కొంచెం ఆలస్యం అయివుండవచ్చు. కానీ, రాష్ట్రంలో రైతు కాని ఏ ఒక్కరికీ ఆర్థిక సహాయం అందిందని చెప్పడానికి అవకాశం లేకుండా పారదర్శకమైన విధానంతో గత సంవత్సరం రూ. 1800 కోట్లు ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా నేరుగా రైతుల యొక్క బ్యాంకు ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సీడీని చెల్లించడం జరిగిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మ.1.50

దానిని కొనసాగిస్తూనే, మీరు ఇచ్చినటువంటి సలహాలు ఏవైతే ఉన్నాయో, వాటిని ఇప్పటికే మేము దృష్టిలో పెట్టుకొని ఏ రైతు, ఏ పంట ఎంత విస్తీర్ణంలో నష్టపోయాడు అనేటువంటి వివరాలని అగ్రి వెబ్‌సైట్‌లో మొత్తం వివరాలు పొందుపరచడం జరుగుతోంది. ఆ వెబ్‌సైట్‌ను ఎవరికైనా యాక్సెస్ ఉంటుంది. రహస్యమైనటువంటిది కానే కాదు. గతంలో అధికారుల ఫైల్‌లో ఉండేటువంటిది. ఇప్పుడు అటువంటిది కానే కాదు. It is in public domain. గౌరవ సభ్యులును కోరేది ఏమిటంటే ఇప్పుడు మనము Enumerate చేసిన దానిలో మీరు మీ, మీ గ్రామాలు ఒకటో, రెండో ర్యాండమ్‌గా చూడండి. మీ, మీ క్యాడర్‌కు చెప్పండి, వర్కర్స్‌కి చెప్పండి. ఏమైనా తప్పులు జరిగినవని తెలిపితే వాటిని కూడా ఇప్పటికైనా సరిచేయడానికి ప్రభుత్వం తరపున ఓపెన్ మైండ్‌తో ఉన్నాం. దానిలో దాపరికాలు లేవు. ఎవరికైతే నష్టం జరిగిందో వారికే వెళ్లాలి. దానికోసం ఈ సీజన్ నుండి మేము ఆన్‌లైన్‌లో పెడుతున్నామనేది గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. ఇన్‌పుట్ సబ్సిడీ పెంపుదల గురించి గౌరవ సభ్యులు ఇందాక అడిగినారు. వీటన్నింటిని నేనేదో కంపారిజన్ అనేది చెప్పడం కాదు, కాని What is the concern that this Congress Government is having అనేది చెప్పడానికే. నష్టమంతా పూడ్చుతామని చెప్పడం లేదు. నేను కూడా ఒక రైతుని, I am the last person to agree. రైతు నష్టపోతున్న దంతా మొత్తం దీనిద్వారా పూడ్చుతామని చెప్పడానికి మేము కూడా తయారుగా లేము. కాకపోతే, The sincere efforts what we have done అనేది. 2004లో రూ.1500/- ఉంటే, దానిని మేము హెక్టారుకు 2005లో రూ.1875/- చేశాం. దానిని 2007లో రూ.2,250/- కి పెంచాం. 2008లో రూ.4500/-లకు పెంచాం. ఒక్కసారిగా రూ.4500/- ఉన్నదానిని 2010లో రూ.6000/-లకు పెంచాం. ఇప్పుడు ఇంకా పెంచమని గౌరవ ముఖ్యమంత్రి గారే మాకు కమిటీ వేశారు. మేము రెకమెండేషన్స్ ఇచ్చాం. ఏ, ఏ పంటకు ఎంత పెంచబోతున్నారనేది గౌరవ ముఖ్యమంత్రి గారు చెబుతారు. ఈ ఎనిమిది సంవత్సరాల్లోనే మేము ఐదవ సారి పెంచాం. రూ.1500/- ఉన్నది, ఇప్పుడది రూ.6,000/- అయింది. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రకటించిన తరువాత అది ఎన్ని రెట్లు అవుతుందనేటువంటిది కూడా మనకు తెలుస్తుంది. ఒకింత మీకు ఎవరికి బాధ కలుగకపోతే, నేను చెప్పేది ఏమంటే తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.1250/- ఉన్నదానిని రూ.1500/-లకు పెంచారు. The increase during the 9 years regime of TDP was just Rs.250/-. దయచేసి బాధ పడద్దు. మీరు కారకులు కాదు. ఇక్కడ కూర్చున్న ఏ ఒక్కరు కూడా కారకులు కాదు. మీరు కారకులు అని కూడా నేను తప్పు చేయను. ఆ రోజు కూడా రూ.1500/- ఇస్తామన్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని కనీసం రూ.2000/- చేయమని మేము అసెంబ్లీలో, బయట కూడా కోరాము. ప్రధాన ప్రతిపక్ష నాయకులు కాని, మిగిలిన వారిని కాని నేను అభినందించేది ఏమంటే, అందించే చేయి మీ చేతులో అవకాశం ఉన్నప్పుడు ఆ ఉదారత్వం లేకపోయింది.

ఇప్పుడు అడగడంలోనైనా మీకు ఉదారత్వం ఉంది. కాబట్టి ఒక రైతుగా మిమ్మల్ని నేను అభినందిస్తున్నాను. గౌరవ సభ్యులు మనవి చేసినట్టు కౌలు రైతులకి, గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రయత్నం ప్రారంభం చేశాం. కౌలు రైతులు కూడా పంట నష్టపోయినప్పుడు వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రయత్నం చేశాం. మొదటగా, మొదలు పెట్టినప్పుడు 10, 20 శాతం ఇప్పించగలిగాం. దానిని గత సంవత్సరంలో 80 శాతం కౌలు రైతులకు ఇప్పించగలిగాం. Not the insurance. ఇన్‌పుట్ సబ్సిడీ గురించి గౌరవ ముఖ్యమంత్రి గారు మీడియా కాన్ఫరెన్స్‌లో చాలా నిక్కచ్చిగా చెప్పారు. ఏ కౌలు రైతులైతే పంట పెట్టారో, వారికే ఈ ఇన్‌పుట్ సబ్సిడీ వెళ్లి తీరాలనేటువంటి ఖచ్చితమైన ఆదేశాలు అందజేశారు. ఎన్యూమరేట్ చేసినప్పుడు ఏదైతే వివిధ కాలమ్స్ ఇచ్చి ఉంటామో, అందులో ఒక కాలం దీని కోసం పొందుపరచి పంట ఎవరు పెట్టారనేది రిజిష్టర్ చేయడం జరిగింది. గ్రామ-సభలో పెట్టడం జరిగింది. వాళ్లకే ఇవ్వడం జరుగుతుంది. మరోసారి మిమ్మల్ని అందరిని కోరుతున్నాను. ఎక్కడైనా భూమి ఒకరిది, పంట పెట్టే కౌలు రైతుకు వెళ్లకుండా, ఎక్కడైనా పంట పెట్టని భూఆసామికి వెళుతుందని మా దృష్టికి తీసుకొని రండి మనందరము బాధ్యత తీసుకొని ప్రతి రూపాయి కూడా కౌలు రైతులకే నష్ట పరిహారం చేరే విధంగా చేద్దామని, దానికి మీరందరు కూడా సహకరించాలని కోరుతున్నాను. మిగిలిన ప్రభుత్వ ప్రాపర్టీస్ గురించి దీనిలో ఏమి మాట్లాడలేదని అన్నారు. రూ.3,566.00 కోట్లు కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. కేంద్ర ప్రభుత్వం అంత ఇవ్వరు. ఎప్పుడు కూడా అడిగినంత ఇచ్చిన సందర్భాలు గత కాలంలో లేదు, భవిష్యత్తులో కూడా ఉంటుందని అనుకోవడం లేదు. దీనిలో రెస్క్యూ అండ్ రిలీఫ్‌కి రూ.338.00 కోట్లు, టెంపరరీ రెస్టోరేషన్ రూ.543.00 కోట్లు వీటికి వస్తుందేమో కాని permanent restoration గురించి రూ.2,600.00 కోట్లు అడిగాము, ఇవ్వకపోవచ్చు. 1995 నుండి 2004 మధ్యలో ఒక సంవత్సరం మినహా మిగతా అన్ని సంవత్సరాలు వరదలు, కరువులతో నష్టపోయాం. కేంద్ర ప్రభుత్వం ఆరోజు 1995 నుండి 2004 వరకు మొత్తం కాలానికి గాను రూ.2,129.00 కోట్లు విడుదల చేసింది.

మ.2.00

ఈ మధ్యనే మేము వచ్చిన తరువాత నుండి ఆ తొమ్మిది సంవత్సరాలకంటే ఇది కొంత మంచి సమయంగా భావించవచ్చు. అయితే వరదలు, కరువులు వచ్చాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు వచ్చిన నిధులు రు.5894 కోట్లు. కేంద్రప్రభుత్వం ఇచ్చినా ఇవ్వకపోయినా నష్టపోయిన రైతులు, చేనేతకారులు, మత్స్యకారుల విషయంలో ఎవరు ఉదారంగా ఉన్నారనేది చూడాలి. ఆనాడు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఆ తొమ్మిది సంవత్సరాలు (1995-2004) ఖర్చు పెట్టినటువంటి డబ్బు రు.561 కోట్లు మాత్రమే. కానీ 2004 నుండి 2012 సంవత్సరం వరకు ఇప్పటికే మేము రాష్ట్ర ఖజానా నుంచి రు.2726 కోట్లు ఇవ్వడం జరిగింది.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

శ్రీ అరికెల నర్సారెడ్డి ః ఆ రోజు రు.9000 కోట్ల బడ్జెట్. ఇప్పుడు రు.1,50,000 కోట్లు.

శ్రీ ఎన్.రఘువీరారెడ్డి ః ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి కాదు. దాదాపు మొత్తం నష్టం రు.4400 కోట్ల వరకు జరిగిందని మా దగ్గర ఉన్న అంచనాలు. రు.1000 కోట్ల వరకు ఇవ్వమని ముఖ్యమంత్రిగారు కేంద్రప్రభుత్వానికి లేఖ రాశారు. రు.3566 కోట్ల వరకు ఇవ్వమని ఈ రోజు మళ్ళీ కేంద్రప్రభుత్వానికి మెమోరాండమ్ పంపిస్తున్నాము. గతంలో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తరువాతనే రైతులకు కేటాయించేవారు. కానీ గౌరవ ముఖ్యమంత్రిగారు ఒకటి, రెండు సంవత్సరాల నుంచి ఆ పద్ధతిని మొత్తం మార్చారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుదాం. వారు ఇచ్చినా, ఇవ్వకపోయినా సకాలంలో రైతాంగానికి రాష్ట్ర ఖజానా నుంచి డబ్బులు ఇచ్చే ఒక సాంప్రదాయాన్ని మొదలుపెట్టడం జరిగింది. అది కొనసాగుతుందని మనవి చేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

ఈ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రిగారిని, ముఖ్యమంత్రిగారిని ప్రత్యేకంగా మనమందరమూ కూడా అభినందించాల్సిన అవసరం ఉంది. రీషెడ్యూల్ చేయమని మామూలుగా అడుతుంటాము. మన కామ్రెడ్‌లకైతే రీషెడ్యూల్ చేయమని చెప్పడం చాలా ఇష్టమైనది. కానీ రీషెడ్యూల్‌మెంట్ వల్ల రైతులకు నష్టం. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఉన్నపుడు లాభ నష్టాలు లేకుండా ఉండేది. ఈ రోజు మేము వడ్డీలేని రుణాలు ఇచ్చేటువంటి రాష్ట్రంగా ఈ దేశంలో మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాము. ఆ ఇస్తున్నటువంటి నేపథ్యంలో రీ-షెడ్యూల్ చేస్తే, వడ్డీ రాయితీ దొరకదు, వడ్డీ లేని రుణం కాదు, నాలుగు శాతం, ఏడు శాతం కాదు. సరాసరి రీ-హెడ్యూల్ చేస్తే, 14 శాతం వడ్డీ రైతులు భరించాల్సి వస్తుంది. అందువల్ల ఇది తప్పు, మీ పాలసీ మారాలని చిదంబరంగారితో, కేంద్రప్రభుత్వంతో గౌరవ ముఖ్యమంత్రిగారు, ఆర్థికమంత్రిగారు చెప్పడం జరిగింది. ఈ విధమైన నష్టం జరిగినపుడు ప్రకృతి వైపరీత్యాలు జరిగి రైతులు వడ్డీ కట్టలేనపుడు మీరు వాటిని భరించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, రీ-షెడ్యూల్ అయినా కూడా ఒక్క నాలుగు శాతం వడ్డీని మాత్రమే వసూలు

చేసే విధంగా చేశారు. దీని వల్ల ప్రత్యేకంగా మన రాష్ట్రానికే ఎక్కువ ఉపయోగం ఉంటుంది. దేశంలో ఉన్న రైతులందరూ ముఖ్యమంత్రిగారికి, ఆర్థికమంత్రిగారికి కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఉంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

అదే విధంగా మురుగునీటి వ్యవస్థను ఆధునికీకరించాలని చెప్పారు. దానిని ముఖ్యమంత్రిగారు వివరిస్తారు. ఇప్పటికే వాటికి మంజూరు చేయడం జరిగింది. పాద యాత్ర గురించి ఒకరిద్దరు మాట్లాడారు. మన కళ్ళ ఎదుటనే వేల కొలది టి.ఎం.సి నీళ్ళు సముద్రం పాలవుతున్నాయి. కాంగ్రెసు పార్టీ పాలసీలో ఏమి నిర్ణయించుకున్నామంటే, గోదావరి వేల టి.ఎం.సిల నీరు ఏదైతే సముద్రం పాలవుతుందో అది కృష్ణా పరీవాహక ప్రాంతానికి తీసుకువచ్చి, అక్కడ స్టెబిలైజ్ చేసి, అక్కడ సర్‌ప్లస్‌గా ఉన్న నీటిని పెన్నా బేసిన్‌లోకి తీసుకువెళ్ళాలి అనేదానిలో భాగమే ఆ రోజు దాదాపు మూడు లక్షల మందితో మేము ఆ పాద యాత్రలో పాల్గొనడం జరిగింది. ఇది 50 సంవత్సరాల మా జిల్లా, మా ప్రాంత వాసుల కల.

(ట్రెజరీ బెంచెస్ నుండి చప్పట్లు)

ఆ కల నిజమైనటువంటి వేళ. ఆ నీళ్ళు తీసుకువెళ్ళడం జరిగింది. ఈ రోజు కాంగ్రెసు పార్టీ, కాంగ్రెసు పార్టీ ప్రభుత్వాల యొక్క పాలసీలో భాగమే కానీ వ్యక్తిగతంగా ఏమీ లేదు. మీరందరూ అర్థం చేసుకోవాలి. గత సమావేశాలలో కరువు గురించి మాట్లాడాము, ఇప్పుడు తుఫాను గురించి మాట్లాడుతున్నాము. ప్రతి సమావేశాలలో ఏదో ఒక విపత్తు గురించి మాట్లాడడమే జరుగుతుంది. రాబోయే పది, పదిహేను సంవత్సరాలలో ఈ రెండిటికీ కూడా పరిష్కారం ఇదొక్కటేనని మా ప్రభుత్వం భావిస్తోంది కాబట్టి అది కూడా చేయడం జరుగుతుందని మనవి చేస్తూ, మిగిలిన విషయాలను గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పడం జరుగుతుంది. ఈ ప్రభుత్వానికి ఎక్కడా ఉదాసీనత కానీ, నిర్లక్ష్యం కానీ లేనేలేదు. ఎక్కడైనా మీకు సమాచార లోపం ఉంటే ఉండవచ్చు కానీ, అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ ప్రకృతి వైపరీత్యాలలో కష్టాలు తగ్గించడానికి అన్ని ప్రయత్నాలు మేము పూర్తి బాధ్యతతో చేస్తాము. మాకు తెలిసి కానీ తెలియక కానీ ఏమైనా వైఫల్యాలు ఉన్నా వాటికి నూటికి నూరుపాళ్ళూ బాధ్యత మాదేనని చెప్పడానికి మాకెటువంటి సంకోచంలేదు. అందరినీ ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాము.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, మంత్రిగారు ఇన్‌పుట్ సబ్సిడీ గురించి తెలుగు దేశం ప్రభుత్వంలో ఇంత ఇచ్చారు, ఇప్పుడు ఇంత ఇచ్చారని చెప్పారు. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బడ్జెట్ ఎంత. ఈనాడు బడ్జెట్ ఎంత? అప్పటికీ ఇప్పటికీ బడ్జెట్ ఆరు రెట్లు పెరిగింది. ఆరు

రెట్లు దామాషా పద్ధతిన చూసుకున్నా మీరు ఆరు రెట్లు ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలి కదా! ఎక్కడ పెంచారు? బడ్జెట్‌ను బట్టి, పరిస్థితిని బట్టి, ఆర్థిక పరిస్థితిని బట్టి ఆరోజుల్లో అది ఇవ్వడమే గొప్ప. ఇన్‌పుట్ సబ్సిడీని మొదటిసారిగా ప్రవేశ పెట్టింది తెలుగుదేశం ప్రభుత్వమే. అంతకు ముందు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడమనే పద్ధతి లేదు. రైతుకు నష్ట పరిహారాన్ని ఇవ్వాలని మా ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగింది. అప్పటి ఆర్థిక పరిస్థితిని బట్టి సుమారు రూ.500 వరకు పెంచడం జరిగింది. ఈ రోజు పెరిగిన బడ్జెట్‌ని, రైతుల ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్నింటినీ పరిశీలించి ఇన్‌పుట్ సబ్సిడీని విపరీతంగా పెంచితే తప్ప రైతు నిలబడే పరిస్థితి ఏమాత్రం ఉండదని తెలియజేస్తున్నాను. రెండవది, కరువు గురించి చెప్పారు. కరువు సమయంలో రూ.1800 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఇంతవరకు రూ.1400 కోట్లు పంచినట్లుగా మా దగ్గర సమాచారం ఉంది. మిగిలిన డబ్బు ఎంత వుంది.

మ.2.10

ఇంతవరకూ సుమారు రూ.1400 కోట్లు డిస్ట్రిబ్యూట్ అయినట్లుగా మా దగ్గర సమాచారం ఉంది. మిగిలిన ఖర్చుపెట్టని అమౌంట్ ఎంత? విశాఖపట్టణం జిల్లాలో సుమారు రూ.17,000 కోట్లు ఆన్‌లైన్ డిస్ట్రిబ్యూట్ జరగలేదు. దీనికి సంబంధించి మేము ఎన్నోసార్లు అధికారులను అడిగినా, ఈ రోజు వస్తుంది, రేపు వస్తుందని అంటున్నారు. అసలు సమస్య ఏమిటో మాకు తెలియడం లేదు. అసలు అమౌంట్ ఎంత ఉంది? దానిని ఎప్పటిలోగా ఆ ప్రాంతంలోని రైతులకు ట్రాన్స్‌ఫర్ చేస్తారని మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

కరవు పరిస్థితులలో పశుగ్రాసానికి సంబంధించి సుమారు 15 లక్షల టన్నుల వరకూ కొరత వచ్చింది. దానిని సకాలంలో సరఫరా చేయలేకపోయాము. ప్రస్తుతం పశుగ్రాసానికి సంబంధించి అదనంగా సరఫరా చేయవలసిన అవసరం ఉంది. దానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలను తీసుకుంటోంది. ఇతర రాష్ట్రాల నుంచి అయినా పశుగ్రాసాన్ని తెప్పించి మన రాష్ట్రంలోని పశువులకు అందించవలసిన అవసరం ఉంది కాబట్టి, ప్రభుత్వం ఈ అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని తక్షణమే తగిన చర్యలు చేయవలసిందిగా కోరుతున్నాను.

అదేవిధంగా ఇన్సూరెన్సుకు సంబంధించి 2011వ సంవత్సరం ఖరీఫ్ కాలంలో సుమారు రూ.134 కోట్ల ప్రీమియంను రైతులు చెల్లించారు. ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్సు చేయడం జరగలేదు. అందుచేత సుమారు 54 లక్షల ఎకరాలకు 15 లక్షల మంది రైతులు ఇన్సూరెన్సు చేశారు. ఆ ఇన్సూరెన్సు చెల్లింపులకు సంబంధించి తగిన ప్రాసెస్ చేయించి, దానిమీద తగిన చర్యలు చేపట్టి, ఆ ఇన్సూరెన్సు డబ్బులు తిరిగి రైతులకు వచ్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా?

ఇంతకు ముందు మంత్రిగారు చెప్పినట్లుగా సుమారు 58 మంది చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు కొంత మొత్తం చెల్లించారని అన్నారు. దానిని ఏ అకౌంటులో చెల్లించారు? మీరు చెప్పినట్లుగా నేను చెప్పిన అంశాన్నే అంటే సుమారు రూ.9కోట్లు అని చెప్పాను, ఆ అంశాన్నే మీరు ఎండార్స్ చేశారు. అందులో ఉన్నటువంటిది ఏమిటంటే, 111 (04) అకౌంటు. అది రూ.21,50,000లు మాత్రమే చెల్లించినట్లుగా 05.12.2012న ఇచ్చిన స్టేట్‌మెంటులో ఉన్నది. అదే స్టేట్‌మెంట్‌ను మీరు ఇంతకు ముందే నిర్ధారించారు. 58 మందికి సుమారు రూ.21 లక్షలు చెల్లించినట్లుగా ఉంది. అటువంటప్పుడు 50 మందికి ఏ అకౌంట్ నుండి చెల్లించారు. ఈ అంశాలపై క్లారిటీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

అదేవిధంగా, ధాన్యం, ప్రత్తి, మొక్కజొన్న మొదలైన పంటలకు సంబంధించిన కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. తడిసిన, రంగు మారిన ధాన్యమునకు సంబంధించి కొంత రిలాక్సేషన్ ఇవ్వవలసిన అవసరం ఉంది. అలాగే తెలుగుదేశం ప్రభుత్వ హయాములో సుమారు 20 శాతం వరకూ రిలాక్సేషన్ ఇస్తూ, జీవోలను విడుదల చేయడం జరిగింది. అటువంటి పరిస్థితులు ఈ రోజున కూడా వచ్చాయి. కాబట్టి, ఈ రిలాక్సేషన్లను పెంచుతూ, జీవోలను విడుదల చేస్తే తప్ప, అసలు కొనుగోలు చేసే పరిస్థితిలో జిల్లా కలెక్టర్లు లేరు. కాబట్టి, ఈ పంటలకు సంబంధించి ప్రభుత్వం రిలాక్సేషన్ ఇస్తూ, ఎప్పటిలోగా జీవోలను విడుదల చేస్తారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. పూర్తిస్థాయిలో డ్యామేజ్ అయిన పంటలకు కనీసం 25 శాతం వరకూ అయినా రిలాక్సేషన్ ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. వీటిని ఎప్పటిలోగా ఇస్తారో తెలియజేయాలని కోరుతున్నాను. చెరకు పంటకు సంబంధించి కూడా చాలా నష్టం సంభవించింది. చెరకు ఫ్యాక్టరీలలో చెరకుకు సంబంధించిన ధర కూడా బాగా తగ్గిపోయింది. ఆ ధరను కూడా పెంచే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు ః అధ్యక్షా, ఈ ప్రభుత్వానికి తుఫానులు, వరదలు, కరవు వచ్చినపుడే ఇటువంటి హడావుడి చేయడం జరుగుతోంది. అలాకాకుండా, ఒక స్పష్టమైన విధానాన్ని ఏమైనా రూపొందిస్తారా? అసలు వీటికి సంబంధించి బడ్జటులోనే స్పష్టమైన కేటాయింపులు ఉండాలి. కరవు, వరదలు వచ్చినప్పుడు సుమారు రూ.500 కోట్లు ఇలా కేటాయింపులు జరిగి ఉంటే, ఇటువంటి ఇబ్బందులు తలఎత్తవు. ఎందుకంటే, జనగణన చేయడానికి నిధులు లేని పరిస్థితి ఉందని, మీరు ఇచ్చిన నివేదికలో ఉంది. కానీ, బడ్జెటులోనే కేటాయింపులు ఉంటే, మనం ఈ బాధలు పడవలసిన అవసరం ఉండదు కాబట్టి బడ్జెట్‌లోనే వీటికి సంబంధించిన నిధులు కేటాయించాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే వీటికి సంబంధించి ఒక శాశ్వతమైన యంత్రాంగం కూడా ఉండాలి. అలాగే ఈ కరవు, వరదలను

తట్టుకునే విధంగా శాశ్వత యంత్రాంగాన్ని కనుక ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లయితే, మీకు, ప్రజలకు ఈ ఇబ్బందులు రావు. అదేవిధంగా కరవు ప్రాంతాలకు, ఈ భారీ నీటి ప్రాజెక్టుల ద్వారా మైనర్ ఇరిగేషన్‌తో అనుసంధానం చేసినట్లయితే బాగుంటుంది. మంత్రిగారు పాదయాత్ర చేసినప్పుడు సుమారు 3 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారని అన్నారు. చాలా సంతోషం. ఆ విధంగా ప్రజల కోరిక నెరవేరినందుకు మీకు ధన్యవాదాలు.

శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి : మీ వాళ్లు అందరూ కూడా వచ్చారు. దానికి స్వాగతించండి.

శ్రీ చేరుపల్లి సీతారాములు : సార్, మంచి పనికి రావడం తప్పు కాదు కదా. దీనిని తప్పనిసరిగా స్వాగతిస్తాము. కానీ, ఇది ప్రణాళికాబద్ధంగా చేయడం లేదనే మా బాధ. దీనిని రాజకీయబద్ధంగా కొనసాగిస్తున్నారు. అందువలనే మేజర్ ఇరిగేషన్‌ను మైనర్ ఇరిగేషన్‌కు అనుసంధానం చేయడం వలన ఈ కరవు పీడిత ప్రాంతాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. అలాగే చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచినట్లయితే, ఆ కుటుంబాలను ఆదుకున్నట్లు అవుతుంది. వీటివలన ప్రభుత్వం కొంప ఏమీ మునిగిపోదు.

(సభలో సభ్యుల నవ్వులు)

ఈ విధంగా చేసినట్లయితే, మీరు దేశంలో ఆదర్శంగా ఉంటారు. చనిపోవడం వాళ్ళ పాపం కాదు. ప్రకృతి వైపరీత్యం వలన వాళ్లు ప్రాణాలు కోల్పోయారు. వారిని ఆదుకోవడం తప్పు కాదు. ఆ కుటుంబాలకు రూ.5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చినట్లయితే బాగుంటుందని మా అభిప్రాయం. అదేవిధంగా డ్రైనేజి వ్యవస్థకు సంబంధించి దానికి కూడా ఒక శాశ్వతమైన ప్రాతిపదికను రూపొందించవలసిన అవసరం ఉంది. ఇందులో నిర్లక్ష్యం ఉంది. ఇందులో పనులు ఎక్కువ జరగడం లేదు. కాబట్టి, ఈ అంశానికి సంబంధించి కూడా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ జల్లి విల్సన్ : అధ్యక్షా, కృష్ణా డెల్టా, గోదావరి డెల్టా ప్రాంతాలలో డ్రైనేజి వ్యవస్థ పకడ్బందీగా లేకపోవడం వలన ఆ ప్రాంతాలలో వచ్చిన అధిక నీరు అంతా పంటపొలాలలోకి వెళ్ళడం వలన పంటలు తీవ్రంగా నష్టపోవడం జరుగుతోంది. ఊళ్ళకు ఊళ్లే మునిగిపోవడం జరుగుతోంది. అలాగే శ్రీకాకుళం జిల్లాలోని కాకరాలపల్లిలో ఉన్న ఈస్ట్‌కోస్టు పవర్ ప్లాంటులో డ్రైన్‌ను మూసివేయడం జరిగింది. దానిని తక్షణమే పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా కృష్ణాజిల్లాలోని బుడమేరు వరద బిడిఎస్ (బుడమేరు డైవర్షన్ స్కీం) అని పెట్టారు. అది సక్రమంగా పనిచేయడం లేదు. బుడమేరు వద్ద విజయవాడ చుట్టుప్రక్కల గ్రామాలు, పంటపొలాలను అన్నింటిని ముంచెత్తుతోంది.

కాబట్టి ఈ బుడమేరు డైవర్షన్ స్కీమును పకడ్బందీగా అమలు అయ్యేవిధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఆపద్బంధు పద్ధతిలో ఇచ్చే మొత్తాన్ని పెంచే ఆలోచన చేయాలని కోరుతున్నాను. కేంద్రప్రభుత్వం దగ్గర నుండి సుమారు రూ.3,566కోట్లు అడిగామని, అవి అన్నీ రావని మన మంత్రిగారు చెపుతున్నారు. ఈ నిధులు మరింతగా వచ్చే మార్గాలను ప్రభుత్వం అన్వేషించాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : అధ్యక్షా, మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో ఒకటి శ్రీకాకుళం ముంపుకు సంబంధించిన అంశంలో గంగవరం పోర్టులో అడ్డంగా కట్టిన గోడకు సంబంధించిన అంశానికి సంబంధించి మరియు డిఆర్‌సిలు, ఆసుపత్రులు, పాఠశాలలు చాలా మునిగిపోయాయి. వీటికి సంబంధించి మంత్రిగారు స్పందించలేదు. ఈ అంశాలకు సంబంధించిన వివరణ ఇవ్వాలని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి : అధ్యాక్షా, గౌరవ సభ్యులు రెండు అంశాలు అడిగారు. ఎందుకంటే, ప్రస్తుతం సమయం ఎక్కువగా లేదు కాబట్టి, ముఖ్యమంత్రిగారు కూడా మాట్లాడాలి. ఇన్పూరెన్సుకు సంబంధించి గౌరవ సభ్యులు ప్రస్తావించారు. ఈ అంశాలు చెప్పినప్పుడు సభ్యులకు కొంత బాధ కలుగుతుంది. దానికి నేను ఏమీ చేయలేను. దీనికి సమాధానం ఎలా చెప్పాలో తెలియకుండా ఉంది. నేనేమో పల్లెటూరి వాడిని.

(సభలో సభ్యుల నవ్వులు)

శ్రీ బి. మోహన్ రెడ్డి : ఎవ్వరికీ బాధ కలగకుండా, ఎవరినీ నొప్పించకుండా చెప్పండి.

***మ.2.20***

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి : అధ్యక్షా! ఈ తొమ్మిది సంవత్సరాలలో కరువుకు, వరదలకు సుమారు రూ.598 కోట్లు ఇన్సూరెన్సు ఇచ్చారు. ఇప్పటివరకు రూ.3,971 కోట్లు రైతాంగానికి ఇన్సూరెన్సు ఇవ్వడం జరిగింది. టి.ఆర్.27నే కాకుండా కలెక్టర్ల దగ్గర ఏదైతే బ్యాలెన్సు అమౌంటు వుందో అది కూడా ఇచ్చారు. 58 మందికి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వడం జరిగింది. I am going on record. మనం సభలో ఉన్నాము. 61 మందిలో 58 మందికి డబ్బులు ఇవ్వడం జరిగింది.

శ్రీ దాడి వీరభద్రరావు : సార్. ప్రభుత్వం ఇచ్చిన స్టేట్ మెంటు చూడండి. 1-11 (04) ఇందులో రూ.21 లక్షల 50 వేలు, exgretia payment to bereaved families. ఎక్స్‌గ్రేషియా రూ.21 లక్షల 50 వేలు. ఇదే అకౌంటు వుంది. వేరే అకౌంటు ఎక్కడ వుంది, ఎందుకు ఇచ్చారు. ఈ అకౌంటు ఎందుకు వాడలేదు. ఇందులో చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. నాలుగు జిల్లాలలో ఇవ్వడం జరిగింది.

(అధికార పక్ష సభ్యులు - వేరే అకౌంటులో ఇచ్చి ఉంటారు.)

శ్రీ దాడి వీరభద్రరావు : ఈ అకౌంటులో ఎందుకు వాడలేదు. అంటే దొంగ అకౌంటు కూడా మెయింటెన్ చేస్తున్నారా. ఒక అకౌంటు వుంది కదా. ఇందులో నుంచి ఎందుకు ఇవ్వలేదు. ఒక వేళ ఇచ్చినా మాకు తెలియజేయాలి కదా. నెట్‌లో ఎందుకు పెట్టలేదు. మాకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు. ఇంతే చెల్లించారని ఇందులో ఇచ్చారు. మీరు సభలో వేరే లెక్కలు చెపుతున్నారు. ఏది నమ్మమంటారు, ఎలా నమ్మమంటారు. It is an authentic statement issued by the Government. ఇది తప్పని మీరు చెపుతారా? చెప్పండి.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి : అధ్యక్షా! చనిపోయిన కుటుంబాలకు డబ్బు ఇచ్చామా లేదా అనేది ఇక్కడ ముఖ్యం. ఏ డబ్బులు ఇచ్చాము, ఏ అకౌంటులో ఇచ్చాము అనేది కాదు. డబ్బు వెంటనే ఇవ్వండని కలెక్టర్లకు స్వేచ్ఛ ఇచ్చాము. మీ దగ్గర డబ్బులు లేకపోతే టి.ఆర్.27 క్రింద తీసుకోమన్నాము. అది కాక వేరే డబ్బులు ఉంటే ఇస్తాము. అంతే కాని దాన్ని అంత టెక్నికల్ చేయాల్సిన అవసరం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. కానీ ఖర్చులు పెరుగుతున్నప్పుడు రైతుల ఖర్చులను మనం ఏ విధంగా తగ్గిస్తున్నామనేది ముఖ్యమైన విషయం. ఉచిత కరెంటు, వడ్డీ లేని ఋణాలు, ఇబ్బంది వచ్చినపుడు వడ్డీని మాఫీ చేయడం లేకపోతే ఇబ్బంది వచ్చినపుడు ఋణాలను మాఫీ చేయడం, విత్తనాలకు సబ్సిడీ రూ.350 కోట్లు, వారు అధికారంలో ఉన్నప్పుడు సబ్సిడీ పదుల కోట్లలో కూడా లేదు. ఈ కార్యక్రమాలన్నీ కాంగ్రెసు ప్రభుత్వంలోనే ఉన్నాయి. ఖర్చులు తగ్గించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుంది. ఇంకా చేయాల్సింది కొంత ఉంది. కానీ ప్రతిపక్ష సభ్యులు పదే పదే ఏమంటున్నారంటే బడ్జెటు మీరున్నప్పుడు అంతుంది, ఇంతుంది అంటున్నారు. మేము కాదని చెప్పడం లేదు. కానీ 1995 - 2004 వ సంవత్సరం వరకు పెరిగిందా? లేదా. లేక పోతే అలాగే ఉందా. ఈ రోజు ముఖ్యమంత్రిగారు ఆ లెక్కలు చెపితే మీకు దిమ్మతిరుగుతుంది. రాజకీయంగా మనం మాట్లాడుకోవద్దు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఇంకొక విషయం మీరు ఎకరానికి 10,000 రూపాయలు ఇవ్వాలన్నారు. నేను అభినందించాను.

శ్రీ దాడి వీరభద్రరావు : సార్. ఒక్క నిమిషం. నేను మాట్లాడేటప్పుడు మా ప్రభుత్వంలో ఇంత చేశాము. మీ ప్రభుత్వం ఎంత చేశారని నేను ఎప్పుడూ చెప్పలేదు. మొత్తం నా స్పీచ్‌లన్నిటిలో ఎప్పుడూ

చెప్పలేదు. కానీ మంత్రిగారు పోస్టుమార్టం చేసే ఒక డాక్టరు లాగా మొత్తం పాతవన్నీ కూడా తీస్తున్నారు. మీరు అధికారంలో ఉన్నారు. మీరు ఏం చేస్తారో చెప్పండి. మా డిమాండ్లను మేము చెప్పాము. మీరు ఏమి చేస్తారో చెప్పండి. అవన్నీ కాకుండా అప్పుడు అంత, ఇప్పుడు ఇంత ఇవన్నీ ఎందుకు. నేను రాజకీయం చేయలేదు. మీరు చేస్తున్నారు. రైతుల విషయాన్ని రాజకీయం నేను చేయలేదు. మీరు రాజకీయం చేసి మాట్లాడుతున్నారు. దయచేసి మీరు ఏమి చేయదలచుకున్నారో చెప్పండి.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి ః అధ్యక్షా! వారు తొమ్మిదేళ్ళు అధికారంలో ఉన్నారు, వారు మంత్రిగా కూడా ఉన్నారు కాబట్టి వారికి గుర్తు చేశాను అంతే.

శ్రీ డి.శ్రీధర్‌బాబు (మంథని) ః అధ్యక్షా! గౌరవ సభ్యులు ప్రధానంగా తడిసిన, రంగుమారిన ధాన్యం గురించి చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రిగారు ఎఫ్.సి.ఐ కి సంబంధించిన ప్రొక్యూర్‌మెంట్ విషయంలో రిలాక్సేషన్ ఇవ్వాలని చాలా పట్టుపట్టడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి టీం కూడా తొందరగా రావడం జరిగింది. అసెస్‌మెంట్ కూడా జరిగింది. ఒక్కొక్కటీ చేస్తున్నాము. In the meanwhile డిపార్టమెంట్‌ద్వారా రంగు మారిన ధాన్యాన్ని, తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి స్థాయిలో రైతు సోదరుల దగ్గర నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ః అధ్యక్షా! ముఖ్యంగా రెండు ప్రధాన అంశాలు ఉన్నాయి. రంగు మారిన ధాన్యం – ప్రత్తి కొనుగోలు. ఈ రెండూ కూడా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశాలు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి కొనుగోలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. ధాన్యం అయితే వెంటనే కొనుగోలు చేయమని చెపుతాము. కొన్ని చోట్ల మాత్రం కేవలం పొట్టు మాత్రమే రంగు మారింది. లోపల బియ్యం బాగానే ఉన్నాయి. వీలైనంతవరకు అన్నింటినీ ప్రొక్యూర్ చేయడానికి ప్రయత్నం చేస్తాము. అదేవిధంగా Cotton Corporation of India (CCA) మీద కూడా ఖచ్చితంగా ఒత్తిడి తెస్తాము. ఇప్పటికే మాట్లాడాము. కొనుగోలు సక్రమంగా జరగడంలేదని ప్రతిపక్ష సభ్యులు అంటున్నారు. ఈ రోజు అధికారులతో దీనికి సంబంధించిన సమీక్ష జరిగింది. ఇప్పుడు కూడా సభ అయిపోయిన తరువాత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఎంత ధరను అనౌన్సు చేశారో, ఆ ధరకు నేరుగా రైతుల దగ్గర నుంచే కొనుగోలు చేయాలి, మధ్యవర్తుల నుంచి కొనుగోలు చేస్తే ఇబ్బందులు వస్తాయని స్పష్టంగా చెప్పడం, ఆదేశాలు కూడా ఇవ్వడం జరుగుతుంది. వీటిలో వీరభద్రరావుగారు మాట్లాడినట్లు – ఒక వ్యక్తిని నువ్వు పొట్టిగా ఉన్నావు అన్నామనుకోండి. లేదు నేను నీ కంటే పొడుగుగా వున్నానని చెప్పాలి కదా. కంపారిజన్ లేకపోతే ఎవరు పొట్టి, ఎవరు పొడుగో తెలియదు. కంపారిజన్, స్టాటిస్టిక్స్ ఎందుకు వాడతామంటే అప్పుడు ఏ విధంగా జరిగింది, ఇప్పుడు ఏ విధంగా జరుగుతుందని లేకపోతే అప్పటికంటే ఇప్పుడు మెరుగ్గా చేస్తున్నామనేదే తప్ప వేరేది కాదు.

2.30p.m.

రెండు, మూడు విషయాలు మనం స్పష్టంగా తెలుసుకోవలసిన అవసరం వుంది. ఇప్పటికే మంత్రివర్యులు చాలా ఎలాబరేట్‌గా చెప్పారు. దగ్గర దగ్గర రూ.4వేల కోట్లు గత రెండు సంవత్సరాలలోనే మనం గానీ, కేంద్ర ప్రభుత్వం నుంచి గానీ ఇన్‌పుట్ సబ్సిడీ క్రింద ఇవ్వడం జరిగింది. చాలా సంవత్సరాల నుంచి వున్న పాత బకాయిలను కూడా క్లియర్ చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ తొమ్మిది సంవత్సరాల పాటు అధికారంలో వున్నపుడు కేవలం రూ.561 కోట్లను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటు నుంచి నిధులను వాడడం జరిగింది. 2005 నుంచి 2010 వరకు ఈ ఐదు సంవత్సరాలలో రూ.858కోట్లను మన బడ్జెటు నుండి వాడాము. నీలం తుఫాను గాకుండా గత రెండు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు కేంద్రం నుంచి వచ్చిన రూ.2వేల కోట్ల పైచిలుకే గాకుండా రూ.1867కోట్లను మన రాష్ట్ర బడ్జెటు నుంచి రైతులకు ఇవ్వడం జరిగింది. ఇది రైతు ప్రభుత్వమని ధైర్యంగా చెప్పగలగడం, ధైర్యంగా వారి ముందుకు వెళ్లి, కొన్ని కష్టాలున్నప్పటికీ వారికి మేలు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేయడం జరుగుతోంది. 2010లో 680 మండలాలలో తుఫాను వచ్చినపుడు రైతులకు వడ్డీ మాఫీ చేయడం జరిగింది. మాఫీ అయిన వడ్డీ మొత్తం రూ.351 కోట్లు అయింది. రూ. 351కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చయింది. పావలా వడ్డీ క్రింద రూ.133 కోట్లు చెల్లించడం జరిగింది. ఈవిధంగా చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది, మేలు జరుగుతుందని, అవసరాన్ని బట్టి వివిధ కార్యక్రమాలు మనం చేపట్టడం జరిగింది.

రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటే వడ్డీ 13 శాతం నుంచి 14 శాతం వుండేది. క్రమంగా అది 10శాతం అయింది, ఈరోజు 8.5శాతం వుంది. ఆ 8.5శాతంలో ఒకటిన్నర శాతం నేరుగా కేంద్ర ప్రభుత్వం బ్యాంకర్స్‌కు ఇస్తుంది. అంటే అది 7శాతానికి వస్తుంది. ఎవరైతే ఒక సంవత్సరంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నారో అటువంటి రైతులకు కేంద్ర ప్రభుత్వం వడ్డీలో మూడు శాతం కన్షెషన్ ఇస్తోంది. అంటే రైతుకు నాలుగు శాతం వడ్డీ పడుతుంది. కేవలం మీరు అసలు కట్టండి, మీ తరపున ఆ నాలుగు శాతం వడ్డీ కూడా మేము కడతామని రైతులను కోరుతున్నాం . దగ్గర దగ్గర కోటి మంది రైతులకు లక్ష రూపాయల వరకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం జరుగుతుంది. ప్రణబ్ ముఖర్జీ గారు ఫైనాన్స్ మినిష్టర్‌గా వున్నపుడు నేను, మన ఫైనాన్స్ మినిష్టర్‌గారు చాలా గట్టిగా మాట్లాడాం, చాలా కష్టంగా కూడా మాట్లాడాం . మామూలుగా ఏడు శాతం వడ్డీలో కరెక్టుగా రుణాలు చెల్లిస్తే మూడు శాతం కన్షెషన్ ఇస్తూ, చివరకు నాలుగు శాతం వడ్డీకి ఇస్తున్నపుడు, కలామిటీ వచ్చిందని రీషెడ్యూల్ చేస్తే మళ్లీ 14 శాతం వడ్డీ వసూలు చేస్తే ఇదెక్కడి న్యాయమని చాలా గట్టిగా మాట్లాడాం. కానీ అప్పుడు దానికి ప్రతిఫలం రాలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్త గైడ్‌లైన్స్ ఇచ్చింది. ఆర్‌బిఐ కూడా మార్చిందని పోయిన మీటింగులో ఆర్థిక మంత్రి చిదంబరం గారు చెప్పడం జరిగింది. ఈ సంవత్సరం

రీషెడ్యూల్ అయితే నెక్స్ట్ ఇయర్‌లో రైతులు కరెక్టు టైములో తిరిగి కడితే, కేంద్రం మూడు శాతం సబ్‌వెన్షన్ క్రింద ఇస్తుంది, మిగిలిన నాలుగు శాతానికి రుణాలు ఇస్తామని చెప్పారు. దీని వల్ల రాష్ట్ర రైతాంగానికి పెద్ద మేలు జరుగుతుంది. రీషెడ్యూల్ చేయకుండా వుంటే 14శాతం వడ్డీ కడుతున్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మంచి నిర్ణయం తీసుకుంది, రాష్ట్ర రైతుల తరపున కేంద్రాన్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను.

2004లో ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.1500లు ఉండేది. 2006లో దాన్ని రూ.1875 చేశారు. 2007లో రూ.2250 చేశారు, 2008లో రూ.4500లు చేశారు. 2009లో రూ.4500లుండేది . అసెంబ్లీ సమావేశాలు మొదలు కావడానికి ఆరేడు రోజుల ముందు నేను ముఖ్యమంత్రి అయ్యాను. అప్పుడు దాన్ని మేము రూ.6000 చేశాం . రూ.6000 కేంద్ర ప్రభుత్వం చేయలేదు, మనం చేశాం . కేంద్రం నుంచి హెక్టారుకు మనకు వచ్చే నిధులు కేవలం రూ.4500లు మాత్రమే, దాన్ని మనం రూ.6000 చేశాం . ఆ వ్యత్యాసంగా వున్న రూ.1500లను మన ఖజానా నుంచి ఖర్చు పెట్టవలసిన అవసరం వుంది.

శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ః అయా సంవత్సరాలలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయ వివరాలు కూడా చెప్పండి.

శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డిః ఆదాయం ఎంత వున్నా కూడా రైతులకు సహాయం చేయాలనే మనసు, తపన వుండాలి కదా ! ఇది రైతు ప్రభుత్వం, వారికి భరోసా కల్పించాలన్నదే మేము చేస్తున్న ప్రయత్నం . 2010లో నేను ఎనౌన్స్ చేసినపుడు హెక్టారుకు ఇన్‌పుట్ సబ్సిడీ క్రింద కేంద్రం రూ.4500లు ఇచ్చింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.6000 చేసింది. మనం హిస్టరీ తీసుకుంటే – మనం పంపించిన ప్రతిపాదనలలో 32 శాతం నుంచి 35 శాతం వరకే మనకు నిధులు కేంద్రం నుంచి వస్తాయి. ప్రత్యేకంగా ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో ఏ ప్రభుత్వం అక్కడ వున్నా, ఏ ప్రభుత్వం ఇక్కడ వున్నా ఒక ప్రొసీజరు ప్రకారం నిధులు కేటాయిస్తున్నారు, . మనం ఒక వంద కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్రం నుంచి మనకు కేవలం రూ.35కోట్లు మాత్రమే రావడం జరుగుతోంది. ప్రపోర్షనేట్‌గా మిగతా ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. పోయినసారి హెక్టారుకు రూ.4500 నుంచి రూ.6000లకు పెంచినపుడు అది 33 శాతం పెరిగింది. అంత ఎక్కువ పెంపుదల ఎప్పుడూ జరగలేదు, మొట్టమొదటిసారి ఆవిధంగా పెంచాం . మా కేబినెట్ మినిష్టర్స్ అందరూ కూర్చుని, రైతులకు చాలా నష్టం జరిగింది మీరు ఇంకా పెంచాలని కోరితే, పోయినసారి 33 శాతం పెంచాం, మళ్లీ పెంచుదామని మామూలుగా అనుకున్నాం . 2010లో పెంచాం, 2012లో రైతులు బాగా నష్టపోయారు, ఇబ్బందికరంగా వుంది, పెంచండని కోరితే ఈరోజు నుంచి పెంపుదల చేయడం జరుగుతోంది. వరి, వేరుశనగ, పత్తి, చెరకు తదితర వాటికి ఏదైతే మనం హెక్టారుకు రూ.6వేలు ఇస్తున్నామో, దాన్ని ఈరోజు రూ.10వేలకు పెంచడం జరుగుతోంది.

67శాతం పెంచాం, అన్నింటికీ అదే పద్ధతిలో 67శాతం పెంచడం జరుగుతుంది. ముందు మెయిజ్ కు రూ.5వేలు ఉండేది, దాన్ని రూ.8333 చేశాం . ఆవిధంగా pro rata పద్ధతిలో పెంచడం జరిగింది. 2010 నుంచి ఇప్పటి వరకు 120 శాతం పెంచాం . ఇప్పుడే వీరభద్రరావుగారు ఒక లెక్క చెప్పారు. అదే మంటే, అప్పుడున్న దాని కంటే ఆరు రెట్లు మీ ఆదాయం పెరిగిందని చెప్పారు. మీరన్నట్లుగా ఆరు రెట్ల యినా, హెక్టారుకు రూ.9వేలే అవుతుంది. కానీ మేము ఇప్పుడు రూ.10వేలకు పెంచాం . ఆరు రెట్ల కంటే ఎక్కువే పెంచాం . రైతులు ఇబ్బందులో ఉన్నారు కాబట్టి వారికి పెంచివలసిన అవసరం వుందని భావించి పెంచాం .

2.40 pm

అధ్యక్షా, ఆర్థిక పరంగా చూస్తే రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి ఏమంతా మెరుగ్గా లేదు. ఆదాయం పెరిగినా ఇబ్బందులున్నాయి. ఇవ్వన్నీ మనకు రెవెన్యూ ఎక్స్‌పెండెచర్ క్రిందకు వస్తాయి. క్యాపిటల్ ఎక్స్‌పెండెచర్‌ను, రెవెన్యూ ఎక్స్‌పెండెచర్‌ను మ్యాచ్ చేసుకుంటూ పోవాలి. ఈ సంవత్సరంలో క్యాపిటల్ ఎక్స్‌పెండెచర్‌కు రెవెన్యూ ఎక్సిపెండెచర్‌కు చాలా వ్యత్యాసం ఉంది. మనకు పంచాయతీ ఎన్నికలు, పురపాలక సంఘాలకు ఎన్నికలు జరగనందున కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన దాదాపు రూ.3,000కోట్లు నిలిచిపోయాయి. ఇన్ని సమస్యలున్నా, ఇప్పుడున్న పరిస్థితులను బట్టి పంట నష్ట పరిహారాన్ని పెంచేదానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ప్రభుత్వానికి కష్టాలు ఉన్నా కూడా, కష్టకాలంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందనే ఉద్దేశ్యంతో మేము ఈ కార్యక్రమం చేయడం జరిగిందని తెలియజేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షద్వానాలు)

ఇవే కాక, మోడరనైజేషన్ గురించి గౌరవ సభ్యులు మాట్లాడారు. పెద్ద ఎత్తున మోడరైనేజేషన్ మొదలు పెట్టి చాలా సంవత్సరాలైంది. కృష్ణా, గోదావరి కాలువల మోడరైనేజేషన్ గురించి దాదాపు రూ.7,500కోట్లు బడ్జెట్ అంచనా ఉందనుకుంటున్నాను. కాని, ఖర్చు అయింది మాత్రం చాలా తక్కువ. గత ఐదారు సంవత్సరాల నుండి మోడరైనేజేషన్ పనులు చేస్తున్నా గోదావరికి ఇంతకు ముందు రూ.500కోట్లు మాత్రమే ఖర్చు అయింది. పోయిన సంవత్సరం కొంచెం పద్దతి ప్రకారం ఎక్కువ ఖర్చు పెట్టాలని నిర్ణయించి, రూ.700కోట్లు వరకు ఖర్చు పెట్టాలని ప్లాన్ చేసినా ఇసుక ఇబ్బంది వచ్చినందున ఆ మేరకు పనులు జరగలేదు. 2011వ సంవత్సరంలో రూ.500కోట్లు వరకు ఖర్చు పెట్టగలిగాం. ఈసారి కూడా జాగ్రత్తగా ప్లాన్ చేసి ఎక్కడెక్కడ డ్రైన్స్ కాని, కాలువలు కాని అవసరం ఉన్నాయో, క్లీన్ చేయాల్సినవి ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి, చేయగలిగిన వాటి వరకే తీసుకొని చేసేదానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. రాష్ట్రంలోని రైతులు పెద్ద ఎత్తున ఇబ్బందికరమైవ

పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకప్రక్క కరువుకాటకాలు, మరొక ప్రక్క వరదలు వచ్చి మనకు ఇబ్బంది కలుగుతోంది. రెండు సమస్యల పరిష్కారం కోసమే జలయజ్ఞం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. వీటిని 2004 వ సంవత్సరంలో మొదలైన ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేయడం జరుగుతోంది. చాలా వరకు కొమరం భీం ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. తరువాత ఖమ్మం జిల్లాలో కిన్నెరసాని, తూర్పు గోదావరి జిల్లాలోని భూపతిపాలెం, మహబూబ్‌నగర్ జిల్లాలోని బీమా రెండవ దశ, కల్వకుర్తి, నెట్టంపాడు ప్రాజెక్టులను పాక్షికంగా ప్రారంభించి రైతులకు నీరు ఇవ్వడం జరుగుతోంది. పూర్తిగా నీరు ఇవ్వకున్నా పాక్షికంగా ఇవ్వడానికి ప్రాజెక్టులను ఇనాగ్యురేట్ చేశాం. తరువాత, హంద్రీ నీవా ద్వారా రైతులకు నీళ్లు ఇవ్వడం మొన్ననే జరిగింది. జల యజ్ఞం ప్రాజెక్టులన్నీ ఒకటే సంవత్సరం పూర్తి కావు. మనం అనుకున్న దానికంటే నిదానంగా పూర్తవుతున్నా కూడా ప్రాజెక్టులు పూర్తి చేసేదానికి, రైతులకు నీళ్లు ఇచ్చేదానికి ప్రయత్నం చేస్తున్నాం. నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొదలు పెట్టి దగ్గదగ్గర 50 సంవత్సరాలైంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం మొదలు పెట్టి దాదాపు 40 సంవత్సరాలైనా ఇంకా ఇప్పటికీ కొన్ని పనులు జరుగుతూనే ఉన్నాయి. జల యజ్ఞం ప్రాజెక్టులను రెండు, మూడు సంవత్సరాలు ఆలస్యంగా పూర్తి చేస్తున్నా కూడా, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎక్కడ పని జరగాలి, ఎక్కడ పూర్తి చేయాలని ఫోకస్ చేయడం జరుగుతోంది. స్థిరీకరణ చేయడం వల్ల దాదాపు 21 లక్షల ఎకరాలకు ఈ జలయజ్ఞం ప్రాజెక్టులలో ఇప్పటి వరకు నీళ్లు ఇవ్వగలిగాం. రాబోయే రెండు సంవత్సరాలలో 30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేదానికి దాదాపు రూ.16,000కోట్లు ఖర్చు పెట్టేదానికి ప్రయత్నం చేస్తున్నాం.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఈ ప్రాజెక్టులు పూర్తి అయినప్పుడు సముద్రంలోకి వృథాగా పోయే నీటిని కరువు ప్రాంతాలకు మరల్చడానికి అవకాశం ఉంటుంది. వీటితోపాటు ఒకప్రక్క ప్రాణహిత-చేవెళ్ల, మరొక ప్రక్క పోలవరం ప్రాజెక్టులు. ఈ రెండు ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా ఆమోదం పొందేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతోంది. ఈ రెండింటిని మనం జాతీయ ప్రాజెక్టులుగా తీసుకురాగలిగితే మనకు అంత ఖర్చు ఉండదు. ప్రాణహిత-చేవెళ్ల ఇప్పటికే ప్రధాన మంత్రి గారి ప్యాకేజీలో ఉంది. ఇప్పుడు మనం ఖర్చు పెట్టిన దానిలో 57 శాతం మాత్రమే తిరిగి వస్తుంది. అదే జాతీయ ప్రాజెక్టుగా ఆమోదం పొందితే, 90 శాతం మనకు రిఫండ్ వస్తుంది. అదే విధంగా, పోలవరం ప్రాజెక్టును కూడా జాతీయ ప్రాజెక్టుగా తీసుకురాగలిగితే దగ్గదగ్గర 90 శాతం రిఫండ్ వస్తుంది. పోలవరం, పులిచింతల రెండు ప్రాజెక్టులు కోస్తా ప్రాంతానికి చాలా ముఖ్యమైనవి.

ముఖ్యంగా ఈ ఇబ్బందులు మనకు ఎందుకు వస్తున్నాయనే దాని గురించి సభకు తెలియజెప్పాల్సిన అవసరముంది. ప్రతి సంవత్సరం జూన్ 1 వ తేదీకల్లా రైతాంగానికి మనం నీరు

ఇవ్వగలిగితే అక్టోబర్ మూడవ వారానికల్లా పంట చేతికొచ్చి ఈ తుఫానుల వల్ల కోస్తా ఏరియాలు చిక్కుకోకుండా ఉంటాయి. ఇప్పుడు నీరు లేకపోవడం వల్ల కాని, వివిధ కారణాల వల్ల కాని ఆగస్టు మొదటి వారం, రెండవ వారం దాకా నీరు ఇవ్వలేకపోతున్నాము. అందువల్ల పంట చేతికి రావాలంటే నవంబర్ దాకా ఆగవలసి వస్తుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నవంబర్‌లో వచ్చే తుఫానుల వల్ల ఆ ప్రాంత రైతాంగం నష్టపోవడం జరుగుతోంది. ఆక్టోబర్ 15 వ తేదీకల్లా పంట వారి చేతికి వచ్చేటట్లు పూర్తి చేసుకోగలిగితే ఈ తుఫానుల వల్ల పూర్తిగా తప్పించుకోవడానికి ఆస్కారం ఉందని నేను భావిస్తున్నాను. అది ఒక్కటే శాశ్వతంగా రైతులను కాపాడేదానికి పరిష్కార మార్గం. ఇప్పుడిచ్చే నీరు అంతా కూడా సముద్రంలోకి పోతుంది. సముద్రంలోకి పోయే నీటిని ఆపు చేసేదానికి, నిల్వ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. తుఫానులు ఐదారు సంవత్సరాలకు ఒకసారి వస్తే ఫరవా లేదు కాని, ప్రతి సంవత్సరం లేక రెండు సంవత్సరాలకు ఒకసారి రావడం వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ కూడా అన్ని అంశాలలో రైతులకు సహాయం చేయాలని, మెరుగైన పరిస్థితులను కల్పించాలని ప్రయత్నం చేస్తుంది. నష్టపోయిన రైతుకు ఎంత ఇచ్చినా కూడా తక్కువే. కాని, ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల వల్ల నష్టపరిహారాన్ని ఇంత వరకు మాత్రమే మేము పెంచగలిగామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

MR. DEPUTY CHAIRMAN : Now, the House is adjourned to meet again at 10-00 a.m. on Tuesday, the 11th December, 2012.

(The House then adjourned at 2-47 p.m.)